

# హరి మెచ్చిన "స్వరములు"

## ఎన్నుకొన్న తాళ్ళపాక సంకీర్తనలకు

## భావ వివరము



# హరి మెచ్చిన "స్వరములు"

## ఎన్నుకొన్న తాళ్ళపాక సంకీర్తనలకు

## భావ వివరము

శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు




# హరి మెచ్చిన "స్వరములు"

## ఎన్నుకొన్న తాళ్ళపాక సంకీర్తనలకు
## భావ వివరము

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

**M.Tech.**

# హరి మెచ్చిన స్వరములు

మొదటి ప్రచురణ

**జూన్ 2015**

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

వెల : **అమూల్యం**

ప్రతులకు :

ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,

హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. ప్రింటింగ్ ః

**కె.వి.ఆర్.**

98495 79345

# అంకితము



ఇంతకంటె గొప్ప "కుటుంబం" కలికెం వేసి చూచినా కనబడుతుందా? అందుకే అసామాన్యమైన ఈ కుటుంబానికినా ఈకృతిని అంకితమిస్తున్నాను.

ఉ॥ **ఆదిమశక్తి చెల్లెలట, ఆ'లయకారుడు' బావ, జీవులన్**
**మేదిని బంపునీకొడుకు, మించిన విద్యలరాణికోడలౌ**
**పోది రతీపతే సుతుడు, భూసిరి భార్యలు, దాసులేహితుల్**
**మీదయకోరి యీకృతిని మీకు నొసంగెద వేంకటేశ్వరా!**

**తా.**॥ ఏమికుటుంబమండీ!!! చెల్లెలేమో జగన్మాయ, బావగారు 'లయకారకుడు' రుద్రుడు (వాళ్ళ బిడ్డలు విఘ్నపతి, దేవసేనాపతి సుబ్రహ్మణ్యం). పెద్దకొడుకు సృష్టికర్త బ్రహ్మ. పెద్దకోడలు విద్యలరాణి వాణి. చిన్న కొడుకూ కోడలు అందర్నీ "ఆడించే" రతీమన్మథులు. భూదేవి, శ్రీదేవి భార్యలు. హరిదాసులంతా బంధుకోటి. అందుకే మీ దయ కోరి ఈ నాకృతిని మీ భూరికుటుంబానికి అంకితమిస్తున్నానయ్యా! శ్రీవేంకటేశ్వరా!

# హరి మెచ్చిన స్వరములు

## ఎన్నుకొన్న తాళ్ళపాక సంకీర్తనలకు భావవివరము

## విషయ సూచిక


| క్ర.సం. | కీర్తన వివరము | సంపుటము/సంఖ్య |
|---|---|---|
| 1. | అందరివలెవున్నాడతడావీడు | 2/43 |
| 2. | అటువంటి వాడెవో హరిదాసుడు | 1/483 |
| 3. | అన్నలంటా దమ్ములంటా ఆండ్లంటా | 1/226 |
| 4. | అన్నిచోట్లా బరమాత్మనీవే | 1/278 |
| 5. | అన్నిటా నీపెంపు వింత హనుమంత | 2/249 |
| 6. | అన్నియును దన ఆచార్యాధీనము | 2/90 |
| 7. | అహోబలేశ్వరునకు నాదిమూర్తికి | 2/243 |
| 8. | ఆపన్నులపాలి దైవమాతడే | 1/266 |
| 9. | ఆర్తుల బొబ్బలు నవె వినుదు | 2/108 |
| 10. | ఆసమీద విసుపోదాకా | 1/212 |
| 11. | ఇందిరాధిపు సేవయేమరకుండుట | 1/434 |
| 12. | ఇందుకు జింతించనేల ఈశ్వరమాయ | 2/140 |
| 13. | ఇందునుండ మీకెడలేదు | 1/375 |
| 14. | ఇదిగాదు తెరవు యీడేరే వారికి | 15/106 (పెద) |
| 15. | ఇది తుది మొదలని యెఱుగరెవ్వరు | 15/360 (పెద) |
| 16. | ఇద్దరము నిద్దరమే హృషీకేశ | 15/246 (పెద) |
| 17. | ఇరవైనయట్లుండు యెఱగ నీదీమాయ | 1/486 |
| 18. | ఉన్నమాటలికనేల | 15/27 (పెద) |
| 19. | ఎంతటివాడవు నిన్ను నేమనినుతింతు | (పె.అ) 15/412 |
| 20. | ఎంతమానుమన్న జింతలేలమాను | 1/204 |
| 21. | ఎట్టివారికి నెల్లనిట్టి కర్మము | 1/277 |

| | | |
|---|---|---|
| 22. | ఎటువంటి రౌద్రమో యెటువంటి కోపమో | 1/211 |
| 23. | ఎదుటినిధానము వెటుచూచిన | 1/344 |
| 24. | ఎరుగుదురిందరు నెరిగీ యెరుగరు | 1/253 |
| 25. | ఏటిబ్రతుకు యేటిబ్రతుకు | 1/348 |
| 26. | ఏటివివేకము ఇరువుల చిత్తమిది | (పె.అ) 15/103 |
| 27. | ఏమిగలదిందునెంతపెనగినా | 1/328 |
| 28. | ఏమిటి గడమ యిక హరిదాసులకు | (పె.అ) 15/70 |
| 29. | ఏమిఫలము దానిన్నియు దెలిసి | 1/236 |
| 30. | ఏమీనడుగనొల్ల నెచ్చుకుందులనొల్ల | (పె.అ) 15/24 |
| 31. | ఏలోకమందున్నా నేమీలేదు | 2/89 |
| 32. | కటకటా కర్మమా కాలములో మర్మమా | 2/155 |
| 33. | కన్నవారికెల్లా నేలకలుగు వైష్ణవము | 15/328 (పెద) |
| 34. | కరుణానిధివిగానగాచేవుగాక | 15/165 (పెద) |
| 35. | కాయమనే వూరికి గంతలు తొమ్మిది | 1/488 |
| 36. | కొండద్రవ్వుట యెలుకగోరి పట్టుట | 1/321 |
| 37. | కోటి మన్మథాకార గోవింద కృష్ణ | 2/230 |
| 38. | చంచలపడగవద్దు సారెసారె గోరవద్దు | 2/281 |
| 39. | చదువులోనే హరినిజట్టిగొనవలెగాక | 1/484 |
| 40. | చిత్తానబెట్టము మీమాట శ్రీరమణ | 2/337 |
| 41. | చూచే చూపొకటి గుఱియొకటి | 2/141 |
| 42. | చేతులెత్తి మొక్కరో జీవకోట్లాల | 15/163 (పెద) |
| 43. | తనవారని యాసదగిలి భ్రమయనేల | 1/222 |
| 44. | తప్పదోయవే దైవశిఖామణి | 1/447 |
| 45. | తప్పుచదువులవారు తర్కవాదములవారు | (పె.అ) 15/190 |
| 46. | తమవుద్యోగములేల తమకములేల | (పె.అ) 15/162 |
| 47. | తలచిచూడ పరతత్త్వంబితడు | 15/234 (పెద) |
| 48. | తెలియక వూరక తిరిగేము | 1/432 |
| 49. | తెలియరాదు మాయదేహమా | 1/416 |
| 50. | తెలిసియు నత్యంత దీనమై మనసు | 1/330 |

51. తొక్కనిచోట్ల దొక్కెడి మనసు 1/276

52. దాటలేను యీమాయ దైవమా 15/67 (పెద)

53. దృష్టాంత మిది తప్పదు తెలుసుకోవలె (పె.అ) 15/327

54. దేవనీ విచ్చే యందుకు దీనికిగానింతయేల 1/372

55. దేవుడొక్కడే మరి జీవుడు వేరు 15/334 (పెద)

56. దేవునిప్రసాదము తెరళలందుకోరో 15/189 (పెద)

57. దైవశిఖామణి దివిజులు వొగడగ 2/93

58. నిండెనిన్ని చోటులను నీమహిమలే 2/248

59. నాతప్పులోగొనవే నన్నుగావవే 1/427

60. నీయంతటివారెవ్వరు నీకునెదురేది 2/47

61. నీయాజ్ఞదలమోచి నీదేహధారినై 1/376

62. నీవు లోకోన్నతుడవు నిన్నెఱగరా (పె.అ) 15/361

63. నీవు సర్వసముడవు నీవు దేవదేవుడవు 2/129

64. నీవెకా చెప్పజూప నీవెనీవెకా 1/255

65. నీవె వచ్చి ప్రత్యక్షమై నిలతువుగా (పె.అ) 15/365

66. నీవేమి సేతువయ్యా నీవు దయానిధి 1/487

67. నెట్టనశ్రీసతి మగనికి శరణు 2/282

68. నేననగా నెంతవాడ నెయ్యపు జీవుల 2/45

69. నేనైతే నీడేరుదు నీకులీల 15/22 (పెద)

70. పరుసమొక్కటి కాదు పయిడిగాజేసేది 1/373

71. బిరుదు లిన్నియు నీవె బిరుదులోకములెల్ల 2/142

72. భారమునీపై వేసి బ్రదికియుండుటె 15/27 (పెద)

73. భావించలేరెవ్వరును బయలువాకేరు 2/200

74. మాకెల్ల “రాజానుమతోధర్మ” యిది 1/415

75. మానరాని చుట్టమవు మధుసూదనా 15/242 (పెద)

76. మొదలుండకొనలకు మోచినీళ్ళు 1/466

| | | |
|---|---|---|
| 77. | లేదు బ్రహ్మవిద్యామహాసుఖము | 1/254 |
| 78. | వద్దువద్దు సటలింకా వామనా | 15/244 (పెద) |
| 79. | వామనా నృసింహ వాసుదేవ | 15/328 (పెద) |
| 80. | విచారపరులాల వివేకులాల | 15/378 (పెద) |
| 81. | విచారించు హరి నా విన్నపమవధరించు | 2/1 |
| 82. | విడుమనవో రోలు విడుమనవో | 1/57 |
| 83. | విదురుని విందా విజయీభవ | (పె.అ) 15/156 |
| 84. | విన్నపమిదియే వేవేలకు | 15/459 (పెద) |
| 85. | విరిగిరి దానవ వీరులదె | 2/91 |
| 86. | విష్ణుడే యింతానని భావించుటే | 2/195 |
| 87. | వెదకెద నిన్ననే వేదము చెప్పగ | 15/343 (పెద) |
| 88. | వెఱవకుడీ యిందుకుగా విశ్వహితుడు | (పె.అ) 15/369 |
| 89. | వేగిరించకంతేసి త్రివిక్రమా | 15/243 (పెద) |
| 90. | వేదాంతవిదులాల వివేకులాల | (పె.అ) 15/333 |
| 91. | శ్రీవేంకటేశ్వరుడు చేరి విజయముబొంది | 2/107 |
| 92. | సకలబలంబులు నీవె సర్వేశ్వరా నాకు | 2/109 |
| 93. | సకల భూతదయ చాలగ గలుగుట | 1/223 |
| 94. | సకల సందేహమై జరుగుచున్నది | 1/332 |
| 95. | సకలసంగ్రహము సకల సంచయము | 1/349 |
| 96. | సతతము నేజేయునచారములకు | 1/341 |
| 97. | సర్వశక్తివి నీవే సర్వలోకేశ్వరా | (పె.అ) 15/144 |
| 98. | సహజాచారములెల్లా సర్వేశ్వరుని ఆజ్ఞే | 1/431 |
| 99. | హరిదాసుడగుటేయది తపము | 15/145 (పెద) |
| 100. | హరి నీయనుమతో అది నా కర్మమో | 1/433 |
| 101. | హరి విశ్వాత్మకుడు అందరిలోనున్న | 15/161 (పెద) |

# ప్రార్థన

కం॥ శ్రీహరిమెచ్చే స్వరమున
ఆహా! మన అన్నమయ్య ఆచార్యుండై
ఓహో! కీర్తనతోనే
ఆ హరి'నందకము'గాన అటుతెగడె చెడున్

మ॥ ఇది నా భాగ్యము గాక అన్యమగునే? ఇందీవరాక్షున్ హరిన్
మదిలో నిల్పుచు తెల్లవారమొదలై మాశక్తి వెచ్చించుచున్
అదియే ధ్యాసగ అన్నమయ్య కృతికిన్ అందించి భావార్థముల్
తుది నా శ్వాసకు వేచియుంటి హరి! నాతో ఆట న్యాయంబొకో!!

కం॥ బిరబిర పరుగులు నెరపుచు
కరివరదుడ! మకరి నరికికాచితివి కరిన్
పరివారంబులు తరుణియు
పొరి పిరుదూరంగ శౌరి! పోనాడకు నన్

శా॥ కాదంటే సరికాదు వేంకటపతీ! కారుణ్య మూర్తీ! హరీ!
వాదంబేటికి, దీనబంధుడవుగా వాపోవు నీదాసులన్
చేదోడై దరిజేరి కాతువు కదా! శ్రీరామరక్షె సదా,
రాదానీకృప సుంత? జాగుతగునా, లక్ష్మీపతే! భూవిభో!

ఆ.వె॥ తెల్లవారమొదలు దేవదేవుని హరిన్
మదిని నిలిపి అన్నమయ్య కృతికి
భావవివరమిచ్చి పండించితిని జన్మ
"టెక్కు" చదువులేల తిరుమలేశ?

తే.గీ॥ పాట రంజింపజేయును పరవశమున
దాని భావంబు తెలియక తడబడుదురు
నీదు కృపజేసి వివరము కుదురుచుండె
అరయ నాకంత "పస" యేది తిరుమలేశ?

ఉ॥ జ్ఞానము తత్త్వమున్ యెరుగ శ్రావ్యపుకంఠము యెండమావియే
మానసమందు పంతములు మంచినెరుంగని మచ్చరుండరా,
గానము చేత నిన్ను సరిగా మురిపించుట చేతగాదు పో!
దేనికి నన్నుదెచ్చితివి దీనుడ గావుము వేంకటేశ్వరా!

సీ॥ తపమాచరించుచు దయబొంద జూతునా
నిలకడలేదాయె నిముషమైన
గుడిజేరి యెడయక గొలిచి మెప్పింతునా
కుంటిజన్మాయెరా కొండలయ్య!
నినుబాడిమెప్పించి నీకృప బొందగా
స్వరమాధురి నెరుంగ స్వరము నెరుగ
మూడువంతుల జన్మ ముదనష్టమైపోయె
ఈగదర విరక్తియిప్పుడైన

ఆ.వె॥ కనులుమూయువేళ కరుణతో నామీద
నాదు నాల్కపైన నామనమున
నిలువుమయ్య చాలు నిన్నేమి కోరను
విడువకయ్య నన్ను వేంకటేశ!

మత్తకోకిల

అంతులేనిది సాగరంబిది అంతు జూడగ సాధ్యమా?
ఎంతనీదియు'మున్క' తప్పదు ఏడుకొండలె దిక్కురా
సంతసంబులు కంటినీరులు స్వామి ఇచ్చెడివే కదా!
వంతయెందుకు పంతమెందుకు పాప చింతన లేలరా?

# ముందుమాట

శ్రీవేంకటేశ్వరా! నీ పిలుపు ఇవ్వాళొస్తుందా? రేపొస్తుందా? అని యెదురుచూచి చూచి నా కళ్ళు కాయలు కాచినవి. పదునాలుగేండ్ల వనవాసం భార్యావియోగం కలిగినా నీవు దేవదేవుడవు కాబట్టి నరుడివైన పురుషోత్తముడివి కాబట్టి నెగ్గావు. మేమెంత వారమయ్యా? పదునాల్గు ఉగాదులు గడిచాయి.

"ఎన్నాళ్ళని నాకన్నులు కాయగ యెదురు చూతురా గోపాలా?" అని వకుళాదేవి యేడిస్తే భార్యని సైతము మఱచి ఆమె పుత్రుడవైనావు. తలమీద గొడ్డలి దెబ్బను భరించావు. మరి నామీద దయలేదా తండ్రీ! నేనే పాపం చేశాను? నేనేమీ లోకకంటకుడను కాదే? ప్రభూ! మేము నిమిత్తమాత్రులం. మేము పాపమూ నీ ఆజ్ఞకు లోబడే చేస్తున్నాము. పుణ్యమూ నీకృప వలననే చేస్తున్నాం. వాటి ఫలితమూ నీ ఇచ్ఛ మేరకే అనుభవిస్తూ వున్నాము. మాకు లంపటాలను అంటకట్టేదీ నీవే. వాటిని తెంచేదీ నీవే. అనేక భ్రమలను కలిగించేది నీవే, నవ్వించేదీ నీవే, ఏడిపించేదీ నీవే.

"అన్యథా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ."

హిమాలయాలలో సర్వోన్నత శిఖరం యెక్కాలనుకొనేవాడు తిరిగి రాకపోయినా యెక్కితే చాలు అనుకొంటాడు. ఈ'హరిసేవలో' హరీయంటే మాత్రం పోయేదేముంది? హరి ఇచ్చిన 'చేబదులు' ఈ మానవజీవితం. అన్నమయ్య మనుమడు చినతిరుమలయ్య పాడినట్లు "అప్పులవారే అందరును... కప్పగ తిప్పగ కర్తలు వేరే?" ఆ భావనతోనే నాకంటే జ్ఞానాధికులు సంగపరిత్యాగులై హరి శరణాగతులైనారు. కోపతాపాల సుడిగుండాలలో ఆపశోపాలు పడుతున్నాను నేను. మునిగే లోపుగ హరి

చేయినందిస్తాడో చేయిరాదంటాడో తెలియదు. అన్నమయ్య యేనాడో ఆమాట అన్నారు. "ఉదటు కోపం బదివుడిగినప్పుడు కదా! .... హరి చేరువౌట". ఈనాటి సినీకవులన్నట్లు... మనకంత "సీను" లేదు. అయినా నాపేరు దీక్షితులు కుంటుతూ నడిచేవాడు పడిపోతే యేడుస్తాడా? ఒళ్ళు దులుపుకొని తిరిగి నడుస్తూనే వుంటాడు.

ఏడుకొండలవాడు యేదో వొకనాటికి నవ్వులాట ఆపేసి "నవ్వక" పోడు అమ్మయ్య ఇకచాలు నాదగ్గరకు రమ్మనకపోడు. చెమ్మగిల్లిన కళ్ళతో నేను ఆ స్వామి పాదాలను చేరకపోను. ఇది ఆశ, పేరాశ కాదు.

ఇదంతా యెందుకు చెబుతున్నానంటే సైలెన్సర్ లేకుండా మోటార్ సైకిల్ వేగంగానడిపి పక్కనుంచి దూసుకుపోయే "సూపర్ రిచ్ కుఱ్ఱకారుని" చూసి పోనీలే అనుకోలేని నాబోటి"ముసిలోళ్ళకి" కోపం బూడిదయినా పోదేమో!!! అందుకనే శాంత గుణము జన్మతః భగవద్దత్తము.అలవాటు చేసికొన్నది నీటి బుడగలాంటిది. శాపాలనిచ్చే ఋషులంతా అట్టివారే.మనం యెంత అనుకోక సాధన చేస్తూనేవుండాలి. అన్నమాచార్యులవారు సైతం తనని అనుకరిస్తూ కవిత్వం చెప్పినవారిని దూషించారు, ఒక కీర్తనలో.

కాబట్టి ఈ బ్రతుకు ఇలాగడపక తప్పదు. మనిషికి కోపంయెట్లా సహజమో ఇష్టము,అయిష్టముకూడా సహజమే. నేనువిశ్లేషించటానికి యెన్నుకొనేటప్పుడు సాధ్యమైనంతవరకు పునరుక్తము (రిపిటీషన్) కాకుండా యెన్నుకొంటాను. కాని ఆ కీర్తన నామనసుకు మరింతగా నచ్చినప్పుడు తొందరపాటువలన గతంలో నేను విశ్లేషించినవే పునరుక్తం అవుతాయి. ప్రింటు కాకపోతే మార్పు చేస్తుంటాను. ప్రింటయిపోతే నేను యేమీ చేయలేను. "ఓవర్‌సైట్" అనేది నాపాలిటి గ్రహపాటు...అనుకోవటం తప్ప నేనేమీ చేయలేకపోతున్నాను.

ప్రస్తుతానికి వస్తే "హరి మెచ్చి స్వరములు"లో ఈనాటికీ హరిని కీర్తనల ద్వారా మెప్పించాలని శ్రమిస్తున్న ఈనాటి మన చిన్నఅన్నమయ్య యెన్నోవందల

సంఖ్యలోవున్నారు. వారందరూ హరి ఇచ్చిన మధుర స్వరాలను అన్నమయ్య స్వరములా చేయాలని తాపత్రయ పడుతున్నారు, తహతహలాడుతున్నారు. అందరికీ ముక్తి దొరకదనితెలిసినా ముక్తికి సాధన చేసే వాళ్ళకీ, ఆ హరినామకీర్తనా శ్రామికులకీ పెద్దతేడా యేమీలేదు. అందరూ చేసేది ఒక్కటేసాధన. ఎవరెస్ట్ శిఖరం యెక్కిన వాళ్ళనే కీర్తివరిస్తుంది. చాలామంది యెక్కలేక "పోతుంటారు". అవునా?

హరిసేవకూడా అంతే. ప్రయత్నమే మనచేతిలోనిది. ఫలితం మన చేతకానిది. హరి చేతిపని కాబట్టి, హరిహరి అంటూనే "హరీ" అన్నా ఆశ్చర్యం లేదు. హరి మెచ్చిన కదా! హరి పురి చేరుట.

ఈ నానూతన ప్రయత్నంలో నేను యెన్నుకొన్న కీర్తనలు, హరి మెచ్చిన తమ మధుర స్వరముతో పలువురు ఆలపించిన అన్నమయ్య కీర్తనలు. వీటి భావవివరము చదివితే, ఆ కీర్తనలు విన్నవారందరు, మరింతగా విని తరిస్తారని నా ఆకాంక్ష.ఇది నేను మెచ్చిన హరిసేవ. ఈ కీర్తనలను ఒక ప్రత్యేక సి.డి. చేయటానికి నావంతు కృషి చేనూచేస్తాను. ఆపైన వాడిదయ నా ప్రాప్తము.

ప్రస్తుతం మీచేతిలో వున్న "హరి మెచ్చిన స్వరములు" లో పలువురు గాయనీగాయకులాలపించిన అన్నమయ్య, ఆయన అనంతరం అదే ప్రయత్నం కొనసాగించిన ఆతని పుత్రపౌత్రులు చెప్పిన కీర్తనలను దీనిలో పొందుపరచి "భావవివరము"ను జతచేశాను. దీనిలోని కీర్తనలన్నీ వర్ణక్రమంలో ముద్రించి అదేక్రమంలో రికార్డు చేయబడిన కీర్తనలను ఒకే సి.డి.గా చేసి సంగీత సాహిత్యాలు కుచద్వయంగా గల "వరవీణా మృదుపాణి, వనరుహలోచనురాణి" చరణకిసలయములకు అర్పించాలని నా ఆకాంక్ష. ఎందుకంటే... ఆ సరస్వతీదేవి శ్రీవేంకటేశ్వరుని పెద్దకోడలే కదండీ. అడపా తడపా సిరులమ్మతో కీర్తన రూపంలో "రావే కోడల రట్టడి కోడల – పోవేపోవే అత్తమా" అంటూ తగవులాడుతుంటారని స్వయంగా అన్నమయ్యే చెప్పారు.

కాబట్టి "హరిమెచ్చిన స్వరములు"ను రాగయుక్తంగా పాడి వాణిని, భక్తితో పొగడి హరిని, హరిప్రియను మురిపించే వారే ధన్యజీవులు. వారికి ఆ పాటలోని మాధుర్యం వివరించాలని భావవివరమునందిస్తున్న నన్నూ వారు కరుణాదృష్టితో చూస్తారని నా ఆకాంక్ష. ఎందుకంటే ఆ "హరికుటుంబం"లో నేనూ ఒకడినే కదా!

చివరిగా డా|| పతంజలి గారికి, డా|| శంకర్ పవన్ గార్ల విద్వత్ గోష్ఠికి సదా కృతజ్ఞుడను.

టి.టి.డి. వారికి నా ప్రోత్సాహకులందరికి శతకోటి నమస్సుమాంజలులు

నా ఇతర రచనలు "ఉద్ధవగీత", కబీర్‌దాసు దోహాలు, ఆదిశంకరాచార్యుల "ఆత్మబోధ" (ఆంగ్లంలో) వంటివి మీకు నచ్చుతాయని నా నమ్మకం. GOOGLE NETWORK విజిట్ చేస్తే "geetadeeksha.com" లో నా ఇతర రచనలలు మీరు చదవవచ్చు. 2200 అన్నమయ్య కీర్తనలు విశ్లేషణతో సహా చదవవచ్చు. దాదాపు 1800 కీర్తనలు వినవచ్చునుకూడా.











సంఖ్య : 43   సంపుటము : 2   పుట: 330   రాగం : సామంతం

1 అందరివలెనే వున్నాఁ డాతఁడా వీఁడు
యిందుముఖులఁ గూడినాఁ డీతఁ డానాఁడు ॥పల్లవి॥

యిందరూ నేఁటేఁటఁ జేసేయింద్రయాగపుముద్దలు
అందుకొని యారగించినాతఁడా వీఁడు
చెంది మునులసతులచేతఁ దెప్పించుక మంచి-
విందు లారగించినాఁడు వీఁ డానాఁడు ॥అంద॥

తొలుత బ్రహ్మదాఁచినదూడలకు బాలులకు
అలరి మారుగడించినాతఁడా వీఁడు
నిలుచుం డేడుదినాలు నెమ్మది వేలఁ గొండెత్తి
యిలనావులఁగాచినాఁ డీతఁ డానాఁడు ॥అంద॥

బాలుఁడై పూతనాదుల బలురక్కసులఁ జంపి
ఆలరియాటలాడినయాతఁడా వీఁడు
యీలీల శ్రీవేంకటాద్రి యెక్కినాఁడు తొలుతే
యేలెను బ్రహ్మదుల నీతఁ డానాఁడు ॥అంద॥ 48

**భావవివరము:**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో ఈతడు అంటే ఈ శ్రీవేంకటేశ్వరుడనియు, ఆతడు అంటే శ్రీకృష్ణుడని, ఆనాడు అంటే ద్వాపరయుగంలో అని అర్థం చేసికోవాలి. శ్రీకృష్ణలీలలను వర్ణిస్తున్నారు. వీడు అందరి వలెనే వున్నాడు. కాని ఆతడా వీడు. ఈతడు ఆనాడు, తాను యెందరో ఇందుముఖుల (చంద్రవదనలను) కూడినాడు. రేపల్లెవాసులందరూ ప్రతియేడూ చేసే ఇంద్రయాగం ముద్దులు తానే ఆరగించి గోవర్ధన గిరికి పూజలు చేయించాడు. మునిపత్నులను తానున్న చోటికి రప్పించుకొని నిస్సంకోచంగా తానే యజ్ఞభోక్తనని చెప్పి మంచి విందు భోజనం ఆరగించి యజ్ఞపురుషుడైన ఆతడా వీడు. భ్రమపడి తననే పరీక్షించవచ్చిన బ్రహ్మగోపాలురను, దూడలను దాచిపెడితే తానే నెలరోజులు గోపబాలురుగాను, దూడలుగానూ మారి గోపాంగనలను గోవులను మురిపించి బ్రహ్మకు రిమ్మతిరిగేట్లు చేశాడు. ఆ చిన్ని గోపయ్యయే వీడా? ఇంద్రుడు కోపించి యేడు అహోరాత్రములు పిడుగులతో కూడిన కుంభవృష్టి కురిపిస్తే గోవర్ధనగిరిని గొడుగువలె యెత్తిపట్టి గోకులాన్ని కాపాడిన ఆ నల్లనయ్యా వీడు. బాలునిగా తనను చంపవచ్చిన పూతనవంటి బలమైన రక్కసులను చంపి గోపాలురతో అల్లరి ఆటలు ఆడిన వెన్నదొంగ వీడేనా? ఈ కలియుగంలో ఈ శ్రీవేంకటాద్రి నెక్కక ముందే బ్రహ్మది దేవతలను పాలించినాడు ఇతడే ఆనాడు.

★ **మారుగడించిన** – మరల సృష్టించిన ★ **ఏలెను** – పరిపాలించెను

సంఖ్య : 483 సంపుటము : I పుట: 324 రాగం : లలిత

**2 అటువంటివాఁడువో హరిదాసుఁడు**
**అటమటాలువిడిచినాతఁడే సుఖి ॥పల్లవి॥**

**తిట్టేటిమాటలును దీవించేమాటలును**
**అట్టే సరెని తలఁచినాతఁడే సుఖి**
**పట్టిచంపేవేళను పట్టముగట్టేవేళ**
**అట్టు నిట్టు చలించనియాతఁడే సుఖి ॥అటు॥**

**చేరి పంచదారిడినఁ జేఁదు దెచ్చిపెట్టినాను**
**ఆరగించి తనివొందేయతఁడే సుఖి**
**తేరకాండ్లఁ జూచిన తెగరానిచుట్టముల**
**నారయ సరిగాఁజూచేయాతఁడే సుఖి ॥అటు॥**

**పొంది పుణ్యము వచ్చిన పోరిఁ బాపము వచ్చిన-**
**నందలిఫలమొల్లనియాతఁడే సుఖి**
**విందుగా శ్రీవేంకటాద్రివిభునిదాసులఁ జేరి**
**అందరానిపద మందిననాతఁడే సుఖి ॥అటు॥ 484**

**భావవివరము:**

అన్నమయ్య చెప్పిన కీర్తన యొక్క పల్లవిని నేటి భాషలో చెబుతే ఇలా వుంటుంది. హరిదాసుడు అంటే ఇటువంటి గుణములున్నవాడే సుమా! అటమటలు (వ్యాకులపాటులు) విడిచిపుచ్చినవాడే నిజమైన సుఖి అంటున్నారు. అంతేకాదు... తిట్టేటిమాటలు (తిట్లు), దీవించేటిమాటలు (దీవెనలు) సమానమైనవిగా తలచేవాడు, నిజమైన సుఖి. పట్టి చంపబోయేవేళ, రాజ్యపట్టాభిషిక్తుని చేయబోవువేళ అటూఇటూ చలించనివాడే నిజమైన సుఖి. పంచదార తినిపించి నోరు తీపిచేసినా వేప చేదు తినిపించి నోరు చేదు చేసినా తృప్తిగా తిని సమానముగా చూచువాడే నిజమైన సుఖి. సంబంధంలేని పరాయివారిని చూచినా ఆత్మీయులైన బంధువులను జూచినా సమానమైన భావనతో చూడువాడే నిజమైన సుఖి. పుణ్యకార్యములనాచరించినప్పుడు సత్ఫలితములను సమానదృష్టితో చూచువాడు నిజమైన సుఖి. వీరందరి సుఖమూ ఒక ఎత్తు. కాని శ్రీవేంకటేశ్వరుని దాసులై అందరాని పదమైన ముక్తి పదమునొందినవాడు పైవారందరికంటే గొప్ప సుఖి.

★ **తేరకాండ్లు** – సంబంధంలేనివారు ★ **అందరాని పదము** – మోక్షము

సంఖ్య : 226 సంపుటము : I పుట: 149 రాగం : వరాళి

**3 అన్నలంటాఁ దమ్ములంటా ఆండ్లంటా బిడ్డలంటా**
**వన్నెల నప్పులుగొన్నవారువో వీరు** ॥పల్లవి॥

**తెగనీక అప్పులెల్లాఁ దీసితీసి ।వారు**
**తగిలినఁబెట్టలేక దాఁగిదాఁగి**
**వెగటునఁ బారిపోఁగా వెంట వెంట ।పెక్కు-**
**వగల నప్పులుగొన్నవారువో వీరు** ॥అన్న॥

**సేయరానిపనులెల్లఁ జేసిచేసి ।తమ-**
**రాయడికి లోలోనే రాసిరాసి**
**కాయములో చొచ్చిచొచ్చి కాఁచికాఁచి ।మున్ను**
**వ్రాయనిపత్రాల కాఁగేవారువో వీరు** ॥అన్న॥

**దొరయై యప్పులవారిఁ దోసితోసి ।యీ-**
**పరిభవములనెల్లఁ బాసిపాసి**
**సిరుల వేంకటపతిఁ జేరిచేరి ।యిట్టి -**
**వరుసనే గెలిచిన వారువో వీరు** ॥అన్న॥ **226**

**భావవివరముః**

అద్భుతమైన వైరాగ్యం తొణికిసలాడే కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. మానవుడు తన బంధువులందరినీ నావాళ్ళనుకొని మురిసిపోతుంటాడు. అన్నలంటూ, తమ్ములంటూ, పెండ్లాలంటూ, బిడ్డలంటూ మురిసిపోతూ వుంటాడు. కాని నిజానికి వారంతా మనదగ్గర అనేక రకములైన అప్పులవారె. వాళ్ళు మనకో, మనం వాళ్ళకో అప్పు తీరుస్తూనే వున్నాము. అంతులేని అప్పులు చేసి చేసీ వారు వెంటబడితే మనం పారిపోయి వుంటాము. ఆనాడు దాగి దాగి తప్పించుకొన్న ఫలితమే నేడు వెంట వెంట తగిలి అనేక వగలుపోతూ మన అప్పు తీర్పించుకొంటున్నారు. మనమంతా వొకనాడు యేవేవో చేయరాని పనులు చేసిచేసీ గొప్ప ఒరిపిడికిలోనై అదే విధంగా రాసిరాసీ పలువురిని రాపిడికి గురిచేసి అనేక శరీరాల్లో చొచ్చి చొచ్చీ ఆనాడు క్షమాపణ పత్రం వ్రాసి ఇవ్వని వాళ్ళే వీళ్ళంతా. నేడు మనని ఏదో విధంగా దెబ్బతీసి కన్నీరు పెట్టించటానికే మన వెంటబడ్డారు. ఒకనాడు దొరయై యెవరిదగ్గరో అప్పులు బలవంతాన తీసికొని యెగగొట్టి అవమానించి వుంటాము. ఈరోజున వాడు దొరయై పగసాధిస్తాడు. అయితే సిరులు వెలుగొందే శ్రీ వేంకటేశుని చేరి చేరీ శరణంటే వరుసగా గెలుస్తుంటారు. వారే ఈ దొరలంతా.

★ **పరిభవము** – అవమానము ★ **రాయడి** – ఒరిపిడి

సంఖ్య : 278 సంపుటము : I పుట: 186 రాగం : ముఖారి

**4 అన్నిచోట్లఁ బరమాత్మ నీవు**
**యిన్ని రూపుల భ్రమయింతువుగా** ||పల్లవి||

**పాలజలనిధి నుండి బదరీవనాన నుండి**
**ఆలయమై గయలోఁ బ్రయాగ నుండి**
**భూలోకనిధివై పురుషోత్తమాన నుండి**
**వేలసంఖ్యలరూపై విచ్చేతుగా** ||అన్ని||

**వుత్తరమధురలో నయోధ్యలోపల నుండి**
**సత్తైననందవ్రజాన నుండి**
**చిత్తగించి పంచవటి సింహాద్రిలోన నుండి**
**వత్తుగా లోకములు పావనము సేయఁగను** ||అన్ని||

**కైవల్యమున నుండి కమలజలోకాన**
**మోవఁగ శ్రీరంగమున నుండి**
**యీవలనావల నుండి యీవేంకటాద్రిపై**
**నీవే నీవే వచ్చి నెలకొంటిగా** ||అన్ని|| **278**

**భావవివరముః**

పరమాత్మ నిరాకారుడు, నిర్గుణుడు కాని యెవరెట్లా భావిస్తే వారికా రూపంలో కనబడతాడు. అందుకే అన్నమయ్య యేమంటున్నారో వినండి. ఓ పరమాత్మా! పాలజలనిధిలోనైనా, గయలోనైనా, అయోధ్యలోనైన బ్రహ్మలోకంలోనైనా, సింహాచలంలోనైనా నీవేవున్నావు. కాకపోతే ఇన్నిరూపాలవానిలా మమ్మల్ని భ్రమింపజేస్తున్నావు. నీవు వేలాది రూపాలతో యెక్కడనుండైనా విచ్చేతువు కదా! పాలజలనిధిలో పవ్వళించివున్న శ్రీహరి నీవే. బదరీవనంలోని నారాయణుడవునీవే. గయ నివాసమైవున్న శివుడవునీవే. భూలోకనిధివై పురుషోత్తమాన (హరిద్వారము) వున్నదీ నీవే. మా భ్రమయేగాని, అంతయూ నీవే హరి పుండరీకాక్షా! ఉత్తర మధురలో శ్రీకృష్ణమూర్తిగా వున్నదీ నీవే. అయోధ్యలో రాజారామునిగావున్నదియూ నీవే. నందవ్రజమున నెలకొన్న కన్నయ్యావూ నీవే. లోకములనన్నిటిని పావనము చేయగా పంచవటవృక్షములున్న సింహాచలంలోని నరసింహమూర్తివి నీవే. ప్రభూ! శ్రీరంగం అని ఖ్యాతిగాంచిన వైకుంఠంలో వున్నదీ నీవే. బ్రహ్మదేవుని సత్యలోకం, మొదలైన పదునాల్గు భువనాలను మోస్తున్నావు. నీవే కైవల్యపధముననుండి అందరికీ ముక్తినిస్తున్నావు. పైజెప్పిన తీర్థములలో దేనినీ సేవించలేని దీనులను ఈవల (ఇహలోకంలోను), ఆవల (పరలోకంలోను) వుండే నీవే వచ్చివచ్చీ శ్రీవేంకటేశ్వరుడవై వేంకటాద్రిపైనున్నావు. నీవే నీవే సమస్తమూ నీవే.

★ **కమలజలోకము** – బ్రహ్మలోకము ★ **పురుషోత్తమము** – హరిద్వారం

సంఖ్య : 249 సంపుటము : 2 పుట: 167 రాగం : సాళంగనాట

**5 అన్నిటా నీపెంపు వింత హనుమంత నీ-**
**వున్నచోటునిశ్చింత మోహనుమంతా.** ॥పల్లవి॥

**రామునిసేనలఁ గాచి రావణుగర్వ మడఁచి**
**ఆముకొన్న బలవంత హనుమంతా**
**గోమున జలధి దాఁటి కొండతో సంజీవి దెచ్చి**
**ధీమంతుఁడవైతి వింత దివ్యహనుమంత** ॥అన్ని॥

**చుక్కలు మొలపూసలై సూర్యమండలము మోఁచె**
**అక్కజపునీరూ పంత హనుమంత**
**చొక్కమై మీ రుండఁగాను సుగ్రీవాదులకెల్లా**
**అక్కర లే దించుకంతా హనుమంతా** ॥అన్ని॥

**జంగచాఁచి చేయెత్తి సరిఁ బిడికిలించుక**
**అంగము నిక్కించి తెంత హనుమంత**
**రంగగుశ్రీవేంకటాద్రిరామునిదేవి కిచ్చితి-**
**వంగులియ్యక మొక్కంత హనుమంతా** ॥అన్ని॥ **249**

**భావవివరము:**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనను బట్టి ఈ హనుమంతుని నెలవు యెక్కడో వూహించలేము. కాని సుమధురమైన కీర్తన అని చెప్పతగ్గ కీర్తన. అన్నివిధములా నీ శరీరము యొక్క పెంపు వింతగా వున్నదయ్యా హనుమంతా! నీవెక్కడవుంటే అక్కడ నిశ్చింతేనయ్యా హనుమంత! అంటున్నారు. స్వామీ! రాముని, ఆయన సేనలను రక్షించినావు. రావణుని గర్వమునణచినావు. నీవు అధికమైన బలవంతుడవు స్వామీ! సునాయాసముగా సాగరమును దాటి రాత్రికిరాత్రి సంజీవిని పర్వతముతోసహా తెచ్చి గొప్ప ధీమంతుడ (బుద్ధిమంతుడు) వైతివయ్యా దివ్యహనుమంతా! సూర్యమండలము మోయుచున్నట్లు నీవు నీ రూపము సీతాదేవికి చూపినప్పుడు, నక్షత్రములు నీ మొలతాటి మణిలవలె మెరసినవి. నీరూపమాదేవికి యెంతో ఆశ్చర్యమును కలిగించినది. చొక్కమై (సమ్మోహనంగా) నీవుండగా సుగ్రీవాదులకు నిశ్చింతయే కదా! హనుమంతా! నీ రెండు కాళ్ళను చాచి, చేయెత్తి పిడికిలి బిగించి, నీదేహమును యెంత ఎత్తుగా పెంచినావయ్యా!!! శోభలీను ఈ శ్రీవేంకటాద్రి రాముని దేవేరియైన జానకికి ఆయన అంగులీకము (వుంగరము) నీవొక్కడవే ఇచ్చావయ్యా హనుమంతా!

★ **గోమున** – సునాయాసముగా ★ **ఆముకొన్న** – అధికమైన

సంఖ్య : 90 సంపుటము : 2 పుట: 61 రాగం : దేవగాంధారి

**6 అన్నియునుఁ దనఆచార్యాధీనము**
**చెన్ను మీఱ హరిపాదసేవసేయు మనసా** ॥పల్లవి॥

**దైవమూఁ గొంచము గాఁడు తానూగొంచము గాఁడు**
**భావించి కొలచేవారిపరిపాటి**
**చేవలఁబత్తిముదుగు చేనిముదుగూ లేదు**
**వావిరిఁ బోఁగెత్తేటివారివారినేరుపు** ॥అన్ని॥

**కాలము కడమలేదు కర్మము కడమలేదు**
**కేలి విశ్వాసముగలిగినపాటి**
**వ్రాలకు ముదిమీ లేదు వక్కణ ముదిమీ లేదు**
**పోలించేటివిద్వాంసులబుద్ధిలోనినేరుపు** ॥అన్ని॥

**జ్ఞానానకుఁ దప్పు లేదు జన్మానకుఁ దప్పు లేదు**
**నానాటికి వివేకించి నడచేపాటి**
**పానిపట్టి శ్రీవేంకటపతి యింతకు మూలము**
**ఆనుక యాతని శరణనేవారినేరుపు** ॥అన్ని॥ **90**

**భావవివరము:**

ఎంతగానో యోచించిన తదనంతరం, స్వామికృపవలన నాకు ఈ కీర్తన ఇలా స్ఫురించింది.నాకు అన్నమయ్య అంతరంగమేమిటో పూర్తిగా అవగతం కాలేదు. కాని ప్రయత్నం అయితే చేస్తున్నాను. పల్లవిలో ఈ చెప్పబోయేవన్నీ తన ఆచార్యుని అధీనములే. కనుక ఓ మనసా! నీవు సొంపుగా హరిపాదసేవ చేయుము. దైవాన్ని భావించి కొలిచే వారిని బట్టి దేవుడుంటాడు కాని, దేవుడూ తక్కువవాడు కాదు - తనూ (భక్తుడూ) తక్కువవాడు కాదు. నిశితంగా చూస్తే బత్తిముదుగులేదు (శ్రధలోనూ లోపంలేదు) చేని ముదుగులేదు (పొలం యొక్క లోపమూ లేదు). పోగెత్తే వారివారి నేర్పులోనే బేధం వున్నది. (అంటే... రైతు చాకచక్యంలోనే తేడా వున్నది). ఆలోచించి తెలుసుకొంటే, కాలములోనూ లోపం వుండదు - కర్మములోనూ లోపం వుండదు. మనకు వాటిమీద యెంత విశ్వాసం వున్నదో ఆపాటిదే లోపంకూడా. వ్రాలు (చేతివ్రాత) ముదిమిచెందదు, వక్కణము (నోటివ్రాలు) ముదిమి చెందదు. కానీ పండితుల విశ్లేషణలలోనూ వారి వారి నేర్పులోనూ బేధం వున్నది. మానవుని జన్మలోనూ లోపంలేదు, వాడు పొందిన జ్ఞానంలోనూ లోపంలేదు. ప్రతిదినమూ వాడి నడవడిలోనూ వాడి వివేకంలోనూ లోపము వుంటుంది. పూనిన శ్రీవేంకటేశ్వరుడే వీటన్నిటికీ మూలము. ఆ తరువాత ఆయన శరణన్నవారిదే నేర్పరితనమంతా.

★ **పానిపట్టి** - పూని ★ **పోలించే** - పోల్చిచూసే

సంఖ్య : 243 సంపుటము : 2 పుట: 163 రాగం : సాళంగనాట

**7 అహోబలేశ్వరునకు నాదిమూర్తికి**
**విహారమే పంతము వీరసింహమునకు** ॥పల్లవి॥

**చుక్కలు మొలపూసలు సూర్యచంద్రులు కన్నులు**
**దిక్కులు చేతు లెండలు దివ్యాయుధాలు**
**మిక్కుటపువేదములు మించుఁగొసవెంట్రుకలు**
**రక్కసులఁ జెందేవిదారణ సింహమునకు** ॥అహో॥

**శైలములే పాదములు జానువులే లోకములు**
**కాలచక్రమే నోరు గ్రహాలు పండ్లు**
**చాలుకొన్న మేఘములు సకలదివ్యాంబరాలు**
**పాలించేప్రతాపపు సింహమునకు** ॥అహో॥

**అంతరిక్షమే నడుము అట్టె భూమియే పిరుఁదు**
**వంతఁ గృపారసము వార్ధులెల్లాను**
**యింతటా శ్రీవేంకటాద్రి యిరవు మహాగుహ**
**రంతు లురుములు హోరరౌద్రసింహమునకు** ॥అహో॥ **243**

**భావవివరముః**

అహోబల నారసింహునిపై చక్కటి కీర్తనను వినిపిస్తున్నారు అన్నమయ్య. ఈ అహోబలేశ్వరునికి విహారమే పంతమైన వీరసింహము. తెలుసుకొంటే ఈయన కృతయుగమునాటి ఆదిమూర్తి. ఈయన విశ్వరూపాన్ని కనులారా గాంచలేము. కాని ఆచార్యులవారి వర్ణనను విని తరించెదము గాక! ఈ మహానుభావుడి మొలత్రాటికి గట్టిన పూసలవలె నక్షత్రాలు మెఱయుచున్నవి. సూర్యచంద్రులు ఈయన నేత్రములు. దిక్కులే ఆయన అనంతమైన చేతులు. తలపింపచేసే చూపులే దివ్యాయుధములు. మిక్కుటముగానున్న వేదమంత్రములే ఈయన జూలులోని వెంట్రుకలు. దారణమైన ఈ సింహము రాక్షసులందరిని చెండాడినది. ఈ అహోబలపు కొండలే ఈయన పాదములు. చతుర్దశ భువనములు ఈయన జానువులు (మోకాళ్ళు) తెరచియుంచిన ఈయన నోరు సర్వభక్షకమైన కాలము. ఈయన పండ్లు గ్రహములు. విస్తరించిన మేఘమండలమే ఈయన దివ్యాంబరములు. జగములను పరిపాలించే ప్రతిరూపము గల ఈ నరసింహుని విశ్వరూపమేమని వివరించగలము? ఇక అంతరిక్షము ఈ స్వామి నడుమువలె ఒప్పినది. భూమి ఈయన సువిశాలమైన పిరుదులు. లోతైన సాగరములే ఈయన కృపారసము. ఈయన ఇరవుయైన గుహ అల్లదిగో ఆ వేంకటాచలమే. ఈ ఘోరరౌద్రమూర్తి పెడబొబ్బలే ఉరుములు.

★ **చాలుకొన్న** – విస్తరించిన ★ **వార్ధులు** – సముద్రములు

సంఖ్య : 266 సంపుటము : I పుట: 178 రాగం : శ్రీరాగం

**8 ఆపన్నులపాలిదైవ మాతఁడే గతిఁదక్క**
**యే(ప్రొ(పొ)ద్దును భజియించఁగ నితరుఁడు మరి కలఁడా ॥పల్లవి॥**

**నిరుపాధికనిజబంధుఁడు నిరతిశయానందుఁడు**
**కరివరదుఁ డితఁడేకాక ఘనుఁ డధికుఁడు గలఁడా ॥ఆప॥**

**సంతతగుణసంపన్నుఁడు సాధులకుఁ బ్రసన్నుఁడు**
**అంతర్యా మితఁడేకాక అధికుఁడు మరి కలఁడా ॥ఆప॥**

**పరమాత్ముఁడు పరమపురుషుఁడు పరికింపఁగఁ గృపాలుఁడు**
**తిరువేంకటవిభుఁడేకాక దేవుఁడు మరి కలఁడా ॥ఆప॥ 266**

**భావవివరముః**

ఆపదలతో వివశులైనవారి పాలిటి దైవము ఆతడే (ఆ శ్రీహరియే) అంటున్నారు అన్నమాచార్యులవారు. యేవేళనైనా భజించుటకు వీలయిన 'గతి' కూడా ఇతడుగాక మరెవరున్నారు? మానవులారా! ఇతగాడుదక్క మాకింకోగతి లేనే లేదు. ఉపాధి (శరీరము) లేని ఆత్మలకు వుద్ధరించగల నిజమైన బంధువు ఇతడే. ఈ మహానుభావుడే శ్రేష్టమైన ఆనంద స్వరూపుడు. కానలయందు గజేంద్రుని మొసలిబారి నుండి రక్షించినది ఇతడే. ఇతడు కాక ఘనుడని పిలువదగ్గవాడు మరొకడున్నాడా? ఇతని మహనీయ గుణములన్నీ శాశ్వతమైనవి. సాధుజనులకు ప్రసన్నతతో కనిపిస్తాడు. ఆత్మ రూపంలో సమస్త జీవులలోనున్న అంతర్యామి ఇతడే. ఇతగాడుగాక మరొకడున్నాడా? పరికించగా పరమాత్ముడని పిలువదగ్గవాడు యెవడు? పరమపురుషుడు (పురుషోత్తముడు) అనబడెడివాడూ ఇతడే. తిరువేంకటవిభుడు అనిపిలువదగిన వాడితడుగాక! మరొకడు కలడా?

★ **సంతత** – శాశ్వతమైన ★ **ఏప్రొద్దును** – ఏవేళనైనా

సంఖ్య : 108 సంపుటము : 2 పుట: 73 రాగం : బౌళి

**9 ఆర్పులు బొబ్బలు నవె వినుఁడు**
**యేర్పడ నసురల నిటువలె గెలిచే** ॥పల్లవి॥

**కూలినతలలును గుఱ్ఱపుడొక్కలు**
**నేలపైఁ బారిననెత్తురులు**
**వోలిఁ జూడుఁ డిదె వుద్ధగళలీరణ (?)**
**కేలిని విష్వక్సేనుఁడు గెలిచె** ॥ఆర్పు॥

**పడినరథంబులు బాహుదండములు**
**కెడసినగజములు గొడగులును**
**అడియాలము లివె అక్కడ నిక్కడ**
**చిదుముడి విష్వక్సేనుఁడు గెలిచె** ॥ఆర్పు॥

**పగుల పగుల వృషభాసురునిఁ జంపె**
**పగ నీఁగె అతనిబలములతో**
**అగపడి శ్రీవేంకటాధిపుపంపున**
**జిగి గలవిష్వక్సేనుఁడు గెలిచె** ॥ఆర్పు॥ **108**

**భావవివరముః**

వృషభాసురుని వధించమని శ్రీమహావిష్ణువు తన సర్వసేనాని విష్వక్సేనులవారిని పంపాడు. దారుణమైన యుద్ధం జరిగి పగ సాధించాడు విష్వక్సేనుడు. భీభత్స రస ప్రధానమైన కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. ఆర్తులు పెట్టే బొబ్బలు అవిగో వినండి. అసురుల ఆర్తనాదాలనడుమ ఈ విధముగా విష్వక్సేనుడు గెలిచినాడు. అదిగో ఆ రణరంగమున యెంతమంది తలలు తెగి పడినవో చూడండి. తెగిన గుఱ్ఱపు డెక్కలు అసంఖ్యాకంగావున్నాయి. నేలపై నెత్తురు ఏరులై పారింది. ఆటలాగా విష్వక్సేనుడు గెలిచిన ఈ వుద్దండమైన రణమును ఇదే కనులారా చూడండయ్యా!అదిగో రథములు విరిగి పడిపోయినవి. భుజములతోపాటు తెగిపోయిన చేతులవిగో. చచ్చిపడిపోయిన ఏనుగులవిగో. రథములపైనున్న కేతనములు(జెండాలు) విరిగి పడిపోయాయి. అక్కడ ఇక్కడా పడివున్న వాటి అడియాలములు (ఆనవాళ్ళు) ఇవిగో. ఎంత చిదుముడితో (కోపముతో) విష్వక్సేనుడు గెలిచాడో చూడండి. వృషభాసురుని తలనుపగులకొట్టి చంపాడు విష్వక్సేనుడు. ఆయన పగతో చొచ్చుకు పోయాడు. శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞపై పంపబడిన విష్వక్సేనుడు గెలిచి అతిశయించుట సహజమే కదా!

★ **కెడసిన** – పడిపోయిన ★ **పగనీఁగె** – పగతో చొచ్చుకుపోయాడు

సంఖ్య : 212 సంపుటము : I పుట: 178 రాగం : ఆహిరి

**10 ఆసమీఁద విసుపౌ (వౌ?) దాఁక, యీ-**
**గాసిఁబరచుతనకపటమే సుఖము** ॥పల్లవి॥

**తిరమగుఁగర్మము దెగుదాఁక, ।తన-**
**గరిమసుఖము పొగడునందాఁక**
**పరమార్గం బగపడుదాఁక, తన-**
**పరితాపపులంపటమే సుఖము** ॥ఆస॥

**కాయము గడపల గనుదాఁక ।యీ-**
**మాయ దన్ను వెడమరుదాఁక**
**రాయడిమదము గరఁగుదాఁక ।యీ-**
**రోయఁదగినతనరూపమే సుఖము** ॥ఆస॥

**లంకెలఁబొరలి నలఁగుదాఁక ।యీ-**
**యంకెలభవము లెరవౌదాఁక**
**వేంకటపతిఁ దడవినదాఁక యీ-**
**కింకురువా ణపుగెలుపే సుఖము** ॥ఆస॥ **212**

**భావవివరముః**

మురికి నీటిబావిలోవున్న కప్ప తన బ్రతుకే సుఖము అనుకొంటుంది. అన్నమయ్య ఈ కీర్తనలో అదే విషయాన్ని ఇంకొక విధంగా చెబుతున్నారు. మానవులకు ఆశ అంటే విసుగు పుట్టేదాక, పరులను గాసిబరచు (బాధపెట్టు) తనకపటత్వమే గొప్ప సుఖంగా వుంటుంది. అజ్ఞానం వలన నరులు బాధే సౌఖ్యమనుకొంటుంటారు. స్థిరమైన తనకర్మ తెగిపోయేదాకా, తాననుభవిస్తున్న సుఖాన్ని పరులు పొగడునందాకా, తనకు ఇహముపై వ్యామోహం నశించి పరమును పొందే మార్గం కనబడేదాకా, పరితాపం కలిగించే తన లంపటాలే తనకు సుఖంగా వుంటాయి. ఈ శరీరం గడపలు దాటేదాకా (చచ్చేటంతవరకు) ఈమాయ తనను విడిచిపెట్టేదాకా, రాజసన్మానాల మదము నశించేదాకా, రోత కలిగించే తన రూపమే తనకు సుఖముగా వుంటుంది. వరుసగా తీసికొనిన చేబదుళ్ళు నలిగిపోయేదాకా, ఈ తప్పనిసరి భవములు (జన్మలు) భారమయ్యేదాకా, శ్రీవేంకటేశ్వరుడు తడవినదాకా (స్పర్శ లభించేదాకా) మనవెంట వుండి యేమి చేయాలి దొరా! అని అడిగే సేవకుల వలన కలిగే దర్పమే సుఖముగా వుంటుంది.

★ **లంకెల పొరచి** – వరుసగా తీసికొన్న అప్పులు

★ **కింకరువాణపు** – కింకర్వాణుడు (ఏమిచేయాలి అని అడిగే సేవకుడు)

సంఖ్య : 434 సంపుటము : 1 పుట: 291 రాగం : సామంతం

**11 ఇందిరాధిపునిసేవ యేమరకుండుటగాక**
**బొందితోడిజీవులకు బుద్ధి లేఁటిబుద్దులు** ॥పల్లవి॥

**రేయెల్లా మింగిమింగి రేపే వెళ్లనుమియు**
**బాయట నిద్రాదేవి పలుమారును**
**చాయలకు నిచ్చనిచ్చాఁ జచ్చిచచ్చి పొడమేటి -**
**మాయజీవులకునెల్లా మని కేఁటిమనికి** ॥ఇంది॥

**కనురెప్ప మూసితేనే కడు సిష్టే చీఁకటౌను**
**కనురెప్ప దెరచితే క్రమ్మరఁ బుట్టు**
**ఘనమై నిమిషమందే కలిమిలేమియుఁ దోఁచె**
**యెనయుజీవుల కింక యెఱు కేఁటియెఱుక** ॥ఇంది॥

**వొప్పగుఁబ్రాణము లవి వూరుపుగాలివెంట**
**యెప్పుడు లోనివెలికి నెడతాఁకును**
**అప్పఁడు శ్రీవేంకటేశుఁ డంతరాత్ముఁ డందరికి**
**తప్పక యాతఁడే కాచు, తలఁ పేఁటితలఁపు** ॥ఇంది॥ **434**

**భావవివరముః**

అన్నమయ్య ఈ అధ్యాత్మ కీర్తనలో మానవశరీరం ధరించిన జీవుని బుద్ధి యేమంత గొప్పబుద్ధి? అయినా ఈ బొందితో మాత్రమే అతగాడు చేయగలిగింది ఒక్కటి వుంది. అదే ఇందిరానాథుడైన శ్రీహరి పాదసేవను యేమరకచేయుటయే. అదే వాడి ముక్తిమార్గము. పోనీ ఈ నరుడు చేసే ఘనకార్యాలేమిటో చూడండి. రాత్రంతా పొట్టనిండా మెక్కుతాడు. రేపటి రోజున ఆతిన్నదంతా వెడలగక్కుతాడు. ఇక నిద్రాదేవి వాడిని పట్టుకొన్నదంటే స్పృహే వుండదు. ఇట్లా రోజూ చచ్చీ చచ్చీ, నిచ్చనిచ్చ (ప్రతిదినమూ) చీకటిపడితే వీడి పని ఇంతే. ఇట్టి మాయా పరితప్తులైన జీవుల మనికి (మనుగడ) యేమి మనికి చెప్పండి? ఇక వీడు కనురెప్పలు మూసినాడంటే సిష్టే (సృష్టి అంతా) చీకటే కదా! కళ్ళు మళ్ళీ తెరుచుకొంటేనే వీడు మళ్ళీపుట్టినట్లు ఒక్క నిమిషంలో కన్న కల కరిగిపోతుంది. ఆ కలలోనే కలిమిలేములు అనుభవిస్తాడు. ఇటువంటి జీవుడి జ్ఞానం యేమి జ్ఞానం చెప్పండి? ఈ జీవుడి వూపిరి లోపలికిపోయి బయటకు వస్తుంది. అది మళ్ళీ లోపలికి పోతేనే వీడు బ్రతికున్నట్లు. లేకపోతే అది కట్టె మాత్రమే. అప్పుడు (తండ్రి) అయిన శ్రీవేంకటేశ్వరుడు అందరికీ అంతర్యామి. కాబట్టి ఆయనే కాచుకొని రక్షిస్తున్నాడు. లేకున్న వీడి సంకల్పం ఒక సంకల్పమా?

★ **క్రమ్మర** – మరల ★ **చాయలకు** – రాత్రికి

సంఖ్య : 140 సంపుటము : 2 పుట: 94 రాగం : మాళవి

**12 ఇందుకుఁ జింతించనేల యీశ్వరునిమాయ లివి**
**యెందుకు మూలము హరి యీతనిఁ జింతించరే** ॥పల్లవి॥

**అల నారికడపుఁగాయకు నీరు వచ్చినయట్టు**
**తలఁచి రాఁగలమేలు తన్నుఁ దానే వచ్చురే**
**లలి నేనుగుదిన్నవెలఁగపంటిబేసము-**
**వలెనే పోఁగలవెల్ల వడిఁ దానే పోవురే** ॥ఇందు॥

**నిండినయద్దములోన నీడ వొడచూపినట్టు**
**దండియైనపుట్టుగులు తన్నుఁ దానే వచ్చురే**
**పండినపండ్లు తొడమఁబాసి వూడినయట్టు**
**అండనే మరణములు అందరికి సరిరే** ॥ఇందు॥

**పెనురాతిపైఁ గడవ పెట్టఁగా గుదురైనట్టు**
**తనుఁదానే చింతింపఁ దలఁపు నిలుచురే**
**గనుఁడు శ్రీవేంకటేశుఁ గని శరణన్నఁ జాలు**
**వెనక పాపాలు మంచు విచ్చినట్లు విచ్చురే** ॥ఇందు॥ **140**

**భావవివరము:**

శ్రీహరి నిర్ణయమే అమలవుతుంది. ఆయన మాయవలన ఆ నిర్ణయం మనదే అనుకొని సుఖదుఃఖాలకు లోనవుతుంటాము. అన్నమయ్య ఇదే చెబుతూ దీనికోసం చింతించటం యెందుకు? దీనికి (ఈ మాయకు) మూలకారణమైన హరిని చింతించరేమిరా? అని నిగ్గదీస్తున్నారు. అదిగో నారికడపుగాయకు (కొబ్బరికాయలో) నీళ్ళు వచ్చినట్లు హరి మనకు నిర్ణయించిన మేలు దానంతట అదే వస్తుంది. అట్లాగే ఏనుగు మింగిన వెలగపండులోని గుజ్జు ఎలా మాయమై పోతుందో, పోగలవన్నియు శీఘ్రముగా పోతూనే వుంటాయి. ఇది శ్రీహరి మాయ. దీని కోసం ఏడుపు యెందుకురా? ఎదురుగ నిలబడినంతమాత్రమున అద్దములో నీప్రతిబింబం వచ్చినట్లు భగవన్నిర్ణయం ప్రకారం నీ పుట్టుక నీ ప్రమేయం లేకుండానే వస్తుంటుంది. పండిన పండు దైవ నిర్ణయ ప్రకారం తొడిమనుంచి వూడిపడిపోతుంది. అట్లాగే యెన్ని పుట్టుకలో అన్ని మరణాలూ తప్పవురా! (హరి మాయ యేమంటే ఒకేసారి పుట్టిన రెండు పండ్లు ఒకేసారి పడిపోవు. అందుకే కవలలు ఒకేసారి పుట్టినా ఒకేసారి చావరు). ఒక నీటి కడవను నేలపైకాక పెద్దరాతిపై వుంచితే దొర్లిపోకుండా వుంటుంది. అట్లాగే ఆత్మ విమర్శ చేసికొంటూ ఆలోచిస్తే ఆ 'తలపు' కలకాలం నిలుస్తుంది. ఘనుడైన శ్రీవేంకటేశ్వరుని దర్శించి శరణు వేడితే చాలును గత జన్మలలో నీవు చేసిన పాపాలు కూడా పొగమంచు విచ్చుకొన్నట్లు అవే విచ్చిపోతాయిరా!

★ **లలి** – విలాసముగా ★ **అండనే** – అక్కడే

సంఖ్య : 375 సంపుటము : I పుట: 251 రాగం : పాడి

**13 ఇందునుండ మీ కెడ లేదు**
**సందడిసేయక చనరో మీరు** ॥పల్లవి॥

**నాలుక శ్రీహరినామం బున్నది**
**తూలుచుఁ బారరొ దురితములు**
**చాలి భుజంబున చక్రం బున్నది**
**తాలిమి భవబంధము లటు దలరో** ॥ఇందు॥

**అంతర్యామై హరి వున్నాఁ డిదె**
**చింతలు వాయరొ చిత్తమున**
**వింతలఁ జెవులను విష్ణుకథ లివిగొ**
**పొంతఁ గర్మములు పోరో మీరు** ॥ఇందు॥

**కాపయి శ్రీవేంకటపతి పేరిదె**
**నాపై నున్నది నయమునను**
**కోపపుకామాదిగుణములాల మీ-**
**రేపున కడఁగడ నెందైనఁబోరో** ॥ఇందు॥ **375**

**భావవివరముః**

అన్నమయ్య ఈ కీర్తనలో పాపములను భవబంధములను, చింతలను, కర్ణములను, తనను పీడించే అరిషడ్వర్గములను తన జోలికి రావద్దని హెచ్చరిస్తున్నారు. వాటితో యేమంటున్నారంటే, “ఇక్కడా అక్కడా (ఇహపరములలో) మీకెదురులేకపోవచ్చు గాక! మీరు నాదగ్గరనుండి చప్పుడు చేయకుండా పోండి. ఓ దురితములారా (పాపములారా!) నా నాలుకమీద శ్రీహరి నామమే యెప్పుడు వుంటుంది. మీరు తూలిపోతూ పారిపోండి. నన్ను పీడించే భవబంధములారా! మీకెంత ధైర్యం? నా భుజములపైనున్న సుదర్శన చక్రముద్రను చూశారా? అది మిమ్మల్ని నరికివేస్తుంది జాగ్రత్త. నా మదిలోనున్న చింతలారా! నన్ను వదలిపారిపోండి.నాలో అంతర్యామిగా వున్నది యెవరనుకొన్నారు? సాక్షాత్తు శ్రీహరియే సుమా! పొంతకర్మములారా! (పురాకృత కర్మములారా!) మీరుపోరో! (పొండే పోండి). నా యీ చెవులెప్పుడు వింతలైన విష్ణు కథలను వింటూనే వుంటాయి. వాటి జోలికి పోకండి. నయముగా నాకు కాపై (రక్షయై) శ్రీవేంకటేశ్వరుని నామము వున్నది. కామకోధాది అరిషడ్వర్గములారా! మీరు యేపున (అతిశయించి) కడగడ (గడగడ వణుకుతూ) యెక్కడికైనా పారిపోండి.

★ **చనరో** – పోండిరా ★ **తాలిమి** – ధైర్యము

సంఖ్య : 106 సంపుటము : XV పుట: 71 రాగం : మంగళకౌశిక

**14 ఇది గాదు తెరువు యీడేరేవారికి**
**అదన విజ్ఞాని యైతే అతఁడే రక్షించును ॥పల్లవి॥**

**తలఁపులు చక్కఁగాక దైవముఁ దలఁచఁబోతే**
**వెలి దున్ననినేలను విత్తిన యట్లు**
**పొలసి దాసుఁడుగాక పూజించఁ బోవు టెల్ల**
**బలిమి దేవునిఁ బట్టి బంటకు నాఁగుటా ॥ఇది॥**

**తనవైరాగ్యము లేక తత్త్వము వెదకేనంటే**
**తనియ కిసుక పాఁతర దవ్వుటా**
**కొనభక్తిలేక హరిఁగోరి మొక్కుటెల్ల**
**మొనసి దేవుని సొమ్ము ముచ్చిలించుకొనుటా ॥ఇది॥**

**వెస గురుఁడు లేక శ్రీ వేంకటేవు సాధించితే**
**అసదై(?) యందనిపంటి కట్టు చాఁచుట**
**పసగా నితనిఁ దనపనికిఁగాఁ బొగడుట**
**యిసుమంత చెలమకు యేఁతము లెట్టుటా ॥ఇది॥ 106**

**భావవివరముః**

పెదతిరుమలయ్య సుస్పష్టముగా ఏమి చెబుతున్నారో ఆస్వాదించండి. ఈడేరేవారికి (మోక్షము సాధించేవారికి) ఇదిగాదు తెరవు (దైవమును తలచుకోవటం, వైరాగ్యంతో వున్నట్లు తత్త్వ బోధ చేయటం మొదలైనవి). నిజమైన తత్త్వజ్ఞానిని శ్రీహరి తానే స్వయంగా రక్షిస్తాడు. తలపున హరిస్థిరపడక పైకి ధ్యానం చేయటం దున్నని నేలలో విత్తనాలు నాటడం లాంటిది. శ్రీహరికి దాసుడుగాక యేవేవో పూజలు చేస్తారే వాళ్ళంతా దేవుడే వచ్చి పంటసాగు చేయాలని ఆశపడే సోమరులు. కొంతమందికి తత్త్వవేత్తలనిపించుకోవాలని గొప్ప ఆశ వుంటుంది. మంచిదే... కాని వైరాగ్యం లేని వారికి తత్త్వజ్ఞానమెలా వస్తుంది? ఇసుక పాతర (ఎడారి) యెంత తవ్వినా ఇసుక తప్ప మరేమి వస్తుంది? హరి భక్తిలేనివాడు హరి దర్శనం పొందాలనుకోవటం, దానికై మొక్కటం దేవుని నగలు దొంగిలించాలనుకోవటం లాంటిదే. గురూపదేశం లేకుండా శ్రీవేంకటేశ్వరుని సాధించటం అసాధ్యం. అది ఇతరుల పంటకు అట్టులు చాచుట వంటిది. తనపని సానుకూలమవ్వాలని ఈ తిరుమలేశుని నుతించుట, పాదాలుకూడా పూర్తిగా మునగని 'చెలమ'కు యేతము పెట్టి నీళ్ళు తోడటంలాంటి పిచ్చిపని.

★ **చెలమ** – నీటిగుంట ★ **పొలసి** – అతిశయించి

సంఖ్య : 360 సంపుటము : XV పుట: 242 రాగం : రామక్రియ

**15 ఇది తుద మొదలని యెఱుఁగ రెవ్వరును**
**యెదుట నీ మహిమ యెంతని తలఁతు** ॥పల్లవి॥

**తరణిచంద్రుల రథంబుల వెంటను**
**గరిమలఁ దిరిగీ కాలమూ**
**వురవడిఁ బ్రాణుల నూర్పులవెంబడి**
**నరుదుగ మెఱసీ నాయుష్యములు** ॥ఇది॥

**నెలకొని యెండల నీడల దండనె**
**తెలుపుచుఁ బొదలే దినములు**
**వెలయఁగఁ జీకటి వెన్నెలమాటున**
**మలసీ సారెకు మాసములు** ॥ఇది॥

**వానలశీతున వాయుమార్గమున**
**యీనుచు నున్నవి యేండు**
**తానక మైనది తలఁపఁగ నీయందు**
**శ్రీనిధి చూడవే శ్రీవేంకటేశ** ॥ఇది॥ **360**

**భావవివరము:**

పెదతిరుమలయ్య ఈ అధ్యాత్మ కీర్తనలో నరులకు కాలము యొక్కగానీ, ప్రాణముయొక్కగానీ తుది మొదలు తెలియనే తెలియవు అంటున్నారు. మా యెట్టెదుట జరిగేవే మాకు తెలియదంటే, నీమహిమ యెంతని భావింతునయ్యా? అంటున్నారు. ప్రభూ! ఈ కాలము యెట్లు నిర్ణయింపబడింది. ఈ కాలము తరణి (సూర్యుడు) చంద్రుడు యొక్క రథముల వెంట తిరుగుతూనే వున్నది. ఇక వారి ఆయుర్దాయం గురించి, యెన్నిసార్లు వూపిరిని పీలుస్తాడనేదే వాడి జీవితకాలము. కామక్రోధాలతో యెంత “వడి”గా జీవి వూపిరి పీలుస్తే అంత త్వరగా వాడి ఆయువు తరిగిపోతుంది. దినములు యెలా గడుస్తాయో ఆలోచించండి. రాత్రి పగలు వరుసగా వస్తూపోతూ వున్నందువల్ల దినములు దొర్లిపోతున్నాయి. అమావాస్య చీకటి తరువాత, నిండు పున్నమి వెన్నెల వస్తూనే వున్నది. వాటి మూలంగానే నెలలు దొర్లిపోతున్నాయి. ఇదంతా కాలచక్రమే కదా! ఇది ఒకే వేగముతో తిరుగుతోంది. ఇది నీ మహిమకాక ఇంకెవరి మహిమయ్యా దేవదేవా? ఇక మేము ఏండ్లు గడుస్తున్నాయని లెక్కలు కట్టుకొంటాము. ఆ లెక్కయెన్నటికీ తప్పదు. వానాకాలం, శీతాకాలం, వడగాడ్పులూ వరుసగా ఒకే క్రమంలో వస్తున్నాయి. ఇవన్నీ సుస్థిరమైన సంకల్పముగా చేస్తున్న శ్రీవేంకటేశ్వరా! ఇవన్నీ శ్రీనిధి వలె నీయందేవున్నవయ్యా!

★ **పొదలు** – వర్ధిల్లు ★ **తానకమై** – స్థానమైట

సంఖ్య : 246 సంపుటము : XV పుట: 166 రాగం : సామంతం

**16** ఇద్దరము నిద్దరమె హృషీకేశ
యిద్దె సనకాన వచ్చె హృషీకేశా ॥పల్లవి॥

ఏఁటికోయి మాతో హృషీకేశ
యీటువెట్టేవు సతుల హృషీకేశ
యీటారదు మాపొందు హృషీకేశ నీపై
యేటి దియ్యమింక నేము హృషీకేశ ॥ఇద్ద॥

ఇచ్చకురాలను నేను హృషీకేశ నిన్ను
నెచ్చుకుందులాడఁ జాల హృషీకేశ
ఇచ్చితి వింత చనవు హృషీకేశ నీకు
నెచ్చరించే మరవకు హృషీకేశ ॥ఇద్ద॥

యేల నీకు మఱుఁగులు హృషీకేశ
నీలాగునఁ గూడితివి హృషీకేశ
యేలితి శ్రీవేంకటాద్రి హృషీకేశ
యీలీలనే వుండుమీ హృషీకేశ ॥ఇద్ద॥ **246**

**భావవివరము:**

"హృషీకము" అంటే ఇంద్రియము అని అర్థము. హృషీకమునకు ఈశుడు (ప్రభువు) హృషీకేశుడు. విష్ణువును హృషీకేశుడంటారు. పెదతిరుమలయ్య చెప్పిన ఈ కీర్తనలో వెన్నుని హృషీకేశా అని సంబోధిస్తున్నారు. ఆదిలోనే హంసపాదు అని పల్లవిలోనే బుఱ్ఱతిరిగిపోయింది. "యిద్దె సనకాన వచ్చె హృషీకేశా" అంటే "ఈ విషయంలోనే కనబడుతున్నది హృషీకేశా". ఇప్పుడు పల్లవిని ఇలా అర్థం చేసికొనవచ్చును. నాయిక ఇలా అంటున్నది. "ఓ హృషీకేశా! మనమిద్దరమునూ ఇద్దరమే. అది ఈ విషయంలోనే కనబడుతున్నది" (ఇక మిగతా కీర్తన అంతకష్టం కాదు). ఓ హృషీకేశా! మాతో యెందుకయ్యా పేచీ. సతులను ఈవిధముగా ఈటువెట్టతగునా (వూరకనే అల్లరి చేయుట సరియా?) మా పొందు ఈటారదు (వ్యర్థం కాదు). ఇంక మేము నీకు అంగీకారం తెలిపేదేముంది, హృషీకేశా? నేను ఇచ్చకాలు (పైపై ప్రియవచనములు) చెప్పేదాననా? ఓ హృషీకేశా! నీతో హెచ్చుతగ్గు మాటలు మాట్లాడలేనయ్యా? నీకు మేమెంత చనువిచ్చామో నీవే ఆలోచించు. నీ ప్రవర్తనను గురించి యేనాడో హెచ్చరించాము, హృషీకేశా! నీకింకా మాతో దాగుడుమూతలెందుకయ్యా? నన్నున్ యీలాగునకూడితివి. నన్ను శ్రీవేంకటాద్రి హృషీకేశుడవై యేలితివి. ఓ హృషీకేశా! నీవు యీలాగుననే నాతో వుండవయ్యా!

★ **ఎచ్చుకుందులు** – హెచ్చుతగ్గులు ★ **మఱుగులు** – దాగుడుమూతలు

సంఖ్య : 486 సంపుటము : 1 పుట: 326 రాగం : బౌళి

**17 ఇరవైనయట్టుండు యెఱఁగనీ దీమాయ**
**తెరమఱఁగుమెకమువలె తిరుగు నీబ్రదుకు** ॥పల్లవి॥

**అనిశమును దేహమున కన్నపానము లిడిన**
**యినుము గుడిచిననీరు యెందుకెక్కినదో**
**గొనకొన్నమానినులకూటములసుఖము లివి**
**మనసుదాగినపాలు మట్టులేదెపుడు** ॥ఇర॥

**వొడలఁబెట్టినసొమ్ము లొగిఁ దనకుఁ గానరా-**
**వడవిఁ గాసినవెన్నె లది కన్నులకును**
**వుడివోనిపరిమళము లొకనిమిషమాత్రమే**
**బెడిదంపుభ్రమతోడిపెనుగాలిమూఁట** ॥ఇర॥

**చద్దిసంసారమున సరుస సుఖదుఃఖములు**
**యెద్దుయెనుపోతునై యేకంబు గాదు**
**వొద్దికై శ్రీవేంకటోత్తముఁడు యింతలో**
**అద్దంపునీడవలె నాత్మఁ బొడచూపె** ॥ఇర॥ **486**

**భావవివరము:**

అన్నమయ్య తిరుమలేశునితో యేమంటున్నారో వినండి. ఈ నీయొక్క మాయ ఇరవైనయట్లుండు (అనుకూలంగా వున్నట్లే వుంటుంది). కాని యెఱుగనీదు నీ మాయయే. మానవుని బ్రతుకు తెరచాటున వున్న మృగానికి వలె యెప్పుడు వాడినే మింగేస్తుందో తెలియదు. నీటిలోపడిన ఇనుమును కొంతకాలానికి నీరు కబళించినట్లు ఎల్లప్పుడూ అన్నపానములనిస్తుంటేనే దేహముంటుంది. లేకుంటే మెల్లమెల్లగా పోతుంది. మానినులతో సంభోగ సుఖము యెట్టిదంటే, పాలుతాగినది నోరైతే మనస్సుసంతోషపడటం వంటిది. నిజానికి నోటికి యేసంతోషమూ లేదు. అడవిలో కాచిన వెన్నెల యెవ్వరికీ వుపయోగపడనియట్టే, యెవ్వరు ధరించిన నగలు వాడికి అందముగా కానరావు. ఎంత వుడివోని (వదలని) పరిమళం అయినా దాని వ్యాపనము ఒక్క నిముషము మాత్రమే కాని పెనుగాలి వీచిందంటే మూట కొట్టుకొనిపోయినట్లు పోతుంది. చద్ది సంసారమున (వేడి తగ్గిన సంసార జీవితంలో) జమిలిగా వచ్చే సుఖదుఃఖాలు దున్నపోతును ఎద్దును జంటగా కట్టిన బండిలాంటిది. రెండడుగులు ముందుకు లాగితే ఒక అడుగు వెనుకకు లాగుతుంది. ఇటువంటి హీనస్థితిలో శ్రీవేంకటేశ్వరుడు ఆత్మ దర్పణంలో పొడచూపి నన్ను (ఆనాడు అన్నమయ్యను, ఈనాడు నాబోటి అనామకుడినీ) ధన్యుణ్ణి చేశాడు.

★ **బెడిదంపు** – దోషములతో కూడిన ★ **ఎనుబోతు** – దున్నపోతు

సంఖ్య : 27 సంపుటము : XV పుట: 19 రాగం : లలిత

**18 ఉన్నమాట లిక నేల వో దేవా**
**యెన్నటి కిదేమాట యింకా నింకాను ॥పల్లవి॥**

**కొంత నా కర్మఫలము కొంత నీ రక్షకత్వము**
**యింతలో రెండు గలవా యేమో దేవా**
**అంతర్యామివి నీవు ఆడేటిబొమ్మను నేను**
**చెంతఁ గాచుట నీపని సేవసేయ నాపని ॥ఉన్న॥**

**నే నపరాధి నయ్యేది నీవు వహించు కొనేది**
**యీ నెపాలు రెండూ నేల యేమో దేవా**
**మానక యిట్లయితే నీ మహిమకు గురుతేది**
**అని చింతించే నందుల కపకీర్తి యనుచు ॥ఉన్న॥**

**మెదలే నా యధమము మీ ఘనత యెంచి కావు**
**యిదియే నా విన్నపము యేమో దేవా**
**యెదుట శ్రీవేంకటేశ యిన్నిటా నీ బంటు బంట**
**పదివేలు నా నేరాలు పట్టకుమీ యిఁకను ॥ఉన్న॥ 27**

**భావవివరముః**

పెదతిరుమలయ్య పశ్చాత్తాపంతో దేవదేవుని వేడుకొంటున్నారు. ఆయన ఆర్తిని గమనించండి. ఇదే ముక్తి మార్గం. ఓ దేవా! ఉన్నమాటలు (నీకు తెలిసిన మాటలే) ఎన్ని చెప్పినా, ఇదేమాట ఇంకా ఇంకా యేమి చెప్పమన్నావు ప్రభూ! నా కర్మఫలము కొంతవుంటే, నీ రక్షణ కొంత వుంటుందా? రెండూ వేర్వేరుగా వుంటాయా? ఏమో దేవా! నాకేమి తెలుస్తుంది? నేను ఒక మఱబొమ్మలా ఆడేవాడిని మాత్రమే. నా అంతర్యామిగా నీవు లేకపోతే, ఈ బొమ్మ కదులుతుందా? అందుకనే, నీకు దాసుడనై సేవచేయుట నాపని... నా చెంతే వుండి కాపాడుట నీపని. దేవా! నన్ను అపరాధిని చేయటం యెందుకు? మళ్ళీ మెలికపెట్టి సరిద్దుకోవటం యెందుకు? ఈ రెండు 'నెపాలు' (కపట వ్యాపారములు) యెందుకయ్యా? ఒకవేళ యేమరచి నీవు రక్షించకపోతే, నీకపకీర్తి కాదా? నీ మహిమకు గుర్తు యేమివుంటుంది? ఇదే చింతతో నేను బాధపడుతున్నానంటే నన్ను నమ్ము స్వామీ! నేను అధముడనని నీవేనాడో యెఱుగుదువు. ఎంచి (ఇది తెలిసికూడా) నన్ను కాపాడటం నీ ఘనత. దేవా! ఏమో అయిందేదో అయింది. ఇదిగో నా విన్నపము వినవయ్యా! ఎదురుగానే వున్న ఓ శ్రీవేంకటేశ్వరా! అన్ని విధములా నీ దాసులకు నేను దాసుడను. నానేరాలేమో పదివేలు (లెక్కలేనన్ని) ఇంకా నా నేరాలు పట్టుకోవడం దేనికి తండ్రీ?

★ **వహించుకోనిది** – మెలికపెట్టి సరిదిద్దుట ★ **ఆని** – అణచి

సంఖ్య : 412 సంపుటము : 15 పుట: రాగం : లలిత

**19 ఎంతటివాఁడవు నిన్నునేమని నుతింతును**
**చింతలు నీ కమరకుండఁగా విచారించే నేను ॥పల్లవి॥**

**పాలసముద్రములోనఁ బవళించివుండే నీకు**
**బాలుఁడవైతేనేవెన్న బాఁతాయెనా**
**కాలమెల్లను శ్రీకాంత కౌఁగిటనుండే నీకు**
**గోలవైతే గొల్లెతలఁ గూడ వేడు కాయెనా ॥ఎంతటి॥**

**పరమపదమునందు బ్రహ్మమై వుండే నీకు**
**పెరిగి రేపల్లె వాడఁ బ్రియమాయెనా**
**సురల నెల్లాఁ గావ సులభుఁడవైన నీకు**
**గరిమెతోడఁ బసులఁ గావ వేడు కాయెనా ॥ఎంతటి॥**

**యేపొద్దు నిత్యముక్తుల నెనసివుండే నీకు**
**గోపాలులతోఁ గూడుండఁ గోరి కాయెనా**
**బాపురే యలమేల్మంగపతి శ్రీవేంకటేశ్వర**
**యేపొద్దు నిట్టి లీలలె యితవాయెనా ॥ఎంతటి॥ 412**

**భావవివరముః**

పెదతిరుమలయ్య స్వామిని అర్థిస్తూ నచ్చజెప్పుతున్నారు, వినండి. స్వామీ! నీవెంతటి గొప్పవాడవు!! నేను నిన్ను ప్రార్థించి చెబుతున్నాను. నామాట విను. నేనేమో నీకు యేచింతలూ రాకూడదని ఆలోచిస్తుంటాను. కానీ నీవేంచేస్తున్నావో, చూడు ప్రభూ! ఒక్కసారి ఆలోచించు. క్షీరసాగరంపై పవ్వళించే నీకు, బాలకృష్ణుడైనంతనే వెన్నమీద బాఁతి అయ్యేనా (భ్రాంతి కలిగిందా!!!) సదా శ్రీదేవి కౌగిట పరవశించే నీకు, రేపల్లె గొల్లపడుచుల "గొల్లకంపు" కూటమి రుచించిందా!!! ఏమి వింత స్వామీ!! నీవెవరవు? పరమపదము (మోక్షస్థానమైన) ముక్తినొసగె "పరబ్రహ్మవు" కాని రేపల్లెలో పెరిగినంతమాత్రాన నీకు ఆ గొల్ల"వాడ" అంతప్రియమై పోయిందా!!! స్వామీ! నీవు సురరక్షకుడవు, సులభుడవు (సులభంగా అనుగ్రహించేవాడవు) మరి, నీకు పశువుల్ని కాయటం అంటే వేడుక యెందుకు కలిగిందయ్యా? ఓ దేవదేవా! యే పొద్దూ (యెల్లవేళలా) నిత్యులూ, ముక్తులూ అయిన నిత్యముక్తులతో వుండే నీకు ఈనాడు రేపల్లెలో నీతోటివారెవరు? గోపాలురతో ఆటలు చద్దన్నం యెంగిలి ముద్దలపై కోరిక పుట్టిందా!!! బాపురే! ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు అలమేల్మంగమ్మ పతివయ్యా! ఈ కలియుగంలో కూడ నీకు యెప్పుడు ఇలాంటి లీలలే ఇష్టమా తండ్రీ?

★ **గరిమెతో** – లీలతో ★ **గోలవైతే** – అమాయకపుగొల్ల అయితే

సంఖ్య : 204 సంపుటము : I   పుట: 136   రాగం : ముఖారి

**20** ఎంత మానుమన్నఁ జింతలేల మానునే
పంతపుమనసు హరిపై నుంటేఁగాక ॥పల్లవి॥

తీరనిబంధాలు నేఁడే తెగుమంటే నేల తెగు
భారపుమమతఁ బెడఁబాసినఁగాక
వూరటగా మమత నేనొల్లనంటే నేల మాను
వోరుపుతో లంపటము లొల్లకుంటేఁగాక ॥ఎంత॥

వేఁకపుఁగోపము నేఁడే విడుమంటే నేల విడు
తోఁకచిచ్చుయినయాసఁ దుంచినఁగాక
ఆఁకట నాసేల మాను అన్నిటాను యిందరికి
మూఁకుపడి తత్తరము మఱచుంటేఁగాక ॥ఎంత॥

పెట్టనిది దైవ మిట్టే పెట్టుమంటే నేల పెట్టు
యిట్టే వేంకటపతి యిచ్చినఁగాక
యిట్టునట్టు నీతఁడు దా నిందరికి నేల యిచ్చు
వొట్టినవిరక్తి నేమీ నొల్లకుంటేఁగాక ॥ఎంత॥ **204**

**భావవివరము:**

అన్నమయ్య ఈ అధ్యాత్మ కీర్తనలో యేమంటున్నారో వినండి. పంతము పట్టిన మనసు మనిషిమాట వినదు. అనవసరమైన చింత వద్దు మానవే అంటే మానుతుందా? హరిపైన లగ్నమైతే తప్ప వానికి మనశ్శాంతి వుండదు గాక! వుండదు. నేటివరకు అనేక బంధములలో తగులుకొని, నేడువద్దు పొమ్మంటే పోతాయా? బరువైన మమతలను పోనాడితే గాని బంధాలు యెలా వదులుతాయి? నాకు వూరట కావాలి, మమతలు నాకు వద్దు అంటే కుదురుతుందా? ఓర్పుతో నీకు తగులుకొన్న లంపటాలను వదిలించుకొంటేగాని మమతలుపోవు. (దీనినే పీటముడి అంటారు. దాన్ని విప్పలేము). వేకపు గోపము (ఉపద్రవాన్ని తెచ్చేక్రోధము) ఇవాల్టినుంచి నాకు వద్దు అంటే అది విడిచి పెడుతుందా? తోకచిచ్చులా దహించివేసే ఆశ సమూలంగా త్రుంచివేయనిదే పోతుందా? ఆపైన ఆశమాత్రం తక్కువదా? మనిషి మాకుపడి (నిశ్చేష్టుడై) తొట్రుపడుతున్నంతవరకు ఆశ కూడా వాడిని వదలిపెట్టదు. పెట్టనిది దైవము (ఎన్నడూ వరాలనివ్వని యేదేవుడైనా) ఆపదలో వున్నాను నాకు వరములు పెట్టు అంటే యెందుకు పెడతాడు. ఈ వేంకటపతి ఆ దేవుడిని ఇయ్యమనకపోతే యేదేవుడూ అనుగ్రహించడు? ఇటూ అటూ చేసి వేంకన్న ఆమాట యెందుకు అంటాడు? గొప్ప విరక్తితో నాకు నీదయ తప్ప మరేమీ వద్దనే వాడికే ఆయన అన్నీ ఇస్తాడు.

★ **తోకచిచ్చు** – మండే పిడకల వరుస ★ **ఒట్టిన** – తాకిన

సంఖ్య : 277 సంపుటము : I పుట: 186 రాగం : సాళంగనాట

**21 ఎట్టివారికినెల్ల నిట్టికర్మములు మా-**
**యెట్టివారికి నింక నేది తోవయ్య** ||పల్లవి||

**పాముఁజంపినయట్టిపాతకమునఁ బెద్ద-**
**పాముమీఁద నీకుఁ బవళించవలసె**
**కోమలిఁజంపినకొఱఁతవల్ల నొక్క-**
**కోమలి నెదఁ బెట్టుకొని యుండవలసె** ||ఎట్టి||

**బండివిఱిచినట్టిపాతకమునఁ బెద్ద -**
**బండిబోయిఁడవై పనిసేయవలసె**
**కొండవెఱికినట్టిగుణమునఁ దిరుమల-**
**కొండమీఁద నీకుఁ గూచుండవలసె** ||ఎట్టి ||**277**

**భావవివరముః**

అన్నమాచార్యులవారు చెప్పిన ఈ కీర్తన పల్లవిని నేటి తెలుగులో చెప్పాలంటే ఇలా వుంటుంది. ఎట్టి వారికినైన కర్మఫలము అనుభవించక తప్పదని పెద్దలు, గురువులు అంటారు కదా! మరి, మావంటి వారికి ఇక దారి యేది స్వామీ! విచారించి చూస్తే నీవూ కర్మఫలం అనుభవించటానికే అవతారాలనెత్తావేమో అనిపిస్తున్నది, మాకు. (ఇది నిందాస్తుతి పరిఢవిల్లిన కీర్తన.) ఆనాడు మోహినివై నీవు అమృతం దేవతలకి పంచుతూ రాహువు కేతువులు సర్పరూపముగల రాక్షసులు దేవతలరూపంలో వస్తే, నీవు సుదర్శన చక్రంతో వారి తలలు నరికి చంపివేశావు. ఆ పాపఫలితంగా నీకు పాముమీదనే (ఆదిశేషునిపై) పవలించవలసి వచ్చింది. బాలకృష్ణునిగా పాలిద్దామని వచ్చిన ఆడదాన్ని (పూతనను) చంపినదాని ఫలితంగా సర్వకాల సర్వావస్థలలోను వొకానొక కోమలిని (అలమేల్మంగను) గుండెలపై మోయవలసి వస్తున్నది. నలుగురికి ఉపయోగపడె ఒక బండిని (శకటాసురుని) తన్ని ముక్కలుచేసినదాని ఫలితంగా బండితోలేపని (అర్జున రథసారథి) చేయవలసి వచ్చింది. బలరామునిగా కొండనెపెరికి విసిరివేయబోయావు. దాని ఫలితంగా కలియుగమంతా నాబోటివారిని రక్షించటానికి తిరుమలకొండమీద కూర్కొనవలసి వచ్చింది.

★ **బండిబోయడు** – రథసారథి ★ **కొఱత** – లోపము

సంఖ్య : 211 సంపుటము : 1 పుట: 141 రాగం : ఆహిరి

**22 ఎటువంటిరౌద్రమో యెటువంటికోపమో**
**తటతట నిరువంక దాఁటీ వీఁడే** ॥పల్లవి॥

**తోరంపుఁబెనుచేతుల మల్లచఱచి**
**దారుణలీలఁ బెదవు లవుడుకఱచి**
**కారించి చాణూరుఁ గడుభంగపఱచి**
**వీరుఁడై యెముకలు విఱచీ వీఁడే** ॥ఎటు॥

**పిడుగడచినయట్టు పెడచేత నడిచి-**
**పడనీక వురములోపలఁ జొరఁబొడిచి**
**తొడికి చాణూరు నెత్తుక దయవిడిచి**
**వడివెట్టి నెత్తురు వడిచీ వీఁడే** ॥ఎటు॥

**బుసకొట్టుచును వూరుపులఁ జెమరించి**
**మసిగాఁగ బెదపెదమల్లుల దంచీ-**
**నెసఁగి శ్రీతిరువేంకటేశుఁడై మించి**
**ముసిముసినవ్వుల ముంచీ వీఁడే** ॥ఎటు॥ 211

**భావవివరముః**

ఇటువంటి కీర్తన తక్కిన వాగ్గేయకారులకు 'ఊహ' కూడారాదు. ఇది అన్నమయ్య రచనా వైదుష్యం అని నా భావన. చాణారునిమర్దన వివరమును వినండి. ఈ కృష్ణయ్యది యెటువంటి రౌద్రము (భయానకము)!! యెటువంటి కోపము!! తటతట (గుండెలదిరేట్లు) రెండువైపులనుండి వీడేదాడి చేశాడు. తోరంపు బెనుచేతుల (బలిష్టమైన పెద్ద చేతులతో) మల్లుల వలె తొడలు చరచి, భీకరముగా పెదవులు కొఱికి కారించి (బాధించి) చాణూరుని మిక్కిలి భంగపరచినాడు. వాడి (చాణూరుని) యెముకలు విరగబొడిచి వీడే మొనగాడిననిపించుకొన్నాడు. పిడుగుమీద పడినట్లు వాడిమీదకు దుమికి, మోచేతితో మన కృష్ణయ్య వాడిని అదిమిపట్టి, పడనీయకుండా ఆపి ఎదురు రొమ్ములోపల నెత్తురు జొరజొర కారేట్లు ఆ చాణూరుని పిడిగుద్దులతో పొడిచాడు. అప్పుడు వాడిమీద ఆవంతయైనా కరుణ చూపించలేదు. వాడిని మెలిబెట్టి నెత్తురు వడబోసినాడు. ఇంత భయంకరుడు వీడేనా అనిపించాడు. అప్పుడు కృష్ణయ్య ఊరుపులు బుసకొట్టినట్లున్నాయి. చెమటలతో తడిసి ముద్దయ్యాడు. ఆ చాణూరుడి తోటి పెద్దపెద్ద మల్లులను కూడా దంచి దంచి కొట్టి అతిశయించాడు. అదంతా గుర్తుకు వచ్చిందేమో, నేడు శ్రీవేంకటేశ్వరుడై వీడే యెట్లా ముసిముసి నవ్వులు చిలికిస్తున్నాడో మీరే చూడండి.

★ **తొడికి** – ఒడిసిపట్టి ★ **వడిబెట్టి** – మెలిబెట్టి

సంఖ్య : 344 సంపుటము : I పుట: 230 రాగం : శుద్ధవసంతం

**23 ఎదుటినిధానము వెటుచూచిన నీ-**
**వదె వేంకటగిరియనంతుఁడా** ॥పల్లవి॥

**సొగసి భాద్రపదశుద్ధచతుర్దశి**
**తగువేడుక నిందరు గొలువ**
**పగటుసంపదలు బహుళ మొసఁగు నీ-**
**వగు వేంకటగిరియనంతుఁడా** ॥ఎదు॥

**తొలుత సుశీలకు దుశ్శీలవలన**
**వెలయ సంపదల విముకుఁడవై**
**వలెనని కొలిచిన వడిఁ గాచినమా -**
**యలవేంకటగిరియనంతుఁడా** ॥ఎదు॥

**కరుణఁ గాచితివి కౌండిన్యుని ముని**
**పరగినవృద్ధబ్రాహ్మఁడవై**
**దొరవులు మావులు ధ్రువముగఁ గాచిన-**
**హరి వేంకటగిరియనంతుఁడా** ॥ఎదు॥ **344**

**భావవివరముః**

అనంతపద్మనాభస్వామిపై చక్కటి కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. స్వామిని వేంకటగిరి అనంతుడా! అని సంబోధిస్తున్నారు. ఎదుటి నిధానము (యెట్టెదుట కనుపించుచున్న పెన్నిధివైన వేంకటగిరి అనంతా! మేమెటుచూచినా నీవే కనుపించుచున్నావయ్యా! ఈ వేంకటగిరిలో అనంతపద్మనాభ స్వామివైనావు. భాద్రపదశుద్ధ చతుర్దశి పర్వదినమున మిక్కిలి సంతోషముతో ఎంతో ఇష్టముతో నీవ్రతమును చేసి ప్రజలందరూ, పగటు (శోభస్కరమైన) అనేక సంపదలనొసగి నిధానమువలె కనుపించుచున్నవేంకటగిరి అనంతుడా! నీకు ఇదే నమస్కరించుచున్నాను. పూర్వం సుశీల అను నీ భక్తురాలిని మారుటితల్లి దుశ్శీల అయిన 'కర్కశ' బాధించి నిన్ను కొలువనీయనందున నీవు విముఖుడవైనావు. కాని ఆమె పట్టుదలతో నిన్ను కొలిచినందున సుశీలను శీఘ్రముగ గాచినావు. నీవు మాయల (మహిమగల) వేంకటగిరి అనంతుడవు కావున ఆమె ఇంటిని (భర్త కౌండిన్యముని ఆశ్రమాన్ని) సిరులతో నింపినావు. మొదట అహంకరించిన కౌండిన్యుని మన్నించి ఒక వృద్ధ బ్రాహ్మణునివలె దర్శనమిచ్చినావు. అంతకు ముందు అతనికి సందేహాలు కలిగించిన మామిడిచెట్టు (దాని ఫలములనెవ్వరూ తినరు) ఎవ్వరూ నీళ్ళను త్రాగని జలాశయము, పుష్కలంగా గడ్డివున్నా మేయలేని ఎద్దును గురించి వివరించి అతని చేత పదునాలుగేండ్లు ఆ వ్రతం చేయించి, ఆపైన నక్షత్రమండలంలో నిలిపినావు. నీవు శ్రీహరివైన వేంకటగిరి అనంతుడవు.

★ **సొగసి** – ఇష్టముతో ★ **దొరవులు** – జలాశయములు

సంఖ్య : 253 సంపుటము : I పుట: 169 రాగం : శంకరాభరణం

**24 ఎరుఁగుదు రిందరు నెఱిఁగీనెఱఁగరు**
**హరి దానే నిజపరమాతుమని ॥పల్లవి॥**

**నలినాసనుఁ డెఱుఁగు నారదుఁ డెఱుఁగు**
**కొలఁది శివుఁ డెఱుఁగు గుహుఁ డెఱుఁగు**
**యిలఁ గపిలుఁ డెఱుఁగు నింతా మను వెఱుఁగు**
**తలఁప విష్ణుఁడేపరతత్త్వమని ॥ఎవరు॥**

**బెరసి ప్రహ్లాదుఁడు భీష్ముఁడు జనకుఁడు**
**గురుతుగ బలియు శుకుఁడు గాలుఁడు**
**వరుస నెఱుఁగుదురు వడి రహస్యముగ**
**హరి యితఁడే పరమాత్ముఁడని ॥ఎవరు॥**

**తెలియదగినదిది తెలియరాని దిది**
**తెలిసినాను మదిఁ దెలియ దిది**
**యిల నిందరుఁ దెలిసి రిదే పరమమని**
**కలవెల్లఁ దెలిపె వేంకటరాయఁడు ॥ఎవరు॥ 253**

**భావవివరముః**

అన్నమయ్య ఈ కీర్తనలో శ్రీహరి గురించి కొందరికి చక్కగా తెలియును. కొందిరికి తెలిసీ తెలయకుండా వుంటుంది. తెలిసినా తెలియకపోయినా సత్యం మాత్రం ఇదే. నిజముగా శ్రీహరి వొక్కడే పరమాత్మ, అని అంటున్నారు. నళినాసనుడైన బ్రహ్మదేవునికీ సంగతి తెలియును. ఆతని పుత్రుడైన నారదమహర్షికి తెలియును. త్రిమూర్తులలో ఒకడైన శివుడిది యెఱుగును. గంగానదిలోపడవను నడిపే గుహుడు దీనినెఱుగును. విష్ణు అంశచే పుట్టిన కపిలమహర్షి దీనినెఱుగును. ఇదంతా మనువుకూడా యెఱుగును. తలచి చూస్తే మహానుభావులందరికీ విష్ణువే పరతత్త్వమని (పరమాత్మయని) యెఱుగుదురు. మహాభక్తులైన ప్రహ్లాదుడు మరియు భీష్ముడు దీనినెఱుగుదురు. దానవ చక్రవర్తియైన బలి దీనిని గ్రహించాడు. శుకమహర్షి, యముడు దీనినెరింగిరి. పరమరహస్యమైన సంగతి ఇదే. శ్రీహరియే పరమాత్మ. తెలుసుకోదగిన సమాచారమూ ఇదే. అజ్ఞానులకు తెలియరానిదీ ఇదే. ఎంతోమంది చెప్పగా విన్నప్పుడు తెలిసినట్లున్నా మనస్సు గ్రహించనిది కూడా ఇదే. ఇదే పరమని కూడా అందరూ గ్రహించగలిగారు. తన భక్తులకు ప్రపంచంలో కలిగినవన్నీ శ్రీవేంకటేశ్వరుడని తెలిపేవాడు పరమాత్ముడైన ఆయనే.

★ **బెరసి** – ఆశ్రయించి ★ **నళినాసనుడు** – బ్రహ్మ

సంఖ్య : 348 సంపుటము : I పుట: 233 రాగం : శ్రీరాగం

**25 ఏఁటిబ్రదుకు యేఁటిబ్రదుకు ।వొక్క-**
**మాటలోనే యటమటమైనబ్రదుకు** ॥పల్లవి॥

**సంతకూటములే చవులయినబ్రతుకు**
**దొంతిభయములతోడిబ్రదుకు**
**ముంతనీళ్ళనే మునిఁగేటిబ్రదుకు**
**వంతఁ బొరలి కడవర లేని బ్రదుకు** ॥ఏఁటి॥

**మనసుచంచలమే మనువయినబ్రదుకు**
**దినదినగండాలఁ దీరుబ్రదుకు**
**తనియ కాసలనె తగిలేటిబ్రదుకు**
**వెనకముందర చూడ వెరపయినబ్రదుకు** ॥ఏఁటి॥

**తెగి చేఁదె తీపయి తినియేటిబ్రదుకు**
**పగవారిపంచలపాలైన బ్రదుకు**
**తగువేంకటేశ్వరుఁ దలఁచనిబ్రదుకు**
**పొగకు నోపక మంటఁ బొగిలేటిబ్రదుకు** ॥ఏఁటి॥ **348**

**భావవివరముః**

బ్రతుకుమీద రోసిన అన్నమయ్య ఈ బ్రతుకు యెంత హేయమైనదో అనేక వుపమానాలతో చెబుతున్నారు. ఇది యెటువంటి బ్రతుకు? యెంత అశక్యమైన బ్రతుకు? ఒక్కమాటలో చెప్పాలంటే ఈ బ్రతుకు యెంతో అటమటమైన (బాధాకరమైన) బ్రతుకు. కావాలంటే నేను చెప్పేది విని ఆలోచించండి. సంతలో దొరికిన 'ఆప్తుల' పరిచయాలే పసందు అనుకొనే బ్రతుకు. ప్రతిదీ భయంకరమే అనిపించేబ్రతుకు. ఇది ముంతనీళ్ళలోనే మునుగుబ్రతుకు (ఇది అతిసంకుచితమైన జీవితము). ఇది అంతము కానరాని చింతలో పొర్లాడే బ్రతుకు. ఎంత జుగుప్సాకరమో చూడండి. ఈ బ్రతుకు చంచలమైన మనస్సుతో ముడిపడి వున్నది. దినదిన గండం గడిస్తేనే నూరేళ్ళ ఆయువు అని తెలియదగినదీ బ్రతుకు. ఎన్నటికీ సంతృప్తిపడని ఆశలతో సతమతమయ్యేదే మనిషి బ్రతుకు. ఈ బ్రతుకులో గతము తలచుకోవాలన్నా భయమే. భవిష్యత్తు గురించి ఆలోచించాలన్నా భయమే. ఈ బ్రతుకు, మనిషికి తెగి (ఖచితమైన) చేదే తీపియని భ్రమింపజేస్తుంది. ఈ బ్రతుకున శత్రువునుకూడా ఆశ్రయించి నిస్సిగ్గుగా జీవించవలసి వస్తుంది. దౌర్భాగ్యంతోడుగా వున్నవాణ్ణి ఈ బ్రతుకు శ్రీ వేంకటేశ్వరుని క్షణం కూడా తలచనీయదు. పొగకూడా రాని మంటవంటిదీ బ్రతుకు. అంటే అపాయం అనికూడా తెలియని ముప్పువంటిదీ బ్రతుకు.

★ **దొంతి భయములు** – పేర్చిన భయాలు ★ **వంత** – దుఃఖము

సంఖ్య : 103 సంపుటము : 15 పుట: 70 రాగం : శంకరాభరణం

**26 ఏఁటి వివేకము యెరవుల చిత్త మిదె**
**తాఁటలు దూఁటలలోనె తగిలి యుండుఁ గాకా ॥పల్లవి॥**

**తను నెతిఁగి రక్షింప దైవమే నేరుచుఁ గాక**
**మనుజుఁ డే మెఱుఁగు వున్మత్తుఁడే**
**పెనఁగి పంచేంద్రియపు పెంపుడుఁ గుబ్జ దాను**
**పొనుగ కందులోననే పొరలాడుఁ గాకా ॥ఏఁటి॥**

**కాల మెతిఁగి పోఁ పొందను కర్మమె నేరుచుఁ గాక**
**కూళజీవుఁ డేమెఱుఁగు గుణబద్ధుఁడు**
**అలరి కామాదులకు నరిఁగాపై వుండుఁ దాను**
**పాలుమాలి వానికి పనిసేయఁ గాకా ॥ఏఁటి॥**

**కొలఁ దెతిఁగి బోధించ గురుఁడే యెఱుఁగుఁ గాక**
**యిల దేహి యేమెఱుఁగు హీనశక్తుఁడు**
**బలిమి శ్రీ వేంకటేశు పరతంత్రుఁడు దాను**
**చలపట్టి యాతనికి శరణనుఁ గాకా ॥ఏఁటి॥ 105**

**భావవివరముః**

పెదతిరుమలయ్య చెప్పిన ఈ కీర్తనను నిఘంటువు అర్థాలతో వివరించలేము. పల్లవి భావాన్ని ఇలా చెప్పుకోవచ్చును. మానవుడి చిత్తము స్వతంత్ర్యము లేనిది. ఇక దీనికి వివేకమెట్లా వస్తుంది? ఎన్నాళ్ళైనా ఇది చిన్న చిన్న విషయాలలోనే తగులుకొని వుంటుంది. దీనికి (చిత్తానికి) విశాల దృక్పథం వుండనే వుండదు. ఈ మానవుడు ఉన్మత్తుడు (పిచ్చివాడు). వీడిని రక్షించగలిగినవాడు దైవమే. వీడికేమి తెలుసు? పైగా, ఈ కుబ్జ కుంకను పంచేంద్రియాలు ప్రేమగా పెంచి పోషిస్తున్నాయి. ఈ పిచ్చివాడు యేమాత్రం కాదనక అందులోనే పడిపొర్లాడుతున్నాడు. ఈ జీవుడు చేసిన సత్కర్మ (పుణ్యం) మాత్రమే, కాలము తేబోయే విపత్తు నెతిగి పోపోండి అని వెళ్ళకొట్టగలదు. కూళుడు (దుర్మార్గుడైన) జీవుడు త్రిగుణములకు బద్ధుడు. వీడికేమి తెలుసు? పైగా, కామక్రోధాలవంటి ఆరుగురు శత్రువులు, గట్టికాపలాదారులై వుంటాయి. విచిత్రమేమంటే ఈ జీవుడువాటి సుఖానికి కక్కుర్తిపడి వాటికోసమే పనిచేస్తుంటాడు. తన శిష్యుడి పరిమితినెరిగి గురువుయెంత బోధించాలో తెలిసి బోధిస్తాడు. హీనమైన శక్తిగల దేహికి (జీవునికి) యేమి తెలియును? వీడు (జీవుడు) బలోపేతుడైన శ్రీవేంకటేశ్వరునికి పరతంత్రుడు (అధీనుడు). తెగువతో ఆ స్వామికి "శరణు"అనటం తప్పించి వీడేమి చేయగలడు?

★ **పాలుమాలై** – కక్కుర్తిపడి ★ **కొలది** – న్యూనత

సంఖ్య : 328 సంపుటము : I పుట: 219 రాగం : వరాళి

**27 ఏమిగల దిందు నెంతపెనగినఁ వృథా**
**కాముకపుమనసునకు కడ మొదలు లేదు** ॥పల్లవి॥

**వత్తిలోపలినూనెవంటిది జీవనము**
**విత్తుమీదటిపొల్లువిధము దేహంబు**
**బత్తిసేయుట యేమి పాసిపోవుట యేమి**
**పొత్తులసుఖంబులకు పొరలుటలుగాక** ॥ఏమి॥

**ఆకాశపాకాశ మరుదైనకూటంబు**
**లోకరంజకము తమలోనిసమ్మతము**
**చాకిమణుఁగులజాడ చంచలపుసంపదలు**
**చేకొనిననేమి యివి చెదరినను నేమి** ॥ఏమి॥

**గాదెఁబోసినకొలుచు కర్మిసంసారంబు**
**వేదువిడువనికూడు వెడమాయబదుకు**
**వేదనల నెడతెగుట వేంకటేశ్వరుకృపా-**
**మోదంబు వడసినను మోక్షంబు గనుట** ॥ఏమి॥ **328**

**భావవివరముః**

వైరాగ్యభరితమైన ఈ కీర్తనలో అన్నమయ్య మానవుని బ్రతుకులో యేమున్నది? ఎంత పెనగినా (పెనగులాడినా) అంతా వృథా. కాముకపు మనసునకు (కోరికలతో రగిలిపోయే చిత్త ప్రవృత్తికి) ఆరంభములేదు అంతమూ లేదు. ఎన్ని జన్మలైనా,దాని గతి అంతే, మానవునిలో అంతర్లీనంగా వున్న ప్రాణమే జీవనము నిలుపుచున్నది. దీపంలోని వత్తి యెంతసేపు వెలుగుతుంది, నూనె వున్నంత వరకే కదా! జీవనము కూడా ప్రాణాలున్నంతవరకే. మానవుడి దేహము విత్తనంమీద పొల్లు (పొట్టు) వంటిది. విత్తనం కుళ్ళిపోతే పొట్టు వూడిపోయినట్లు జీవంపోగానే దేహం నిరుపయోగం. దీనిని యెంత బత్తిసేసినా (శ్రద్ధగా పెంచినా) పాసిపోక తప్పదు. ఈ దేహం సుఖాపేక్షతో పెంచితే పొరలుతుంది కాని చివరికంతా వృథావృథా. 'ఆకాశం గగనం శూన్యం' అన్నారు పెద్దలు. ఆకాశం, ఇంకొక ఆకాశంతో కలుస్తుందా? తనకు యేదైతే అంగీకారమో, లోకంలో అందరికీ అదే అంగీకారం అంటారు మనుష్యులు. చాకలి చలువ చేసి తెచ్చిన బట్ట యెంతసేపు మడత నలుగకుండా తాజాగా వుంటుంది? అట్లాగే చంచల స్వభావము కల సంపదలు యెంతో కాలము మనతోడు వుండవు. ఓ మానవులారా! కర్మిష్టియైనవాని సంసారం, కొలిచి గాదెలు బోసిన ధాన్యం వంటిది ఏదో ఒక నాటికి అది పూర్తిగా తరిగిపోక తప్పదు. వెడమాయబతుకు (తుచ్ఛమైన బ్రతుకు) పాసిపోయిన అన్నంలాంటిది. అది పనికిరానిదని తెలిసినా తినక తప్పదు. శ్రీవేంకటేశ్వరుని కృప వుంటేగాని యెడతెగని (అంతులేని) వేదన తీరదు. మోదంబు (ఆత్మానందం) పొందితేనే కదా! మోక్షం లభించేది.

★ **చాకిమణుగులు**–చాకలి చలువచేసినబట్టలు ★ **వేదువిడువనికూడు**–పాసిపోయిన అన్నం

సంఖ్య : 70 సంపుటము : 15 పుట: 47 రాగం : శుద్ధవసంతం

**28 ఏమిటఁ గడమ యిఁక హరిదాసులకు**
**కామధేనువువంటి ఘనముక్తి గలిగె** ॥పల్లవి॥

**భగవన్నామ నిజపారిజాతము గలుగ**
**గగనఁపు మా కోరికలు ఫలించె**
**జగదేక పతిరూప చంద్రిచంద్రికలు గలుగ**
**మొగిఁ జకోరపునేత్రములు తనవిఁబొందె** ॥ఏమిట॥

**పరమాత్మచింతనపు భానుఁ డుదయించఁగా**
**సరుస మా చిత్తజలజంబు లలరే**
**హరికథాశ్రుతి వసంతాగమము చెలఁగఁగా**
**వరుసతో విజ్ఞాన వనమెల్ల ననిచె** ॥ఏమిట॥

**చాల శ్రీ వేంకటేశ స్పరుశవేధిచే**
**కాలజన్మపు టినుము కనక మాయ**
**వల నా తని కృపాజాలజలనిధి చేత**
**ఆలోల భక్తియును నమృతంబు వొడమె** ॥ఏమిట॥ **70**

**భావవివరముః**

జనబాహుళ్యం 'హరిదాసు'లంటే ధనసంపాదన చేతకాని సన్యాసులనుకొంటారు. కాని వారికి 'కడమ' (కొఱత) యేమిటి అని ప్రశ్నిస్తున్నారు పెదతిరుమలయ్య. వాళ్ళకి కామధేనువువంటి ముక్తిమార్గమే లభించినప్పుడు, తక్కినవి అత్యల్పమైనవే కదా? మాకు హరినామమనే అచ్చమైన పారిజాత వృక్షమే దొరికి కైవశమైనది. ఆకాశాన్నంటిన మా కోరికలన్నీ ఫలించినవి. జగదేక పతియైన ఆయన రూపం చంద్రుని వెన్నెల వలె ఆహ్లాదకరమైనది. అందువల్ల చకోరములవలె మా నేత్రము "తనఁవిబొందె" (తృప్తిజెందినవి). మా హృదయంలో పరమాత్మ చింతన అనే సూర్యుడు వుదయించాడు. అందుచేత మా మనస్సు అనే పద్మము వికసించినది. హరికథా శ్రవణమను వసంత ఋతువు రాగానే "పరమాత్మజ్ఞాన" మనునట్టి వనమంతా చిగురించింది. శ్రీవేంకటేశ్వరుడనే 'స్పరుశవేధి' (పరుసవేది – యేలోహాన్నైనా బంగారము చేయగల విద్య) వలన జన్మతః నల్లటి ఇనుము వంటి మేము మేలిమి బంగారం అయ్యాము. ఆస్వామి కరుణయను సంద్రమును, బాగుగా మథించగా పరమ ప్రీతిపాత్రమైన "భక్తి"యను అమృతము పుట్టినది.

★ **ఆలోల** – పరమ ప్రీతిపాత్రమైన ★ **మొగి** – పూని

సంఖ్య : 236 సంపుటము : I పుట: 158 రాగం : దేవగాంధారి

**29 ఏమిఫలము దా నిన్నియునుఁ దెలిసినను**
**సాముసేసినఫలము జయశీలుఁ డౌటగాక** ॥పల్లవి॥

**తానుగలిగిన ఫలము దయ సేయఁగలుగుట**
**మేనుగలిగినఫలముమేలెల్ల గనుట**
**మానుషముగలఫలము మంచివాఁడౌట తనుఁ-**
**దానె తెలిసినఫలము తత్వపరుఁడౌటగాక** ॥ఏమి॥

**పదిలమగుకులముగలఫలము తాఁ జదువుట**
**చదివినఫలం బర్థసారంబు గనుట**
**పొదలి శాస్త్రార్థంబు పొడగన్నఫలము మతి**
**దలఁకకిటు వేంకటేవుదాసుఁడౌటగాక** ॥ఏమి॥ **236**

**భావవివరముః**

గొప్ప విద్యావంతుడనిపించుకొంటే లాభమేమిటి? ఆ విద్య పదిమందికి వుపయోగపడాలి కదా! ఈ భావాన్నే అన్నమయ్య ఈ కీర్తనలో ఇంకొక విధంగా విశదీకరిస్తున్నారు. తాను (మానవుడు) ఇన్నియును (అన్నివిద్యలు) తెలిసినను యేమి ఫలము (లాభము)? ఎవడైన వీరుడు కష్టపడి, సాము (ఖడ్గముతో యుద్ధం చేయుట) యెంత బాగా చేర్చినా ఫలితమేమి. వాడు జయశీలుడై (విజయుడై) దేశానికి, రాజుకు సేవచేయకపోతే వ్యర్థుడే కదా! తనకు (మానవునికి) కలిగిన ఫలము (ధనవంతుడైతే వుపయోగం) యేమిటి? దయసేయ గలుగుట (మరొకడిపై దయచూపించి వాడి కడుపు నింపాలి). భగవంతుడు నీకు మానవ శరీరం ఇచ్చాడు దేనికి? అది పదిమందికి మేలు చేయటానికి కష్టపడే మంచివాడగుట తెలియని మానుషము (మానవత్వం) దేనికి, శుద్ధదండుగ. తన్ను దాను తెలిసికొన్నాననుకొంటే వుపయోగమేమిటి? వాడతత్త్వవేత్తయై మరికొందరిని అజ్ఞానం నుంచి విడిపించాలి. గొప్ప కులములో జన్మించానని మోరవిఱచిన లాభమేమి? వాడు మంచిగా చదువుకోవాలి. మరి మంచిగా చదువుకొని వుపయోగమేమి? మంచిచేయటానికి ధనము సంపాదించటమే. అతిశయించి ఆరుశాస్త్రాలు చదివేది శాస్త్రిగారు అనిపించుకోవటానికా? మతిదలకక (మనస్సు చలించక) శ్రీవేంకటేశ్వరుని దాసుడుగాకపోతే... వాడి బ్రతుకంతా బూడిదలో పోసినపన్నీరే.

★ **పదిలమగు** – దృఢమైన, గొప్ప ★ **పొడగను** – విశ్లేషించు

సంఖ్య : 24 సంపుటము : 15 పుట: 17 రాగం : శుద్ధవసంతం

**30 ఏమీ నడుగ నొల్ల నెచ్చుకొందు లన నొల్ల**
**కామించి నీ విచ్చితి కైవల్యపదము** ॥పల్లవి॥

**పుట్టుగులకు వెరవ భూమిలోన హరి నీకు**
**అట్టె నీ దాసుఁడ నే నైతేఁ జాలు**
**వెట్టికి నేజాతినైనా వెరవ నీనామములు**
**వొట్టి నా నాలికమీఁద నుండితేఁజాలు** ॥ఏమీ॥

**వెఱవఁ బాపములకు వేయైనా హరి నీ**
**యఱలేని కైంకర్యమిచ్చితేఁ జాలు**
**వెఱవ నింద్రియముల వెతలకు నీ వాత్మ**
**నుఱక బోధనుండవై వుండితేఁ జాలు** ॥ఏమీ॥

**ఏ లోకమైన వెరవ యెక్కు శ్రీవేంకటేశ**
**పాలించి నీకృప నాపైఁ బారితేఁ జాలు**
**కాల మెట్టైన వెరవ కర్మ మెట్టైన వెరవ**
**యేలిన నీదాసులు నన్నియ్యకొంటేఁ జాలు** ॥ఏమీ॥**24**

**ఉపోద్ఘాతముః**

ఈ కీర్తన పెదతిరుమలయ్య ఆర్తితో చెప్పినది. ఇది నాకెంత నచ్చిందంటే దీనిని నా అంతిమ కీర్తనగా నేను యెన్నుకొనటమే కాక, కీర్తన భావాన్ని ఒక సీసపద్యంలో పునరుద్ఘాటించాను. సర్వేశ్వరుడు దేన్నైనా తెలుసుకోగలడు. ప్రభూ! బిడ్డల తప్పుల్ని మన్నించే తండ్రివి, నీకు నేను చెప్పాలా? నా అజ్ఞానాన్ని క్షమించలేవా? మా అన్నమయ్య చెప్పినట్లు "ఏమీ తెలియని ప్రియభార్యను భర్త క్షమించి "దారికి" తెచ్చుకొన్నట్లు అంతా నీఇష్టం నేను కాదనను.

సీ॥ **వెఱవను జన్మకు దొటికిన నీ భక్తి**
**"వెట్టి" నైతేనేమి? పిలుతునిన్ను**
**వెఱపేమి పాపినై వెలసినా ఇలలోన**
**విష్ణుకైంకర్యంబు విడువకున్న**
**వెరవను ఇంద్రియ విషనాగులకు నేను**
**విలువైన ఆత్మలో వెలుగ శౌరి**
**వెరవనే లోకాన బిడ్డనైతేనేమి?**
**వేంకటేశుడు దయవీడకున్న**

**తే.గీ॥ వెఱవకర్మకు హరిదాసులెటిగియున్న**
**అడుగనేమియు దారిలో అడ్డులున్న**
**ఇమ్ముకైవల్యమైన నీకిచ్చువున్న**
**తిరుమలయ్యను మఱువకు దేవదేవ!**
**(అమరవాదిని మఱువకు ఆ క్షణమున)**

**భావవివరముః**

అన్నమాచార్యులవారి కొడుకు పెదతిరుమలయ్య శరణాగతితో కొండలరాయని వేడుకొంటున్నారు. ప్రభూ! నిన్నేమీ అడుగనొల్లను (ఇమ్మని కోరను). నీవేమిచ్చినా "యెచ్చుకొందులు" (ఎక్కువ, తక్కువ) అనను. అయినా నాబోటి అనామకునికి, కామించి (కావాలని) కైవల్య పదము నిచ్చితివి (ముక్తిని ప్రసాదించితివి). ఇదంతా అన్నామాచార్యులవారి కృపయే. దేవా! ఒకవేళ నీవు నాకు మరొక జన్మ తప్పదంటే... నేను యేపుట్టుకైనా వెరవను (జంకను), కాని నీదాసుడిగా పుట్టించు. చాలుచాలు నాకదే పదివేలు. నన్ను వెట్టివాడిజాతిలో వుంచినా, పట్టింపేమీ లేదు. నీ నామము నా నాలికపై యెప్పుడూ వుండాలి. చాలు చాలు నాకదే పదివేలు. శ్రీహరీ! వచ్చే జన్మలో పాపాలు చేస్తానేమో అనే భయం నాకు లేనే లేదు. అఱలెని (కొఱతలేని) నీకైంకర్యమును ప్రసాదించు స్వామీ! చాలుచాలు నాకదే పదివేలు.నా ఆత్మలో నీవు వెలుగుతుంటే చాలు ఇంద్రియాల ఒత్తిడి నన్నేమి చేస్తుంది? నాకేమి భయము? శ్రీవేంకటేశ్వరా! నీవు చతుర్దశ భువనాలలో యెందులో నన్ను పడేసినా అభ్యంతరం చెప్పను. కాని నీవే నాపాలకుడవై కొంచెము కరుణ నాపై తప్పక చూపాలి. చాలుచాలు నాకదే పదివేలు. తండ్రీ! ఆ జన్మలో కూడా మళ్ళీ నాకాలానికీ, కర్మకూ నన్నొదిలేస్తానంటావా? ముష్టివెధవకు ఇది పెట్టు అది పెట్టు అని అడిగే యోగ్యత లేకపోయినా కనీసం నీదాసులతో స్నేహం కల్పించి వారు నాకు మంచి బోధించే యేర్పాటు చేయవయ్యా! చాలుచాలు నాకదే పదివేలు.

★ **కైంకర్యము** – ఊడిగము ★ **వెట్టి** – కూలీలేకుండా చేసేపని

సంఖ్య : 89   సంపుటము : 2   పుట: 60   రాగం : ముఖారి

**31 ఏలోకమందున్నా నేమీ లేదు**
**తాలిమి నందుకుఁదగ్గదావతేకాని ॥పల్లవి॥**

**సురల కసురలకు సూదునుఁబాదునే కాని**
**పొరసి సుఖించఁగఁ బొద్దు లేదు**
**ధరలో ఋషులకును తపము సేయనేకాని**
**మరిగి భోగించఁగ మరి పొద్దులేదు ॥ఏలో॥**

**గక్కన సిద్ధులకైనా గంతయు బొంతయేకాని**
**చిక్కిపరుసము గలిగి సెలవులేదు**
**రెక్కలు గలపక్షికి రేసుతిమ్మటలేకాని**
**చక్క వైకుంఠాన కెగయ సత్తువ లేదు ॥ఏలో॥**

**సకలజంతువులకు జన్మాదులేకాని**
**అకటా నిత్యానంద మందలేదు**
**వెకలి శ్రీవేంకటేశు విష్ణుదాసులకే మంచి-**
**సుకములెల్లాఁ గలవు సుడివడలేదు ॥ఏలో॥ 89**

**భావవివరముః**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తన పల్లవినే మనము ఈనాటి తెలుగులో చెప్పుకోవాలంటే ఇలా వుంటుంది. భగవంతుడు మన కర్మఫలముగా యేలోకమొసగినా యేమీ తేడా వుండదు. ఏలోకం మనకి లభిస్తుందో అనే దావతి (ఉత్కంఠము) కలుగుట సహజమే, కాని మన కర్మననుసరించే అవీ లభిస్తాయి. ఉదాహరణకి సురులను అసురులను పరిశీలించండి. జీవితకాలమంతా "సూదును బాఁదునే" (ఈర్ష్యాద్వేషాలే) వాళ్ళకి నిదానముగా సుఖించే పొద్దులేదు (తీరికే లేదు). మన భూమిమీద ఋషులను చూడండి. తపస్సుతోనే కాలం దొర్లిపోతుంది కాని నిత్యమైన సుఖం తెలిసికొనే తీరిక వారికీ లేదు. ఒక్కసారి సిద్ధుల గురించి ఆలోచించండి. గంతకు తగ్గబొంత అని తృప్తి పడుటయేకాని ఆ సిద్ధికి కలిగిన పరుసము (ఏలోహాన్నైనా బంగారం చేసే శక్తి) లభించినా ఉపయోగమేమి? ముష్కరులు దొంగిలించటానికి. ఇంకా దానివలన యేమి సెలవు (ఉపయోగము) వుంటుంది. లక్షాధికారైన లవణమన్నమే కాని కుదువ బంగారంబు కుడవబోడు. అవునా? ఒక పక్షికి రెక్కలలో యెంతో సత్తువవున్నా ప్రయోజనమేమి? అది వైకుంఠానికైతే యెగురలేదు కదా! ఏ జంతువుగా పుట్టినా తేడా యేమివుంటుంది. నిద్రా, భయము, ఆకలి, మైధునము తప్ప అది సాధించగలిగిందేమి వుంటుంది? నిత్యానందము దానికి సాధ్యమా? ప్రకటితమైన వో శ్రీవేంకటేశ్వరా! కేవలం హరిదాసులకే మంచి సుఖములు కలుగుతాయి కాని వూరకనే సుడివడ (శ్రమపడితే) ప్రయోజనం లేదు.

★ **గంతబొంత** – గుడ్డలతో మందముగా కుట్టిన పరుపు. గంతను ఒత్తుగా ఎడ్లపై వేస్తారు, బొంతపై పడుకొంటారు.

సంఖ్య : 155 సంపుటము : 2 పుట: 104 రాగం : లలిత

**32 కటకటా కర్మమా కాలములో మర్మమా**
**మటమాయైపోతివంటా మది నమ్మివుంటిఁగా ॥పల్లవి॥**

**పాపబుద్ధి యాడనుండె పాయము రానినాఁడు**
**కోప మేడ నుండె గర్భగోళమున నున్ననాఁడు**
**దీపన మేడ నుండె దేహధారి గానినాఁడు**
**యేపున భూమిఁబుట్టితే నేడనుండి వచ్చెనో ॥కట॥**

**నగుసంసార మెందుండె నరకాననుండునాఁడు**
**తగిలి మరణదెస ధనవాంఛ లెందుండె**
**వొగి లోభ మేడ నుండె వొంటి నున్ననాఁడు**
**వెగటై నేఁడెట్టునన్నువెదకి పైకొనెనో ॥కట॥**

**బహుబంధాలేడ నుండె ప్రళయకాలమునాఁడు**
**మహిఁగోరికె లెందుండె మతి మఱచిననాఁడు**
**యిహమున శ్రీవేంకటేశు శరణంటి నేఁడు**
**విహితమై మాకు నెట్టువెఱచెనో తాము ॥కట॥ 155**

**భావవివరముః**

కర్మము, కాలము కేవలం పరమాత్మకు మాత్రమే లోబడివుంటాయి. ఆయన కూడా అవతారములను ధరించినప్పుడు వాటికి లోబడే వుంటాడు. కాని హరి శరణాగతులను మాత్రం అవేమీ చేయలేవు. అందుకే అన్నమయ్య ఈ కీర్తనలో యేమంటున్నారో వినండి. అయ్యయ్యో!! కరమా! నీవు నాకాలములో నీ ప్రతాపం చూపిస్తావు. నిజమే నీ మర్మమునెవ్వరూ తెలియలేరు. అదీ నిజమే. నీవులేనే లేవనే నమ్మకంతో ఇన్నాళ్ళూ వున్నాను కదుటే!! అయినా ఈనా ప్రశ్నలకు జవాబు చెప్పండి. నాకు యౌవనం రానినాడు పాపబుద్ధి యెక్కడున్నదే. నేనుఅమ్మ కడుపులో వున్ననాడు వోకోపమా! నువ్వెక్కడున్నావే? నేను దేహములేక ఆత్మగా తిరుగుతున్ననాడు వోదీపనమా (ఓఆకలీ!) నువ్వెక్కడున్నావే? నేను భూమిమీద పడగానే మీరంతా యెకడ నుంచి వచ్చి నన్ను తగులుకొన్నారే? నేను నరకములో మగ్గుతున్నప్పుడు ఇది వరకు నన్ను నవ్వులలో ముంచిన సంసారమా నువ్వెక్కడున్నావే? జీవితాంతము నన్ను పీడించిన ధనవాంఛ! నామరణ సమయాన నీవేమయ్యావే? నేను అందరితో వున్నప్పుడు నన్ను పీడించిన లోభమా! నేనీనాడు ఒంటరివాడిని. మరి నీ అవసరం రావటం లేదెందుకు? కాని ఈనాడు నా ఆత్మ రూపం వదలి మనిషినవంగానే మీదపడి పట్టుకొన్నాయే. అవునుగాని ప్రళయకాలంలో ఇంతమంది బంధువుల్లో ఒక్కడైనా తోడుంటాడా? నా అవసాన దశలో స్మృతి పోయినప్పుడు నా కోరికలన్నీ యేమవుతవి? అందుకే నేను ఇప్పుడే శ్రీవేంకటేశుని శరణాగతి పొందాను. చూడండి అవన్నీ యెలా పారిపోతున్నాయో!!!

★ **వెగటై** – హేయమై ★ **ఒగి** – క్రమముగా

సంఖ్య : 328 సంపుటము : XV పుట: 221 రాగం : దేసాళం

**33** కన్నవారి కెల్లా నేల కలుగు వైష్ణవము
వెన్నుని నమ్మఁగవలె వీరవైష్ణవునకు ॥పల్లవి॥

పరగఁ బాపముఁ గంటే భయము నొందఁగవలె
నరయ సంసారమందు నరుచి వుట్టఁగవలె
విరివి భోగములందు వెసటు వుట్టఁగవలె
విరతి గలుగవలె వీరవైష్ణవునకు ॥కన్న॥

తలపోసి సుజ్ఞానము ధనమని వుండవలె
పొలసి తన నేరా లెప్పుడుఁ దలఁచఁగవలె
కలకాల మాచార్యుఁడే గతి యని యుండవలె
వెలిఁ గోర కుండవలె వీరవైష్ణవునకు ॥కన్న॥

ఘనమోక్షమార్గమందు కడు రుచి గల్గవలె
పెనఁగీ భాగవతుల ప్రేమ గలుగఁగవలె
తనర శ్రీవేంకటేశుదాసుఁడై బ్రదుకవలె
వినయము గల్గవలె వీరవైష్ణవునకు ॥కన్న॥ **328**

**భావవివరముః**

వైష్ణవముయొక్క వైభవాన్ని వర్ణిస్తున్నారు పెదతిరుమలయ్య. ఆ వైష్ణవ శరణాగతి యెవ్వరికి పడితే వారికి, కనిపించిన వారందరికీ కలిగేదికాదు. వీరవైష్ణవునికి వుండే అత్యంత ఆవశ్యకము నమ్మిక. అతగాడు వెన్నుని దక్క అన్యులను ఆరాధించడు. విష్ణువే అతని సర్వస్వము. ఇక వీరవైష్ణవుని మరికొన్ని లక్షణాలను వినండి. అతనికి పాపమును చూచినంతనే భయము కలుగవలెను. సంసారమున (ప్రపంచమున) అరుచి (అయిష్టత) కలుగవలెను. భోగములందు వెసటు (అలసట) కలుగవలెను. అట్టి వీరవైష్ణవులంతా విరతి (విరక్తి)తోనే వుంటారు. సుజ్ఞానము (భగవత్ జ్ఞానము) నిజమైన ధనమని వైష్ణవుడు తలపోయుచుండవలెను. ఎప్పుడూ గతంలో తాను చేసిననేరాలను విస్మరించక పశ్చాత్తాప మనస్కుడై వుండవలెను. ఎల్లప్పుడూ తనకువుపదేశము చేసిన ఆచార్యుడే గతియను భావముతో నుండవలెను. బహిష్కరణకు లోనుగానివాడే వీరవైష్ణవుడు. గొప్పదైన మోక్షమార్గమున గొప్పఆసక్తి కలిగి వుండవలెను. గొప్ప ప్రయత్నముతో భాగవతులందరి ప్రేమ పొందవలెను. తృప్తితో శ్రీవేంకటేశ్వరుని దాసునిగా బ్రతుకవలెను. వీరవైష్ణవునకు వినయమే భూషణము.

★ **రుచి** – ఆసక్తి ★ **పొలసి** – వివేకించి

సంఖ్య : 165 సంపుటము : XV పుట: 110 రాగం : గుజ్జరి

**34 కరుణానిధివిగాఁగ కాచేవు గాక**
**యిరవై నావంటివాని కిది యసంగతము ॥పల్లవి॥**

**నేర నే పుణ్యము సేయ నిత్యానిత్య మెఱిఁగి**
**నేరుతు రిత్తచేతుల నీకు మొక్కేది**
**యేరీతిఁ బరమిచ్చేవో యేమి గలదు నాయందు**
**కారణములేని యీవి కడు నసంగతము ॥కరుణా॥**

**లేదు విజ్ఞానము గొంత లేశమైన నాయందు**
**సాదించఁ గద్దొకటి మీ శరణనేది**
**ఆదిగొని నన్నుఁ బాయ వంతరాత్మవై నీవు**
**వీదరవెల్లి (?) పొందులు విన నసంగతము ॥కరుణా॥**

**కాను నే నరుహుఁడను కదిసి పనులకు**
**నే నవుదు నొకటికి నిన్నుఁ బాడను**
**యీ నెపాన శ్రీ వేంకటేశ నన్ను నేలితివి**
**దానికిఁ దగ్గంతె కాక దాఁట నసంగతము ॥కరుణా॥ 165**

**భావవివరము:**

ఇది పెదతిరుమలయ్య చెప్పిన అద్భుతమైన కీర్తన. "అసంగతము" అంటే పొసగనిది అని అర్థం. నేను అమరవాది వారి వంశంలో పుట్టిన సుకృతంవలన పేరులో దీక్షితులు అయ్యాను, కాని మరింకే అర్హతా లేదు. ఈ కీర్తన తన గురించి కవి చెప్పినా, సరిగ్గా నాకూ అతుకుతుంది. మా గోడును వినండి. ఓ దేవదేవా! నీవు కరుణానిధివి కావున నన్ను రక్షించెదవు గాక! లేకపోతే నావంటివానికి ఇది (నీ కరుణ) అసంగతము (పొసగని అదృష్టము). ఎందుకంటే... నేను ఏ పుణ్యమూ చేసి యెరుగను. నేను చేసిన మంచి పని వొక్కటే. రిక్తహస్తాలతో నిత్యమూ నీకు మొక్కుతున్నాను. నాయందు యేమి వున్నదని నాకు మోక్షం ఇస్తావు. పోనీ ఈవి (దాతృత్వం) వున్నదా అంటే అదీ అసంగతమే. సరే, వేదము చదివాడులే అనుకోవటానికి అదీ లేదు. నాయందు లేశమంతైనా (కొంచెమైనా) విజ్ఞానము (వేదజ్ఞానము) లేదు. నేను సాధించిందేమన్నా వున్నదంటే అది మీ శరణాగతి వొకటే. అందుకనే మొదటి నుంచి నా అంతరాత్మగా వున్న నీతో నాకు పొందు పరంపరగా వస్తోంది అని నేను చెప్పుకొంటే అంతకన్నా పొసగని మాట వుంటుందా తండ్రీ! నీదగ్గరచేరి యేపని చేయడానికైనా, నావంటివాడు (రోగిష్టివాడు) అనర్హుడే. కాని నీమీద కీర్తనలను పాడగలను. ఈ నెపముతో వో శ్రీవేంకటేశ్వరా! నన్నేలితివి. దానికి తగినదే ఇయ్యవయ్యా! తక్కినవి నాకు పొసగవు.

★ **వీదరవెల్లి** – లేశమంతైనా ★ **నెపాన** – కారణమున

సంఖ్య : 488 సంపుటము : 1 పుట: 327 రాగం : బౌళి

**35 కాయమనేవూరికిఁ గంతలు తొమ్మిదియాయ**
**పాయక తిరిగాడేరు పాపపుతలారులు ॥పల్లవి॥**

**కాముఁడనియెడిరాజు గద్దెమీఁద నుండఁగాను**
**దీము గోపపుప్రధాని దిక్కులేలీని**
**కోమలపుజ్ఞానమెల్లాఁ గొల్లఁబోయ నాడనాడ**
**గామిడులై రింద్రియపుఁగాఁపులెల్లా నిదివో ॥కాయ॥**

**చిత్తమనేదళవాయి చింతలనేపౌఁజు వెట్టి**
**యిత్తలవిషయములు యెన్నికిచ్చిరి**
**తుత్తుమురై కోరికెల దొంఁడెము రేఁగఁగఁజొచ్చె**
**జొత్తుల వెరగుపడిచూచీఁ బుట్టుగులు ॥కాయ॥**

**బలుసంసారమనేటిభండారము ఘనమాయ**
**కలదీగి జవ్వనపుకై జీతము**
**యిలలో శ్రీవేంకటేశుఁడింతలో జీవుఁడనేటి-**
**బలువుని రాజుఁజేసి పాలించె నన్నును ॥కాయ॥ 488**

**భావవివరముః**

అన్నమయ్య ఈ అద్భుతమైన కీర్తనలో మానవశరీరాన్ని, తొమ్మిది రంధ్రాలగుండా దారులు వున్న ఊరుతో పోలుస్తున్నారు. ఈ రంధ్రాల ద్వారా పాపములు అనే తలారులు (తలనరికివేసే అధికారులు) తిరుగాడుతుంటారు. వాళ్ళు కాచుకొనివుంటారు. కాని వదిలిపెట్టరు. యౌవన ప్రాబల్యంలో ఈ కాయమనే గద్దె మీద కాముడు (మన్మథుడు) అనేవాడిని రాజుని చేశారు. అంతులేని కోపము అనే మరొక తుంటరి ఈ కాముడికి ప్రధానమంత్రి. వీళ్ళిద్దరూ కోశాగారంలోవున్న "జ్ఞానము" అనే ధనాన్ని కొల్లగొట్టటం మొదలుపెట్టిన "ఇంటిదొంగలు". అక్కడక్కడా కామిడులైన (చెడ్డవారైన) ఇంద్రియాలు అనే కాపులు పెత్తనం చేస్తుంటారు. ఇదంతా ఇట్లా నడుస్తుంటే, ఆ వూరిలోనే చిత్తము అనే సైన్యాధిపతి చింతలు (ఆలోచనలు) అనే సైన్యాన్ని సమకూర్చుకొని విషయములనే పెద్ద మనుష్యులను సలహాదారులుగా పెట్టుకొన్నాడు. వాళ్ళెంత "పెద్దమనుష్య"లంటే ముక్కలు ముక్కలు చేసే కోరికల దొంతర రేగునట్లు చేస్తారు. ఆశ్చర్యకరమైన పుట్టుకలకు (జన్మలకు) ఈ "ముఠా"నే కారణం. బలవత్తరమైన సంసారమనే "ఖజానాను" ఘనమైన మాయ చేత యౌవనమనే "దిన భత్యానికి" కుదుర్చుకొని కొల్లగొట్టిస్తున్నది. అప్పుడు అది చూడలేక దయామయుడైన శ్రీవేంకటేశ్వరుడు, జీవుడనే బలవంతుని రాజుని చేసి నన్ను పరిపాలించాడు.

★ **బలువుని** – బలవంతుని ★ **జొత్తుల** – అధికముగ

సంఖ్య : 321 సంపుటము : I పుట: 214 రాగం : భవుళి

**36 కొండ దవ్వట యెలుక గోరిపట్టుట దీన**
**బండాయ సంసారబంధము** ॥పల్లవి॥

**వెలయఁ జిత్తంబునకు వేరుపురువై బుద్ధిఁ**
**గలఁగించె మోహవికారము**
**కలకాలమునకు లింగముమీఁదియెలుకయై**
**తలకొనియె నాత్మపరితాపము** ॥కొండ॥

**అరయఁ జంచలముచే నాలజాలంబువలెఁ**
**దిరుగదొరకొనియెఁ దనదేహము**
**తిరువేంకటాచలాధిపుని మన్ననఁగాని**
**పరిపాటిఁ బడదు తనభావము** ॥కొండ॥ **321**

**భావవివరముః**

"కొండను తవ్వి యెలుకను పట్టుకోవటం" అనే సామెతను వుటంకిస్తున్నారు అన్నమయ్య. అంటే గొప్ప శ్రమపడి అల్పమైన ఫలితం సాధించటం అన్నమాట. పల్లవిలో యేమంటున్నారంటే కొండను దవ్వట యెలుకను పట్టుకొనుటకు అన్నట్లు దీనివల్ల నేను పెట్టుకొన్న సంసార బంధములన్నీ బంటాయ (నవ్వులపాలైనాయి). అతిశయించిన నాచిత్తమునకు వేరు పురుగువలె నాకు పుట్టిన మోహవికారము నా బుద్ధిని కలగించె (కలతపరచినది). లింగము ఈశ్వర స్వరూపమైనా దానిమీద యెలుక యెక్కి చిందులువేసినట్లు నా ఆత్మలో పరమాత్మ అంతర్యామి అయినా పరితాపము (తీవ్రమనోవేదన) దానిని వదలుటలేదు. పరికించి చూచినచో, చంచలస్వభావముచే మనస్సు అల్లకల్లోలమైనట్లు, దేహము తిరిగి నన్నుకైవశం చేసికొనినది. శ్రీవేంకటేశ్వరుడు దీనిని ఆదరిస్తేగాని ఇది స్వాంతన జెందదు.

★ **బండాయె** – పరిహాసమయింది ★ **ఆలజాలంబు** – అల్లకల్లోలం

సంఖ్య : 230 సంపుటము : 2 పుట: 187 రాగం : సామంతం

**37 కోటిమన్మథాకార గోవింద కృష్ణ**
**పాటించి నీమహిమలే పరబ్రమ్మము** ॥పల్లవి॥

**ఆకాశమువంటిమేన నమరెమూర్తివిగాన**
**ఆకాశనదియే నీకు నభిషేకము**
**మేకొని నీవే నిండుమేఘవర్ణుఁడవుగాన**
**నీకు మేఘపుష్పాలే పన్నీరుకాపు** ॥కోటి॥

**చంద్రుఁడు నీమనసులో జనించె నటుగాన**
**చంద్రికలు కప్రకాపై సరి నిండెను**
**ఇంద్రనీలపుగనుల యిలధరుఁడవుగాన**
**తంద్రలేనియీపెచూపే తట్టుపునుఁగాయను** ॥కోటి॥

**లక్ష్మీపతివిగాన లాగుల నీవురముపై**
**లక్ష్మి యలమేలుమంగే లలి నీతాళి**
**సూక్ష్మమై శ్రీవేంకటేశ చుక్కలపొడవుగాఁగ**
**పక్ష్మనక్షత్రములే యాభరణహారములు** ॥కోటి॥ **280**

**భావవివరముః**

అన్నమాచార్యులవారు ఈ కీర్తనలో కోటి మన్మథుల సౌందర్యంతో ముద్దులొలికే గోవింద కృష్ణుని లలితంగా కీర్తిస్తున్నారు. నీవు పాటించిన (ప్రదర్శించిన) నీ మహిమలు నీవే పరబ్రహ్మ స్వరూపుడవని చెప్పకనే చెప్పుచున్నాయి. వాటి వివరము వినండి. స్వామి అభిషేకాన్ని వర్ణిస్తున్నారు. ఆనాడు నీవు త్రివిక్రముడవైనప్పుడు కిక్కిరిసి ఊర్ధ్వ లోకాలంతటా నీమేను నిండిపోయింది. ఆకాశమే శరీరం అయిన నీకు అభిషేకం ఆకాశగంగతోనే బ్రహ్మదేవుడు చేశాడు. నీలమేఘశ్యాముడవైనందున నీకు ఆ మేఘపుష్పాలే (అభిషేకపు నీళ్ళే) పన్నీటి కాపువలె భాసించినది. సూర్యతాపముతో కనలే జగతికి చంద్రుని హిమాంశువులు కావలెనని సముద్ర మథనమున చంద్రుని నీమనస్సులోనే సృజించినావు. అగుటాన (అందుచేత) తెల్లని చల్లని వెన్నెలలే నీకు కప్రపుకాపు (కర్పూరధూళిమెత్తినట్లు) తోచినది. ఇంద్రనీలమణుల గనులు సమృద్ధిగానున్న యిలధరుడవు (బూరమణుడవు) కాబట్టి రెప్పవాల్చక పరవశంగా చూచే భూదేవి చూపేనీకుతట్టుపునుగువలె భాసించింది. నీవు లక్ష్మీపతివిగాన, లాగుల (ప్రేమతో) లక్ష్మి అలమేలుమంగ నీ ఉరముపై నీకు తాళియై అలరారుచున్నది. అణురూపుడవైన శ్రీవేంకటేశ్వరా! నీవే చుక్కల పొడవుగాగ (నింగితాకునంత పొడగరివై) భాసిల్లగా, మిలమిల మెరిసే నక్షత్రములే నీ ఆభరణపు మణులై శోభిల్లినవి.

★ **తంద్రలేనిచూపు** – రెప్పవాల్చని చూపు ★ **పక్ష్మ** – మిణుకుమనెడి

సంఖ్య : 281 సంపుటము : 2 పుట: 188 రాగం : పాడి

**38 చంచలపడఁగవద్దు సారె సారెఁ గోరవద్దు**
**పొంచుకున్నదైవమే బుద్దులు నేర్పీని ॥పల్లవి॥**

**లోకరక్షకుఁడు నాలోననే వున్నాఁ డిదే**
**నాకు నభయములిచ్చి నన్నుఁ గాచును**
**శ్రీకాంతుఁ డీతఁడే నాచిత్తములో మలసీని**
**దాకొని శుభములెల్లాఁ దానే వొసఁగును ॥చంచ॥**

**పరమపురుషుఁడు నాప్రాణనాథుఁడైనాఁడు**
**పరగ నాపాలివాఁడై బ్రదికించును**
**ధరణీశుఁ డీతఁడే నాదాపుదండై కడఁగీని**
**నిరతి నేపొద్దును మన్నించును మమ్మెపుడు ॥చంచ॥**

**శ్రీవేంకటేశుఁడు నాజిహ్వఁదగిలి వున్నాఁడు**
**పావనునిఁ జేసి నాకు ఫలమిచ్చును**
**గోవిందుఁ డీస్వామి నన్నుఁగొలిపించుకొన్నవాఁడు**
**యీవలనావల నాకు నిహపరా లిచ్చును ॥చంచ॥ 281**

**భావవివరముః**

అన్నమయ్య ఈ కీర్తనలో మానవులను తమ చంచలస్వభావమును విడనాడవలసిందిగా బోధిస్తున్నారు. చీటికి మాటికి దేవుని ఇదికావాలి అదికావాలి అని కోరుట తగదు. ఆయనపై నమ్మకం వుంటే ఆయనే మనకు సద్బుద్ధిని ఇచ్చి పొంచుకొనివుండి మన బాగోగులు చూసుకొంటాడు, అంటున్నారు. ఆ లోకరక్షకుడు నాలోనే దాగివుండి నాకు అభయమిచ్చి రక్షిస్తున్నాడు. శ్రీకాంతుడైన ఆ స్వామి నా చిత్తములోనే మలసీని (వ్యాపించియున్నాడు). అట్లా దాగికొని నాకు సర్వ శుభములను వొసగుచున్నాడు. ఆ పరమపురుషుడే నా ప్రాణనాథుడై నాపాలివాడై బ్రతికించుచున్నాడు. భూవిభుడైన ఆతడే నాకుఅండదండై అతిశయించుచున్నాడు. ఏపొద్దైనా ఆయనే మమ్మల్ని మన్నిస్తుంటాడు. శ్రీవేంకటేశ్వరుడు నా నాలుకపైననే నివాసముగా వున్నాడు. ఆయనే నన్ను పున్యాత్ముని చేసి నాకు సత్ఫలితములనొసగుచున్నాడు. గోవిందుడైన ఈ స్వామి నాచేత కొలిపించుకొని నన్ను ధన్యుని చేస్తున్నాడు. ఈవల (ఈ భూమిమీదా) ఆవల (పరలోకములోనూ) నాకు ఇహపరాలనొసగుచున్నవాడెవరు? ఆ శ్రీరమణుడే.

★ **జిహ్వ** – నాలుక ★ **నిరతి** – మిక్కిలి ఆసక్తితో

సంఖ్య : 449 సంపుటము : I పుట: 301 రాగం : మాళవిగౌళ

**39** **చదువులోనే హరిని జట్టిగొనవలెఁగాక**
**మదముగప్పినమీఁద మగుడ నది గలదా** ॥**పల్లవి**॥

**జడమతికి సహజమే సంసారయాతన యిది**
**కడు నిందులోఁ బరము గడియించవలెఁగాక**
**తొడరి గాలప్పుడు తూర్పెత్తక తాను**
**విడిచి మఱచిన వెనక వెదకితేఁ గలదా** ॥**చదు**॥

**భవబంధునకు విధిపాపపుణ్యపులంకె**
**తివిరి యిందునే తెలివి తెలుసుకోవలెఁగాక**
**ఆవల వెన్నెలలోనె అల్లునేరే ళ్లింతే**
**నివిరి నిన్నటివునికి నేఁటికిఁ గలదా** ॥**చదు**॥

**దేహధారికిఁ గలదే తెగనియింద్రియబాధ**
**సాహసంబున భక్తి సాధించవలెఁగాక**
**యీహలను శ్రీవేంకటేశుదాసులవలన**
**వూహించి గతిగానక వొదిఁగితేఁ గలదా** ॥**చదు**॥ **449**

**భావవివరముః**

ఈ చక్కటి కీర్తనలో అన్నమయ్య యెంత రమ్యమైన సందేశాన్నిస్తున్నారో ఆకళింపు చేసికొనండి. "చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ!" అన్నాడు ప్రహ్లాదుడు. చదువు నేర్చుకొనుచున్నప్పుడే హరిని జట్టిగొనవలెగాక (వశపరచుకొనవలెను). ఒక్కసారి మదము ఆవహించిందంటే, మగుడ (మరల) చేసేదేమీ వుండదు. జడులైన జీవులకు సంసారయావ వుండటం సహజమే. దానిని వారు వదలి సన్యసించలేరు. కాని సంసార బాధలను అనుభవిస్తూనే ముక్తికి ప్రయత్నించేవారు ధన్యులు. బాగా గాలి వీస్తున్నప్పుడు "తూర్పారబట్టాలి" కాని గాలిలేనప్పుడు వెదకితే ప్రయోజనమేమిటి? భవబంధములలో సతమతమయ్యేవాడికే విధి, పాపము, పుణ్యము అనే వాటితో లంకె వుంటుంది. అల్లునేరేళ్ళ ఆట ఆడపిల్లలాడాలంటే వెన్నెల వుండాలి కదా! వెన్నెలపోయాక నిన్నటి వునికి నేడువుంటుందా? దేహమున్నన్నాళ్ళూ ఇంద్రియాల బాధ తప్పదు. దానికి తరుణోపాయం యేమంటే భక్తితో పరమాత్మను సాధించుటయే. దీనికి ఆవశ్యకతయేమిటంటే శ్రీవేంకటేశ్వరుని దాసులై వొదిగి (వినమ్రతతో) ఆయనే గతిగా భావిస్తూ జీవించుటయే.

★ **సాహసంతో** – గుండె నిబ్బరంతో ★ **జడమతి** – మందమతి

సంఖ్య : 337 సంపుటము : 2 పుట: 226 రాగం : పాడి

**40 చిత్తానఁ బెట్టుముమీమాఁట శ్రీరమణ మరవకు**
**హత్తి నిన్నే మెరుఁగుదు నజ్ఞాని నేను** ॥పల్లవి॥

**నెలకొని నాలోన నీ వున్నాఁడవుగనక**
**తలఁచకున్నా నిన్నుఁ దలఁచినవాఁడనే**
**యెలమి నందరి నీవే యేలినవాఁడవుగనక**
**కొలువకున్నా నిన్నుఁ గొలిచినవాఁడనే** ॥చిత్తా॥

**నెక్కొని ఆకసమెల్లా నీపాదమేకనక**
**మొక్కకున్నా నేను మీకు మొక్కినవాఁడనే**
**నిక్కి నానాక్షరములు నీపేరులేకనక**
**పెక్కులుగాఁ బిలువకున్నాఁ బిలిచినవాఁడనే** ॥చిత్తా॥

**వోజ నారుగమలాల నున్నాఁడవుగనక**
**పూజించకున్నా నిన్నుఁ బూజించినవాఁడనే**
**తేజపుశ్రీవేంకటేశ దేవ నీవే గతిగాన**
**సాజాన నే మఱచినా శరణన్నవాఁడనే.** ॥చిత్తా॥ **337**

**భావవివరముః**

కవి చాతుర్యం అతని వాదనా పటిమలో వుంటుంది. అన్నమయ్య సమయస్ఫూర్తిని చిత్తగించండి. ఓ శ్రీరమణా! మఱువకుండా ఈ నామాటను నీ మనస్సులో పెట్టుకోవయ్యా నేను అజ్ఞానినని నీకూ తెలుసు. నిన్ను నేను యెట్లెరుగుదునయ్యా? అయినా, నామాట కూడా కొంచెము వినవయ్యా! నాలోనే అంతర్యామివై నీవే వున్నావు కదా! నిన్ను తలచకపోయినా నేను నిన్ను తలచినట్లే అందరినీ పరిపాలించేవాడివి నీవే కదా! నిన్ను సేవించకపోయినా సేవించినట్లే. ఆనాడు త్రివిక్రముడవై ఆకాశాన్నంతా నీపాదంతో కప్పివేశావు కదా! నేను నీకు మొక్కకపోయినా ఆకాశంకేసి చూస్తే చాలు నీకు మొక్కినట్లే. అతిశయించిన అక్షరములన్నీ నీ నామములే కదా! ప్రత్యేకించి నీనామములను నేను పలుకకున్నా నేనే అక్షరాన్ని ఉచ్చరించినా నీనామమును పలికినట్లే. ఓజతో (నేర్పుతో) యోగపురుషుడవై షట్కమలములలోనున్నవాడవు నీవే కదా! అవి మాలోనే వున్నవి. కావున నిన్ను ప్రత్యేకించి పూజించకున్నా పూజించినవాడనే అగుచున్నాను. తేజముగల దేవుడవైన శ్రీవేంకటేశ్వరా! నీవే గతియని నమ్మితిని కదా! నా సహజమైన మతిమఱపుతో నిన్ను మఱచినా నేను నీ శరణాగతుడనే.

★ **హత్తి** – పొంది ★ **సాజాన** – సహజముగా

సంఖ్య : 141 సంపుటము : 2 పుట: 95 రాగం : పాడి

**41 చూచేచూపొకటి సూటిగుఱి యొకటి**
**తాచి రెండు నొకటైతే దైవమే సుండీ** ॥పల్లవి॥

**యేనుగఁ దలఁచితే యేనుగై పొడచూపు**
**మాను దలఁచిన నట్టే మానై పొడచూపు**
**పూని పెద్దకొండ దలపోయఁ గొండై పొడచూపు**
**తానే మనోగోచరుఁడు దైవమే సుండీ** ॥చూచే॥

**బట్టబయలు దలఁచ బయలై పొడచూపు**
**అట్టె యంబుధి దలఁచ నంబుధియై పొడచూపు**
**పట్టణము దలఁచిన పట్టణమై పొడచూపు**
**తట్టి మనోగోచరుఁడు దైవమే సుండీ** ॥చూచే॥

**శ్రీవేంకటాద్రిమీఁది శ్రీపతిఁ దలఁచితేను**
**శ్రీవేంకటాద్రిమీఁది శ్రీపతై పొడచూపు**
**భావమే జీవాత్మ ప్రత్యక్షము పరమాత్మ**
**తావు మనోగోచరుఁడు దైవమే సుండీ** ॥చూచే॥ **141**

**భావవివరముః**

అన్నమయ్య చెప్పిన కీర్తన నాకిలా స్ఫురించింది. మనం సాధారణముగా చూచే చూపు ఒకదానిపై వుంటుంది. కాని తిన్ననైన లక్ష్యం మాత్రం వేఱొకదానిపై వుంటుంది. అట్లా కాకుండా ఈరెండూ ఒకటైతే దైవమే ప్రాప్తిస్తాడు సుండీ (సుమా!) ఒక ఏనుగు దేవుని ధ్యానించాలంటే అది దేవుని ఏనుగురూపంతోనే భావిస్తుంది. అడవిలో మాను (చెట్టు) దైవస్పృహ కలిగి దేవుని ధ్యానిస్తే ఆయన చెట్టులాగానే వుంటాడు. అదేవిధంగా ఒక కొండ దేవుని తలచుకొంటే కొండ లాగుననే భావిస్తుంది. "యద్భావం తద్భవతి" అన్నారు పెద్దలు. అందుకే దేవుడు మనోగోచరుడు సుమా!! ఆరుబయట చదునైన నేలగా భావిస్తే ఆనేలలాగానే వుంటాడు దేవుడు. అదే మాదిరి మహాసాగరమువలె భావిస్తే సాగరమువలెనే వుంటాడు. అదే దేవుని ఒక పట్టణమువలె భావిస్తే పట్టణము వలెనే వుంటాడు. ఈ విధముగా దైవము మనోగోచరుడు సుమా! శ్రీవేంకటాద్రిపై వెలసిన శ్రీపతిని మనం దైవముగా తలపోస్తే (కళ్ళుమూసి దేవుని స్మరిస్తే) శ్రీవేంకటేశ్వరుడే మన కనుల ముందు కనబడతాడు. జీవాత్మ మనకు అగోచరుడు. కాని పరమాత్మ రూపంలో ప్రత్యక్షమవుతాడు. అందుకనే దేవుడు మనోగోచరుడు సుమా!!

★ **అంబుధి** – సాగరము ★ **బట్టబయలు** – ఆరుబయట

సంఖ్య : 163 సంపుటము : XV పుట: 108 రాగం : రామక్రియ

**42 చేతులెత్తి మొక్కరో జీవకోట్లాల యిదె**
**యీతలాతల నిండిరిదె నారదాదులు** ॥పల్లవి॥

**దిక్కులు సాధించ హరి తిరుతే రెక్కఁగాను**
**యిక్కడ రతికెక్కిరి యింద్రాదులు**
**వెక్కసపు శార్ఙ్గము వెస చేతఁ బట్టఁ గాను**
**పక్కన గుండె వట్టిరి బహ్మాదులు** ॥చేతు॥

**యెడమచేత శంఖమెత్తినప్పుడు వేదము**
**కడఁగి మొదలెత్తిరి గౌతమాదులు**
**కుడిచేతి చక్రముగక్కున మెఱిపించఁగాను**
**సుడిసియు మెఱసేరు సూర్యచంద్రాదులు** ॥చేతు॥

**లలి శ్రీ వేంకటేశుఁ డలమేలుమంగయుఁ బెండ్లి**
**నలరఁగ నమరిరి అమరాదులు**
**వెలయ నితఁ డింతట విశ్వరూపము చూపఁగ**
**సలిగఁబొడచూపిరి సనకాదులు** ॥చేతు॥ **163**

**భావవివరము:**

పెదతిరుమలయ్య వినిపిస్తున్న అధ్యాత్మ కీర్తనను ఆస్వాదించండి. తన జ్ఞాన చక్షువుకు కనిపిస్తున్న ఇంద్రాదులను, బ్రహ్మాదులను, గౌతమాది ఋషులను సూర్యచంద్రులను పేర్కొంటూ తిరుమలేశుని పెండ్లి ఊరేగింపును వర్ణిస్తున్నారు. ఓ జీవకోట్లలారా! ఇదే చేతులెత్తి మొక్కండయ్యా! యీతల ఆతల (వూరేగింపుపోయే దారికి ఇవతల అవతల) నారదాదులచే నిండిపోయింది. శ్రీహరి దిక్కులనన్నింటినీ గెలచుటకు తన పవిత్రమైన రథముపై బయలుదేరినాడు. ఇంద్రాదులు ఇది చూచుటకు ఉత్సుకించిరి. అభేద్యమైన శార్ఙ్గ మను ధనస్సును చేతబట్టితే బ్రహ్మాదులకు కూడా భయము కలిగి గుండెలు చేతితో పట్టుకొనిరి. శౌరి తన యెడమ చేతితో పాంచజన్యం అనుశంఖాన్ని పూరించగానే గౌతమాది మహాఋషులు వేదములను పఠించసాగిరి. స్వామి కుడి చేతిలో సుదర్శన చక్రము మిలమిల మెరిసింది. అది తిరుగుతున్న కాంతిరేఖలను పుట్టించగా సూర్యచంద్రులు వెలవెల బోయిరి. శ్రీవేంకటేశ్వరుడు అలమేల్మంగను పరిణయమాడబోవుచున్నాడు. వధూవరులిద్దరూ ఇట్లు అతిశయించి వుండగా అనేక దేవగణములు వారిని చుట్టుముట్టిరి. వారందరినీ తరింపజేయుటకు స్వామి తన విశ్వరూపమును ప్రదర్శించగా దానిని చూచుటకు సనకాది మహామునులు ఇచ్చట కేతెంచిరి.

★ **సుడిసియు** – సుడులు తిరుగుచు ★ **లలి** – ప్రేమతో

సంఖ్య : 222 సంపుటము : 1 పుట: 148 రాగం : వరాళి

**43 తనవారని యాసఁ దగిలిభ్రమయనేల**
**తనువుఁ బ్రాణునికంటె తగులేది** ॥పల్లవి॥

**తనువుఁ బ్రాణుఁడు రెండు తగిలి గర్భమునందు**
**వొనర నేకమై యుదయించి**
**దినములు చెల్లిన తివిరి యాప్రాణుఁడు**
**తనువువిడిచిపోయ దయలేక** ॥తన॥

**ప్రాణికై దేహము పాపపుణ్యముసేయు**
**ప్రాణి వెంటనె బొంది పాశుండదు**
**ప్రాణి యచ్చుటనైన బాధలఁ బడకుండ**
**ప్రాణి రక్షించు బొందిబడి దాఁ బోయనా** ॥తన॥

**యెరవుల దేహాలివి నిజమని నమ్మి**
**యెరిఁగీనెఱుఁగలే రిది యాలా**
**అరయఁబరమునకు నాదిపురుషుఁడై**
**పరగుశ్రీ వేంకటపతి గలిగుండఁగా** ॥తన॥ **222**

**భావవివరముః**

అన్నమయ్య ఈ కీర్తనలో “జీవుడు” బదులుగా ప్రాణుడు అనే విశిష్ట పదప్రయోగం చేశారు. ప్రాణునికి తనువు కంటే అనుబంధం వుంటుందా? తనవారు అని ఆశపడి, తగిలి (మాలిమియై) భయపడుటెందులకు, చింతించుటెందులకు? ఈ ప్రాణుడు యెంత దయమాలినవాడో తెలియునా? తల్లి గర్భంలో ఈ జీవుడికి ముందు శరీరం వస్తుంది. ఆ తరువాత ప్రాణం వస్తుంది. ఈ రెండూ కలిశాకనే వాడు జన్మిస్తాడు. వాడికర్మ వాడికెన్ని దినముల ఆయువునిస్తే ఆ ప్రాణుడన్నాళ్ళువుండి కాలం తీరాక క్షణం కూడావుండక తోసి రాజంటాడు. ప్రాణినిమిత్తమాత్రుడు. వాడి శరీరమే పాపపుణ్యాలు చేస్తుంది. ప్రాణి శరీరాన్ని విడిచిన తక్షణమే శరీరం కుళ్ళిపోవటమారంభిస్తుంది. ప్రాణి యెక్కడవున్నా బాధలు లేకుండానే వుంటాడు. బొంది వున్నంతకాలము ప్రాణుడు దానిని రక్షించుకొనే ప్రయత్నం చేస్తూనే వుంటాడు. ఈ దేహాలన్నీ యెరువు తెచ్చుకొన్నవే!! ఇది శాశ్వతం కాదని తెలిసినా, శాశ్వతమనే భ్రమ కలుగుతుంటుంది? యెందుకనో మరి? పరమునిచ్చే ఆది పురుషుడు శ్రీవేంకటేశ్వరుడు అని తెలిసినా ఇదంతా యెందుకంటే, అదే వాడి మాయ.

★ **తివిరి** – ప్రయత్నించి ★ **ప్రాణి** – జీవుడు

సంఖ్య : 447 సంపుటము : 1 పుట: 300 రాగం : శ్రీరాగం

**44 తప్పుఁదోయవే దైవశిఖామణి**
**యిప్పుడు నీకృపనెనసితి నేను ॥పల్లవి॥**

**అనలముఁ బొడగని యటునిటుమిడుతలు**
**కినిసియందు మగ్గినయట్లు**
**అనువగువిజ్ఞాన మాత్మ వెలుఁగఁగ**
**మొనసి యింద్రియములు మూఁగీ నాకు ॥తప్పుఁ॥**

**అతిముతిఁ గమలము లటు వికసించిన**
**మెఱసి తుమ్మిదలు మించుగతి**
**తతి నాహృదయము తగవికసించిన**
**తఱమీ నజ్ఞానతమ మది నాకు ॥తప్పుఁ॥**

**యీరీతి శ్రీవేంకటేశ్వర యిన్నియు**
**నూరకే యుండఁగా నొదిఁగియుండె**
**నేరిచినీభక్తి నిలుపఁగ మదిలో**
**చేర గతిలేక చిమిడీనదివో ॥తప్పుఁ॥ 447**

**భావవివరముః**

అన్నమయ్య తిరుమలేశునితో యేమంటున్నారో వినండి. నేను ఇప్పుడు నీకృపను పొందాను. నీ శరణాగతుడనైనాను. ఇక నాతప్పుదోవే (నేను చేసిన తప్పులను తోసిరాజు అనరాదా? నీవు దైవశిఖామణివి, నిన్నెవరు కాదనగలరు? మిడుతలవంటి కీటకములు నిప్పును జూచి కినిసి (భ్రమించి) దానిలో పడి మగ్గి మరణించినట్లు, ఆత్మలో విజ్ఞానజ్యోతి ప్రకాశించే ఘనునికి ఇంద్రియ చాంచల్యములు ఆ జ్యోతిలో పడి నశిస్తాయి. నాకు కూడా ఇంద్రియాలదాడితప్పుట లేదు. ప్రభూ! నీవే కరుణించాలి. కమలములు వికసించిన వెంటనే తుమ్మెదలు ఆనందించి చెలరేగి వానిపై గుమిగూడుతాయి. అదే విధముగా నా హృదయకమలము వికసించిన వెంటనే అజ్ఞానపు చీకట్లు గుమిగూడి నా హృదయాన్ని అంధకారబంధురము చేస్తున్నవి. నీ కృపలేక నేనీ చీకట్లను దాటలేను. ఓ శ్రీవేంకటేశ్వరా! యీ ఇంద్రియాల ఉద్ధతి, మదిలో గూడుకట్టుకొన్న అజ్ఞానము వూరకుండక నాలోనే వొదిగివుండిపోయాయి. అయినా నీ కరుణనాపై కలిగినందువలన, నేను నీ భక్తిని మదిలో నిలుపుట నేర్చినాను. ఇక నా ఇంద్రియాలకు, అజ్ఞానానికి మరొక దారి లేక అదిగో చూస్తుండగానే కాలిపోయాయి తండ్రీ!

★ **అతిముతి** – శీఘ్రముగ ★ **చిమిడీ** – కాలిపోయాయి

సంఖ్య : 190 సంపుటము : 15 పుట: 127 రాగం : దేవగాంధారి

**45 తప్పుఁ జదువులవార తర్క వాదములవార**
**యెప్పుడు నింతట దైవ మింకఁ దెచ్చేరా** ॥పల్లవి॥

**కోరి సప్తఋషులును కొలిచేదైవ మితఁడు**
**చేరి మహాశేషుఁడు మోచినదైవము**
**గారవపుటాదిలక్ష్మి కైకొన్నదైవ మితఁడు**
**మేరతో నింతదైవము మీరు దెచ్చేరా** ॥తప్పు॥

**అల బ్రహ్మకునుఁ దండ్రియైన దైవ మితఁడె**
**తలప రుద్రునికిని తాత యితఁడె**
**వెలయ వేదములెల్ల వెదకే దైవ మితఁడు**
**యిల నింతటిదైవ మింకఁ దెచ్చేరా** ॥తప్పు॥

**నారదశుకాదులెల్ల నమ్మినదైవ మితఁడు**
**కూరిమి భూకాంతకు కులదైవము**
**ఆరీతి శ్రీ వేంకటాద్రిమీఁది దైవము**
**నేరితి యింతదైవము నెమకి తెచ్చేరా** ॥తప్పు॥ **190**

**భావవివరముః**

కొంతమంది వేదము అంగీకరించని తప్పుల చదువులు చదువుకొంటారు. కుతర్కముతో దైవముకంటే మానవుడే గొప్పవాడనివాదిస్తుంటారు. అట్టివారిని పెదతిరుమలయ్య ప్రశ్నిస్తున్నా. ఎప్పుడైనా ఇంతటి గొప్పదైవాన్ని తీసికొని రాగలరా? ఈ శ్రీవేంకటేశ్వరుడుయెంత గొప్ప దైవమో వినండి, అంటూ కీర్తిస్తున్నారు. ఇతడు సప్తఋషులచే కొలువబడే దైవము. మహామహుడైన ఆదిశేషునిపై పవ్వళించే దైవము. శ్రీమహాలక్ష్మి స్వయంవరంలో యెన్నుకోగా చేపట్టిన దైవము. ఇంతటి దైవాన్ని మీరుమేరతో (సరిపోల్చి) తేగలరా, చెప్పండి. ఇతర దేవతలతో పోల్చి చూస్తే, సృష్టికర్త బ్రహ్మదేవునికి స్వయంగాతండ్రిగారు ఈయనే. త్రిమూర్తులలో వొకడైన రుద్రునికి ఈయన తాతగారు. (రుద్రుడు ఈశాన్యదిక్పతి కనుక బ్రహ్మకు పుత్రుడు). సోమకాసురుడు వేదములను తస్కరిస్తే వానిని వెదకి సంహరించి తిరిగి తెచ్చిన దైవమితడే. మహామునులైన నారదుడు, శుకుడు నిరంతరం సన్నుతించే దైవముఇతడే. ప్రేమించిన భూకాంత కులదైవము (ఆవిడేకాక, ఆమెకులంలోని భూమండల జీవులంతా కొలిచే దైవము) ఈయనే. అటువంటి దైవము నేడు శ్రీవేంకటాద్రిమీద కొలువై వున్నాడు. ఇంత గొప్ప దైవాన్ని వెదకి తేగల సమర్థత మీకుందా?

★ **నేరితి** – సావర్థ్యంతో ★ **నెమకి** – వెదకి

సంఖ్య : 162 సంపుటము : 15 పుట: 108 రాగం : శంకరాభరణం

**46 తమవుద్యోగము లేల తమకము లేల**
**సముఁడై పుణ్యపాపాలు సాధించనేరఁడా** ॥పల్లవి॥

**పుట్టించ నేర్చిన హరి పూఁచి రక్షింప నేరఁడా**
**వట్టి చింతతో జీవులు వగవ నేల**
**జట్టిగొని పదునాల్గు జగము లేలెడి వాఁడు**
**గట్టిగా నందరిఁ దానె కావ నేరఁడా** ॥తమ॥

**అంతరాత్మైనవాఁడు అన్నియుఁదా నేరఁడా**
**వింతలుగా వేరె విన్నవించ నేల**
**సంతతమై గుణములు జవకట్టినట్టివాఁడు**
**కొంతనేర్పు నేరాలు కోరి తిద్ద నేరఁడా** ॥తమ॥

**యేలికై దాసులనెల్ల యేల నేర్చినవాఁడు**
**యీలీల సంపదలెల్ల యియ్య నేరఁడా**
**వాలించి శ్రీవేంకటాద్రి ప్రత్యక్షమయినవాఁడు**
**సోలిఁ దన మహిమలు చూప నేరఁడా** ॥తమ॥ **162**

**భావవివరముః**

పెదతిరుమలయ్య ఈ అధ్యాత్మ కీర్తనలో యేమంటున్నారో వినండి. మానవులకు తమ ఉద్యోగములు (ప్రయత్నములు) యేల? తమకములేల (అలుపుతో కూడిన అచేతనత్వము) యేల? పాపపుణ్యములను సమభావనతో చూచే సాధన చేయలేడా? మనని పుట్టించడం తెలిసిన శ్రీహరికి రక్షించడం రాదా? వ్యర్థమైన చింతతో జీవులు విచారించుటెందులకు. పూనికతో పదునాలుగు జగములేలే వాడు వాటిలో నివసించేవారిని రక్షించుట యెరుగడా? మనందరికీ అంతరాత్మ అయిన వాడు మన మనస్సులోనివన్నీ గ్రహించలేడా? అదేదో వింత అయినట్లు మనం వివరించాలా? మనం చచ్చేదాకా శాశ్వతంగా మనతోనే వుండే గుణాలను మనకు వడిగా అంటకట్టినవాడు కొంత నేర్పు ప్రదర్శించి కోరి మన నేరాలను సరిదిద్దలేడా? జగముల పాలకుడై అసంఖ్యాకులైన తన దాసులను పాలించుట నెరిగినవాడు వారు కోరిన సంపదలనియ్యలేడా? అనివార్యముగా శ్రీవేంకటాద్రిపై ప్రత్యక్షమైనవాడు, సోలి (వివశుడై) భక్తులకు తన మహిమలను చూపలేడా?

★ **వాలించి** – అనివార్యముగా ★ **సంతతము** – ఎల్లప్పుడూ

సంఖ్య : 234 సంపుటము : XV పుట: 156 రాగం : శంకరాభరణం

**47 తలఁచి చూడ పరతత్త్వం బితఁడు**
**వలసినవారికి వరదుఁ డితఁడు** ॥పల్లవి॥

**సిరికి మగఁ డమృతసింధువునకు నల్లుఁడు**
**సరుస పార్వతికి సయిదోడు**
**గరిమెల బ్రహ్మకుఁ గన్నతండ్రి యితఁడు**
**పరగి శివునకు బావ యితఁడు** ॥తలఁచి॥

**అల దేవేంద్రుని యనుజుఁ డితఁడు**
**మలసి చంద్రుని మఱఁ దితఁడు**
**కులమున నదితికి కొడుకూ నితఁడు**
**తలఁప సురాసురలతాతయు నితఁడు** ॥తలఁచి॥

**ప్రాణుల కెల్లా బంధుఁ డితఁడు**
**వాణికి మామగు వావి యితఁడు**
**జాణ శ్రీవేంకటాచలరమణుఁ డితఁడు**
**మాణికపు మన్మథుఁ డితఁడు** ॥తలఁచి॥ **234**

**భావవివరముః**

పరతత్త్వము అంటే తేలిక మాటలలో చెప్పవలెనంటే పరబ్రహ్మ తత్త్వము అనవచ్చును. పెద తిరుమలయ్య యేమంటున్నారంటే, బాగుగా ఆలోచించి చూస్తే ఈ శ్రీహరియే పరబ్రహ్మతత్త్వము అనీ, ఆర్తులకు వరప్రదాత ఇతడేనని అర్థమవుతున్నది. ఇతగాడే సిరికి మగడు (శ్రీపతి), అమృతసింధువునకు (క్షీరసాగరమునకు) అల్లుడు. పార్వతీదేవికి సోదరుడు, సృష్టికర్త అయిన బ్రహ్మనే కన్నతండ్రి, పరమశివుడు సదా గౌరవించి పూజించే బావగారు. ఈ శ్రీహరి సర్వసమర్థుడనటానికి ఇది చాలదా? ఇంకా చెప్పాలంటే, దేవేంద్రునికి అనుజుడు (తోబుట్టువు), అమృత కిరణుడు చంద్రునికి స్వయంగా మఱిది గారు, ఇక కులము చూద్దామా అంటే ఆదిత్యులనుకన్న అదితి ఈతని తల్లి, సురులను అసురులను బ్రహ్మ సృష్ఠించుటచే ఈయన వారందరికీ తాతగారు. సమస్త జీవకోటి ఆత్మబంధువు ఇతగాడే. వాగ్దేవి వాణికి అనుంగు మామగారు. తెలివి తేటలకి మారుపేరైన జాణ శ్రీవేంకటేశ్వరుడు ఈ స్వామే. వరుసకు, రూపం లేని మన్మథుని తండ్రి అయినా ఈ మన్మథుని చూస్తే ఆ మన్మథుని చూసినట్లే

★ **మాణికపు** – ఇంద్రనీలమణివంటి ★ **పరగి** – అతిశయించి

సంఖ్య : 432 సంపుటము : I పుట: 289 రాగం : సామంతం

**48 తెలియక వూరక తిరిగేము**

**చలమరి కగునా సంతతసుఖము ॥పల్లవి॥**

**హేయము కడుపున నిడుకొని యింకా**
**'ఛీ'యననిమాకు సిగ్గేది**
**పాయము పిడికిటఁబట్టుచునుండేటి-**
**కాయధారులకుఁ గలదా విరతి ॥తెలి॥**

**అంగనలరతులయాసలనీఁదేటి-**
**యెంగిలిమనుజుల కెగ్గేది**
**ముంగిట నార్గురుముచ్చులఁగూడిన-**
**దొంగగురుని కిందుల నిజమేది ॥తెలి॥**

**జననమరణములు సరి గని కానని**
**మనుజాధమునకు మహిమేది**
**యెనగొని శ్రీవేంకటేశు శరణ మిటు**
**గని మనకుండిన గతి యిఁక నేది ॥తెలి॥ 0**

**భావవివరముః**

ఒక విధమైన నిర్వేదనతో అన్నమయ్య యేమంటున్నారో వినండి. ఏయది హితమైనదో యేయది అహితమైనదో తెలియక వూరకనే తిరుగుతున్నాము. మేము మత్సరులము. చలమరికి (మత్సరము కలవారికి) శాశ్వత సుఖమునిచ్చే మోక్షము దొరుకుతుందా? తిన్న ఆహారము కొన్ని నిముషాలలో హేయము (అశుద్ధముగ) మారుతుంది. అయినా 'ఛీ'యనక మళ్ళీ తిండికోసం ఆరాటపడుతూనే వుంటాము. మాకు సిగ్గేది? ఇక మావయస్సు పిడికిటబట్టుకొని తిరిగే దేహధారులము. మాకు ఊరట యెలా లభిస్తుంది? తరుణుల రతి వాంఛా పీడవవితులమై సంసారంలో ఈదులాడే వారము "యెంగిలి" అనే భావన లేని కామపీడితులకు యెగ్గు అనేదే వుండదు. "కామాతురాణాం నభయం నలజ్జ" అని పెద్దలన్నారు కదా! ఆర్గురు ముచ్చులు (దొంగలతో) అంటే కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యములనే దొంగలతో స్నేహం చేసే దొంగ గురువైన జీవుడికి ఇక తన నిజతత్త్వమెలా యెఱుగగలడు? జనన మరణ చక్రమునుండి వెలివడని జీవులు మానవాధములు. మరి వారికి మహిమలు యెలా వుంటాయి? సరిపోల్చి శ్రీవేంకటేశ్వరుడు సర్వోన్నతుడని వరణాగతులైతే మనకుండే గతి మరెవరికుంటుంది?

★ **విరతి** – ఊరట ★ **ఎనగొని** – సరిపోల్చి

సంఖ్య : 416 సంపుటము : I పుట: 279 రాగం : భైరవి

**49 తెలియరాదు మాయదేహమా మమ్ము**
**పలువికారాలఁబెట్టి పనిగొన్న దేహమా** ॥పల్లవి॥

**దినమొక్కవయసెక్కె దేహమా సారె**
**పెనుమదముగురిసేబెండుదేహమా**
**దినదినరుచిగోరేదేహమా నన్ను**
**ఘనమోహపాశాలఁ గట్టెఁగదె దేహమా** ॥తెలి॥

**తెలివినిద్రలుగల దేహమా నీ-**
**పొలము పంచభూతాలపొత్తు దేహమా**
**తిలకించి పాపపుణ్యాలదేహమా**
**బలువుగలదాఁకా బదుకవో దేహమా** ॥తెలి॥

**తీరనిసంసారపుదేహమా ఇట్టె**
**వూరట లేనిభోగాల వోదేహమా**
**కూరిమి శ్రీ వేంకటేశుఁ గొలిచితి నిఁక నాకు**
**కారణజన్మమవై కలిగినదేహమా** ॥తెలి॥ **416**

**భావవివరము:**

మానవదేహపు అవగుణాలను ఆక్షేపిస్తూ ఈ కీర్తనను వినిపించారు అన్నమయ్య. ఇది మాయదారి దేహము. ఇది కల్పించే మాయ తెలియరానిది. మమ్మల్ని అనేక వికారాలకు లోనుజేసి బాధించటమే పనిగా బెట్టుకొన్నదేహమా! అని అంటూ దాన్ని తెగనాడుతున్నారు. ఓ దేహమా! దినముగడిచిందంటే నీ వయస్సుకు దినమెక్కిందని గ్రహించు. ఓ బలహీనమైన దేహమా! మమ్మల్నెందుకు అతిశయించిన మదమునకు గురిచేస్తావు? దినదినమూ కొత్త కొత్త రుచులను కోరుకొనే వో దేహమా! నన్ను ఘనమైన మోహపాశమున కట్టేశావు కదే! ఓ దేహమా! నీకు తెలివి నిద్రలు నిత్యకృత్యాలు నీపొలము (శరీరము) పంచభూతాలైన మట్టి, వాయువు, వేడిమి, నీరు, శూన్యములతోనే నిండివుంటుంది. దేహమా నీ ప్రమేయం వున్నా లేకపోయినా, నిత్యమూ నీవు చేసిన పాపపుణ్యాలు నీకు 'జమ' అవుతూనే వున్నాయి. ప్రసన్నతతో రెండిటినీ స్వీకరిస్తావు. నీకు బలమున్న దాకానే నీ బ్రతుకు. బలముడిగిననాడు నీవు బ్రతికినా చచ్చినట్లే. ఓ దేహమా! నీ సంసారవ్యామోహం యెన్నటికీ తీరనిది. నీవు ఆశించే భోగాలకు అంతూలేదు, వాటివలన నీకు ఊరటా లేదు. ఓ నాదేహమా! ఆఖరికి నేను చెప్పేది విను. నేను శ్రీవేంకటేశ్వరుని ఆరాధకుడను. ఆస్వామి కృపజేత నాకు కారణ జన్మవై కలిగితివి కదా! దేహమా

★ **బెండు** – బలహీనమై ★ **తిలకించి** – ప్రసన్నతతో

సంఖ్య : 330 సంపుటము : 1 పుట: 220 రాగం : బౌళి

**50 తెలిసియు నత్యంతదీనుఁడై తన్నుఁ**
**దెలియఁగఁగోరేటితెలివే పో తెలివి** ॥పల్లవి॥

**వలచినసతి దన్ను వడిఁ గాలఁదన్నిన**
**అలరి యెట్లా నుబ్బు నటువలెనే**
**తలఁక కెవ్వరు గాలఁదన్నినా మతిలోన**
**అలుగక ముదమందునదివో తెలివి** ॥తెలి॥

**అరిదిమోహపు వనిత ఆలిపైఁ దిట్టిన-**
**నరవిరై చొక్కినయటువలెనే**
**పరులు దన్ను వెలుపల నిట్లఁ బలికిన**
**అరలేక రతిఁ జొక్కునదివో తెలివి** ॥తెలి॥

**తనివోక ప్రియకాంత తమ్ములపురస మాన-**
**ననయమును నటుగోరు నటువలెనే**
**తనరు వేంకటపతిదాసుల ప్రసాదంబు**
**అనిశమును గొనఁగోరునదివో తెలివి** ॥తెలి॥ **330**

**భావవివరముః**

అన్నమయ్య ఈ కీర్తనలో నిజమైన తెలివి యెటువంటిదో వివరిస్తున్నారు. పల్లవిలో యేమి చెబుతున్నారో వినండి. అన్నీ తెలిసియునూ దీనునివలె తాను యెవరో తెలియగ గోరేటివాని తెలివే నిజమైన తెలివి పో... ఇదే నిజం అంటున్నారు. తాను వలచిన ప్రియమైన భార్య తనను కాలదన్నినా సంతోషంతో ఆమెనే సర్వస్వం అనుకొనే మగనివలె తలకక (కలతచెందక) తనను యెవ్వరు తిరస్కరించినా, మనస్సున కూడా కోపించక సంతోషంగా వుండటమే నిజమైన తెలివి అంటే. అతిశయించిన మోహముతో రెచ్చిపోయిన వనిత తన భార్యను నిందించినా అరవిచ్చిన మొగ్గవలె పరవశముగానే సర్దిచెప్పునట్టి చతురుడు పరులెవరైనా తనను బహిరంగంగా విమర్శించినా అరలేక (న్యూనతలేక) వారిరువురితో రతిలో పరవశించువానిదే నిజమైన తెలివి అంటే. తనివిదీరా ప్రియురాలి నోటిలోని తాంబూల రసమును ఆస్వాదించుటకు అనవరతము ఆకాంక్షించునటువలె (ఆవిధముగా) వేంకటపతి దాసులైనవారు ఇచ్చిన ప్రసాదమును స్వీకరించుటకు యెల్లవేళలా ఆత్రుత జెందువానిదే నిజమైన తెలివి అంటే.

★ **అనిశము** – ఎల్లప్పుడూ ★ **అరిది** – వింతగా

సంఖ్య : 276 సంపుటము : 1 పుట: 185 రాగం : సామంతం

**51 తొక్కనిచోట్లు దొక్కెడిమనసు**
**యెక్కడ గతిలే దింకనో తెరువు** ||పల్లవి||

**పాపము వాయదు పైపై మనసున**
**కోపము దీరదు కొంతైనా**
**దీపనబాధయుఁ దీర దిన్నియును**
**యేపునఁ బెనఁగొనె నింకనో తెరువు** ||తొక్క||

**యెవ్వనమదమును నెడయదు కోరికె**
**కొవ్వును నణఁగదు కొంతైనా**
**రవ్వగుమమకారముఁ బెడఁబాయదు**
**యెవ్విధియును లే దింకనో తెరువు** ||తొక్క||

**వెఱపును విడువదు వెడమాయలఁబడి**
**కొఱఁతయుఁ దీరదు కొంతైనా**
**తెఱఁ గొసఁగేటి శ్రీతిరువేంకటపతి-**
**నెఱిఁగెనెఱఁగలే మింకనో తెరువు** ||తొక్క|| **276**

**భావవివరము:**

అన్నమయ్య ఈ కీర్తనలో “ఓ తెరువు” అనే పదప్రయోగం చేశారు. ఇది సంబోధనా, అంటే కాదు, అని నా భావన. ఎందుకంటే, “చొరరానిచోట్లు జొచ్చెడి మనసుకు గతి యెక్కడా లేదు. ఇంక, యే తెరువు వుంటుంది? అని ప్రశ్నించడమే అన్నమయ్య వుద్దేశ్యం. కాబట్టి “గతిలేదింకనేతెరువు” అని నా ఆలోచన. పైపై ఆలోచనలకే ప్రాధాన్యతనిచ్చే మనస్సు పాపపు ఆలోచనలను చేయవద్దంటే వింటుందా? పుట్టుకతో వచ్చిన కోపము నానాటికీ పెరిగేదేగాని, తీరేదా? దీపన బాధ (ప్రేరేపించే వేదన) వొకనాటికైనా తీరేదా యేమి? పైవన్నీ అతిశయించి మనస్సును పెనవేస్తుంటే, ఇంకా యే తెరువు వుంటుంది? యౌవన మదముతో మిడిసిపడేవాడికి “కోరిక” యేనాటికీ తీరేది కాదు. దానికి తోడు కొవ్వెక్కివున్నవాడికి అగ్నికి ఆజ్యం పోసినట్లే. రవ్వగు (అపకీర్తిపాలుచేసే) మమకారము మనస్సును పట్టుకొని వుంటుందే కాని యెడబాయదు. ఇట్టి పరిస్థితిలో మనస్సుకు యే తెరువూ లేదు. (ఇంకా యే దారి లేదు.) ఈ మనస్సు మమకారం వలన కలిగిన భయమును వొక్కనాటికీ విడవదు. వెడమాయలబడి (వికృతమైన మాయలో తగులుకొని,) కొంతైనా కొఱత తగ్గించుకోదు. దారి చూపునట్టి శ్రీ వేంకటపతినే యెఱిగి యెఱగము. (చూసినా ఆయన కృపను అర్థం చేసికొనలేము.) మా బోటి దౌర్భాగ్యులకు, ఇంకా యేదారి వున్నది తండ్రీ?

★ **వెఱపును** – భయమును ★ **ఏపున** – అతిశయముతో

సంఖ్య : 67 సంపుటము : XV పుట: 46 రాగం : మలహరి

**52 దాఁటలేను యీ మాయ దైవమా నేను**
**నీటునఁ జేసేవాఁడవు నీవే నీవే కా ॥పల్లవి॥**

**యీ మురికిదేహమే కా యెంతకాలమైన నేను**
**వోముకొని భూమిమీఁద నుండఁ గోరేది**
**దోమటి యింద్రియాలే నా తోడునీడై యుండి నన్ను**
**వేమరు బోగించఁ జేసే వేనుబామైనది ॥దాఁట॥**

**పొంచి నాకర్మము లేకా పుట్టించి పుట్టించి**
**పంచల నా జన్మములపాలు సేసేది**
**అంచల యీ చిత్తమెకా ఆసలాసలఁజిక్కి**
**సంచితమై నా కీ పొద్దు చనివరి యైనది ॥దాఁట॥**

**చుట్టుకొన్న సంపదేకా సూదియై నానాఁటికి**
**ఇట్టిగొని లోలోనే చవి సేసేది**
**అట్టే శ్రీ వేంకటేశ అంతరంగాన నీవెకా**
**పట్టుఁ గొమ్మవై యుండఁగ బదికితి నేను ॥దాఁట॥ 69**

**భావవివరముః**

పెదతిరుమలయ్య ఏడుకొండల తిరుమలయ్యను యేమని అభ్యర్థిస్తున్నారో వినండి. ఓ దైవమా! నేను నీ మాయను దాటలేనయ్యా! నీటున (మురిపెముతో) అన్నీ చేసేవాడవు నీవే. నీవే కదా! ప్రభూ! ఈ మురికి దేహముతోనే కదా! నేను భూమిపై చిరాయువుగా వుండాలని ఆశపడేది. ఎంతకాలమైనా బ్రతుకుపై ఆశ చావదు. పెను బాముపలెనా ఇంద్రియాలే నాపై పగబట్టి పలుమార్లు నన్ను భోగాసక్తునిజేసి దోమటి ఇంద్రియాలే (మొరటుతనంకల నా ఇంద్రియాలన్నీ) నా తోడునీడవలె భ్రమింపజేసి నన్ను నీమాయలో పడేశాయి. దేవా! అవకాశం పొంచియున్న నా పురాకృత కర్మలే కదా! నన్ను పుట్టించీ పుట్టించీ నా జీవుడిని అనేక జన్మల పాలు చేసింది. నా యీ చిత్తము (మనస్సు) మాత్రం తక్కువ తిన్నదా? అదే కదా! నన్ను ఆశలలో ఇరికించి సంచితమై (అనుంగు మిత్రునివలె) భ్రష్టుపట్టించాయి. స్వామీ! నన్ను చుట్టుకొన్న సంపదలే కదా! బట్టలో అంటుకొన్న సూదివలె గుచ్చిగుచ్చి బాధపెడుతున్నాయి. అయినా మనస్సును అవి ఆక్రమించి లోలోపల అదే ఆనందం అనిపిస్తున్నాయి. ఇదంతా నీమాయే. ఓ శ్రీవేంకటేశ్వరా! అంతరాత్ముడివైన నీవేకదా! నాకు పట్టుగొమ్మవై బ్రతికించితివి.

★ **పట్టుగొమ్మ** – ఆధారము ★ **అంచల** – ఇంకొకప్రక్క

సంఖ్య : 327 సంపుటము : 15 పుట: 220 రాగం : దేసాక్షి

**53 దృష్టాంత మిది దప్పదు తెలుసుకోవలెఁ గాని**
**సృష్టికి మూలమైన శ్రీపతిదాసులకు ॥పల్లవి॥**

**పుటము వెట్టినపైఁడి పొందుగా నెత్తు దరిగి**
**తటుకున వన్నె కెక్కినటువలెనే**
**చిటుకన హరిభక్తిచేత మలినము మాని**
**ఘటన జీవాత్ముఁడు ఘనుఁడై వెలయును ॥దృష్టాంత॥**

**ఆరయ చిట్టము గట్టినటువంటి మాణికము**
**సారసానఁ బట్టితే నుజ్జ్వలమైనట్టు**
**బోరున నాచార్యునిబోధచేత నిశ్చలుఁడై**
**ధారుణిలో శిష్యుఁడు సంతతపుణ్యుఁడౌను ॥దృష్టాంత॥**

**అట్టే మాఁగుడు గప్పిన యద్దము దోమితేను**
**గట్టిగా విశ్వ మెల్లాఁ బ్రకాశించినట్టు**
**గుట్టున శ్రీవేంకటేశుఁ గొలిచి కృతకృత్యుఁడై**
**దట్టపు హరి భక్తుఁడు ధర్మచిత్తుఁ డౌను ॥దృష్టాంత॥ 327**

**భావవివరముః**

పెదతిరుమలయ్య యేమంటున్నారో వినండి. ఇదే (నేను చెప్పబోయే ఈ మాట) తప్పనిసరియైన దృష్టాంతము (నిదర్శనము) అని తెలుసుకోవలెను. సృష్టికి మూలమైన శ్రీపతియొక్క దాసులకు ఇంతకన్న గొప్ప నిదర్శనములేమి కావాలి చెప్పండి? బంగారమునకు పుటము పెట్టితే (పూర్తిగా కరిగిస్తే) దాని యెత్తు (తూకము) తగ్గుతుంది. కాని వున్నట్లుండి దాని "వన్నె" పెరుగుతుంది. హరి భక్తి చేత మనస్సులోని మాలిన్యాలను కడిగివేసికొనిన జీవుడు ఘటించి నిజముగానే ఘనుడై వెలయును సుమా! పరికించిచూస్తే చిట్టము కట్టినటువంటి మాణిక్యమునకు ఎంత కడిగినా మెఋపురాదు. అప్పుడు మళ్ళీ దానిని సానబడితే ఉజ్జ్వలమవుతుంది. ఈ ధాత్రిలో మంచి ఆచార్యుని సద్బోధతో శిష్యుడు నిశ్చలుడై శాశ్వత పుణ్యము నార్జించగలుగుతాడు. అంతెందుకు, మన వద్దనున్న అద్దము మాగుడు వారిందంటే చక్కగా తోమితే ప్రపంచాన్నంతా ప్రతిఫలించకలదు. పూర్వాశ్రమంలో యెంతటి పనికిరానివాడైనా ఒక్కసారి శ్రీవేంకటేశ్వరుని కొలిచి కృతకృత్యుడైతే (సఫలీకృతుడైతే) హరి భక్తుడై ధర్మచిత్తుడవుతాడు.

★ **మాగుడువారు** – మకిలిపట్టిన ★ **చిట్టెము** – కడిగితే పోనిముటికి

సంఖ్య : 372 సంపుటము : 1 పుట: 249 రాగం : బౌళి

**54 దేవ నీవిచ్చేయందుకు దీనికిఁగా నింతయేల**
**యేవేళ మాయెరుకలు యెందుకుఁ గొలుపును** ॥పల్లవి॥

**యెవ్వరివసములు బుద్ధెరిఁగినడచేమన**
**యివ్వల నారాయణ నీవియ్యక లేదు**
**దవ్వుచేరువ మనసుతనయిచ్చుయితేఁగనక**
**రివ్వగ మృగాదులెల్ల రాజ్యమేలనేరవా** ॥దేవ॥

**సారెకు నిన్నుఁదలపించ జంతువులవసమా**
**కేరి నీవు జిహ్వఁ బలికించఁగాఁగాక**
**యీరీతి లోకమెల్లాఁ దమయిచ్చకొలఁదులనయితే**
**దూరానఁ గొక్కెరలు చదవవా వేదాలు** ॥దేవ॥

**యిందరి పాపపుణ్యాలు యిన్నియు నీచేఁతలే**
**కందువ స్వతంత్రులు గారు గాన**
**చందపుశ్రీవేంకటేశ శరణంటి నిదె నీకు**
**చెంది నీవే కాతుగాక చేఁతలూను వలెనా** ॥దేవ॥ **372**

**భావవివరము:**

అన్నమయ్య చెప్పిన యీ అధ్యాత్మ కీర్తనలో స్వామితో యేమంటున్నారంటే, దేవా! నీవేది ఇయ్యదలిస్తే అదే ఇస్తావు. దీనికోసం ఇంత ఆలోచన యేల? మా జ్ఞానము యెన్నడైనా యెందుకు వుపయోగిస్తుంది? అంతా నీమాటే చెల్లుతుంది. మంచి బుద్ధితో నడుచుకోవాలంటే యెవ్వరి వశమవుతుంది? ఓ నారాయణుడా! నీవియ్యక మంచి బుద్ధే లేదు. ఒకరు ఇంకొకరికి చేరువ అవటం దూరము అవటం మనస్సు చేసే మాయాజాలం. అదే నిజం కాకపోతే జంతువులు రాజ్యాలేలవా? ప్రతిసారి మనస్సులో నిన్ను ధ్యానించడం జంతువుల వశమవుతుందా? కావాలని నీవు మా నాలుకతో పలికించకపోతే మేము నీపేరును పలుకగలమా? లోకంలో నీ ప్రమేయంలేకుండా యెవరికి యేది కోరికైతే అది చేసికొనగలిగితే, కొక్కెరలు (కొంగలు) కూడా వేదములను చదువుతామంటాయి. ఓదేవదేవా! అందరి పాపపుణ్యాలూనీచేతిలోనివే. ఎవ్వరూ సామర్థ్యంతో స్వతంత్రులు కారు. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇదే నీకు నేను శరణంటిని ఇక నీవే నన్ను రక్షిస్తావు. నా ప్రయత్నం అవసరమా? అక్కరలేదు తండ్రీ!

★ **కందువ** – సామర్థ్యంతో ★ **కేరి** – విజృంభించి

సంఖ్య : 334 సంపుటము : XV పుట: 225 రాగం : బౌళి

**55 దేవుఁ డొక్కఁడే మఱి జీవులు వేరు**
**వావాతఁ దెలిసేది వారి వారి భాగ్యము** ॥పల్లవి॥

**పొడమినవారికిఁ బోయినవారికి**
**గడియ లొక్కటే వారి గతులు వేరు**
**బడిఁ బుణ్యములు సేయఁ బాపములు సేయఁగ**
**కడఁగి కాల మొక్కటే కర్మములే వేరు** ॥దేవు॥

**కాకములు సంచరించె కలహంసలు దిరిగె**
**ఆకాశ మొక్కటే విహారాలు వేరు**
**మేకొని యెండలు గాయ మించి చీఁకటులు రాయ**
**లోకపు బయ లొక్కటే జోకలే వేరు** ॥దేవు॥

**అట్టే యేలే రాజులకు నడిగేటి దీనులకు**
**పట్టి భూమి యొక్కటే బాగులు వేరు**
**గుట్టున శ్రీవేంకటేశుఁ గొలువఁగఁ దలఁచఁగ**
**నెట్టన దేహ మొక్కటే నేరుపులే వేరు** ॥దేవు॥ **334**

**భావవివరము:**

అన్నమయ్య ఈ విలక్షణమైన కీర్తనలో యేమని అంటున్నారో ఆలకించండి. దేవుడు ఒకే ఒక్కడు. మఱి జీవులను చూడబోతే అసంఖ్యాకులు. ఈ సంగతి కొంతమంది ఆనోట ఆనోట విని తెలుసుకొంటారు. అది వారి వారి భాగ్యము. మరి కొందరు యెన్నటికీ గ్రహించలేరు. అది వారి దౌర్భాగ్యము. ఒకే సమయానికి వొకడు పుట్టవచ్చును, మరొకడు గిట్టవచ్చును. కాని వారి గతులు మాత్రం వేర్వేరుగా వుంటాయి కదా! ఒకే కాలములో (సమయములో) ఒకడు పుణ్యము చేస్తాడు. వేరొకడు పాపము చేస్తాడు. మరి వారి కర్మఫలములు వొకే విధంగావుంటాయా? ఉండనే వుండవు. గమనించి చూడండి.కాకులు తిరిగే ఆకాశంలోనే కలహంసలూతిరుగుతాయి. ఆకాశం ఒక్కటే కాని విహారాలు వేర్వేరు. అవునా. విజృంభించి యెండలు గాచిన చోటే మించిన చీకటులలముకొంటాయి. అలాగే లోకంలో సంగీతం ఒక్కటే. దాని సాధన విధానములే వేర్వేరు. అదే విధంగా భూమినేలే రాజులుగాని ఆ రాజులకు అడగివుండే దీనులుగాని నిలబడే నేల వొక్కటేకదా! కాకపోతే ఆ నేల బాగులు వేర్వేరు. రాజుగారి నేలపై రాజభవనం వుంటే దీనుడి నేలపై గుడిసె వుంటుంది. శ్రీవేంకటేశ్వరుని కొలుచుటకు ఆయన ఇచ్చిన దేహం అందరికీ వొక్కటే. కాని వారివారి నేరుపులే (పరిణతలే) వేర్వేరు.

★ **జోకులు** – విధానములు ★ **బాగులు** – మిక్కిలి బాగైనవి

సంఖ్య : 42 సంపుటము : XV పుట: 126 రాగం : భూపాళం

**56 దేవునిప్రసాదము తెరళ లందుకోరో**
**యీవేళ నారగించె యీశ్వరేశ్వరుఁడు ॥పల్లవి॥**

**వేగు జామునను లేచి వేద విప్రు లెల్లఁ గూడి**
**ఆగపు ధనుర్మాసమందు పూజించి**
**రాగమునఁ దేర్పాముడి రంతుసేసి చదువఁగ**
**జాగుతోడ నారగించె సర్వలోకేశ్వరుఁడు ॥దేవుని॥**

**దినసంభ్రమములతో దేవదుందుభులు మ్రోయ**
**తన చెరపులు పైపైదాసులు సేయ**
**సనకాదు లిరువంక సంకీర్తన వాడఁగా**
**వినుకొంటా నారగించె విశ్వలోకేశ్వరుఁడు ॥దేవుని॥**

**హత్తుకొని వైష్ణవులు అనుష్ఠానములు దీర్చి**
**యెత్తిచేతుల పుష్పాంజ లియ్యఁగాను**
**పొత్తుల నలమేలుమంగ బోనము దొడుకఁగాను**
**చిత్తగించి ఆరగించె శ్రీ వేంకటేశ్వరుఁడూ ॥దేవుని॥ 189**

**భావవివరముః**

పెదతిరుమలయ్య శ్రీవేంకటేశ్వరుని ప్రసాదములను భక్తులు ఆరోజుల్లో దేవుని ఆరగింపులయ్యాక యెలా స్వీకరించేవారో వివరిస్తున్నారు, వినండి. కన్నడంలో “తెరళ” అంటే తెలుగులో “ముద్ద” అని అర్థం. భక్తులారా! దేవుని ప్రసాదము ముద్ద అందుకోండయ్యా! ఈపూట ఈశ్వరేశ్వరుని ఆరగింపులైపోయాయి. ఈ ధనుర్మాసములో వేకువనే విప్రవర్యులు లేచి వేదశాస్త్ర ఆగమ విధానమున స్వామివారిని పూజించి రాగయుక్తముగా “తేర్పాముడి” పఠిస్తూ వుంటే దేవదేవుడు, సర్వలోకేశ్వరుడు జాగుతోడ(మెల్లమెల్లగా) ఆరగించినాడు. అధికమైనసంభ్రమముతో దేవదుందుభులు మ్రోగుచుండగా తనదాసులు తన లీలలను కీర్తిస్తుంటే, సనకాది ఋషులు తనకిరుపక్కల నిలిచి సంకీర్తనలు ‘వాడఁగా’ (పాడుతుంటే) ఆ విశ్వలోకేశ్వరుడు ఆనందంగా వింటూ తనకర్పించిన ప్రసాదములను ఆరగించినాడు. శ్రీవైష్ణవులు పొందికగా అనుష్ఠానములు తీర్చి చేతులెత్తిపుష్పములతో కూడిన ముకుళిత హస్తములతో అంజలి ఘటించి యుండగా, పొత్తులో కూర్చున్న అలమేల్మంగ బోనము (భోజనము) తొడుకగా (పట్టుకొనగా) ఆమె అనురాగము చిత్తగించి శ్రీవేంకటేశ్వరుడు ఆరగించినాడు.

★ **హత్తుకొని** – పొందికతో ★ **వేగుజామున** – వేకువనే

సంఖ్య : 93 సంపుటము : 2 పుట: 63 రాగం : నాట

**57 దేవశిఖామణి దివిజులు వొగడఁగ**
**వేవేలుగతుల వెలసీ వాఁడే** ॥పల్లవి॥

**వీదుల వీదుల వెసఁ దురగముపై**
**ఖేదిల బల్లెము బిరబిరఁ దిప్పుచు**
**మోదముతోడుత మోహనమూరితి**
**యేదెసచూచిన నేఁగీ వాఁడే** ॥దేవ॥

**కన్నులు దిప్పుచు కర్ణములు గదల**
**సన్నల రాగెకు చౌకళింపుచును**
**అన్నిటఁ దేజి యాడఁగ దేవుఁడు**
**తిన్నఁగ వాగేలు దీప్పీ వాఁడే** ॥దేవ॥

**వలగొనఁ దిరుగుచు వాలము విసరుచు**
**నిలిచి గుఱ్ఱ మటు నేర్పుల చూపఁగ**
**బలుశ్రీవేంకటపతి యహోబలపుఁ-**
**బొలమున సారెకుఁ బొదలీ వాఁడే** ॥దేవ॥ **93**

**భావవివరముః**

అహోబల నృసింహుడు తురగపు వాహనంపై ఊరేగింపుగా పోతుంటే అన్నమయ్య ఆనాడు చెప్పిన అద్భుత కీర్తన ఇది. ఆకాలంలో గుఱ్ఱముపై ప్రయాణించటం వలన తెలిసిన క్రొత్త క్రొత్త పదజాలం వాడి వినిపించిన కీర్తన ఇది. దీనిని చదివి ఆనందించండి. దేవశిఖామణియైన ఈ నరసింహుడు, దేవతలంతా పొగుడుతుంటే, బహువిధములుగా అతిశయించుచున్నాడు. అదిగో వాడే. చూచి తరించండి. వెసన్ (వేగముగా) వీదులగుండా తురగముపై చీల్చే విధముగా బల్లెమును బిరబిర త్రిప్పుచూ, సంతోషముతో మోహనమూర్తివలె యేవంక చూచినా తానే వున్నట్లు వూరేగుతున్నాడు వాడే లక్ష్మీనృసింహుడు. ఇక ఆ గుఱ్ఱము యెలావున్నదో గమనించండి. అది వేగముగా తన కన్నులను దిప్పుచున్నది. అంతే వేగముగా తన చెవులను కదిలించుచున్నది. సన్నగా వేసే కుప్పిగంతులతో దేవుని తేజి (గుఱ్ఱము) ఆడుచున్నది. ఆయనేం చేస్తున్నాడో చూశారా, ఆ గుఱ్ఱమునోటికి బిగించిన కళ్ళాన్ని బిగించి తిప్పుతూ ముందుకు దూకిస్తున్నాడు. వాడే అహోబల దేవుడు. ఇక ఆ గుఱ్ఱము యొక్క వాలము (తోక) యెట్లావున్నదో చూడండి. ఆ గుఱ్ఱము చుట్టుకొన్నట్లు తిరుగుచూ విలాసముగా తోకను విసురుతూ తన నేర్పులు ప్రదర్శిస్తూ నిలుచున్నది. ఈ అహోబల నృసింహుడే బలవంతుడైన శ్రీవేంకటేశ్వరుడు కావున ఈ అహోబల పొలమున (క్షేత్రమున) వాడే పొదలీ (అతిశయించుచున్నాడు).

★ **వలగొను** – చుట్టుకొను ★ **వాగేలు** – నోటికి బిగించిన పగ్గాలు

సంఖ్య : 248 సంపుటము : 2 పుట: 166 రాగం : నాట

**58 నిండె నిన్నిచోటులను నీమహిమలే**
**అందనే మొక్కేము నీకు నాదినారసింహా** ॥పల్లవి॥

**కూరిమి యిందిరమీఁద, కోపము అసురమీఁద**
**తారుకాణనవ్వు దేవతలమీఁదను**
**ఆరీతి నీకొలు విట్టే అహోబలముమీఁద**
**నారుకొనె నీనేరుపు నారసింహా** ॥నిండె॥

**కరుణ ప్రహ్లాదుమీఁద, గన్నులు దిక్కుల మీఁద**
**సరిచేతులు పేగులజంధ్యాలమీఁద**
**గరిమ నీనటనలు ఘనప్రతాపముమీఁద**
**తిరమాయ నీకోరిక దివ్యనారసింహా** ॥నిండె॥

**శాంతము లోకముమీఁద శౌర్యము శత్రులమీఁద**
**కాంతులెల్లా తనదివ్యకాయముమీఁద**
**చింతదీర వినోదము శ్రీవేంకటాద్రిమీఁద**
**సంతతమె నీకుఁ జెల్లె జయనారసింహా** ॥నిండె॥ **248**

**భావవివరముః**

అహోబల నారసింహునిపై చక్కటి కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. "ఓ ఆదినారసింహా! అన్నిచోట్లా నీమహిమలే నిండివున్నాయి. అందుచేతనే నిన్ను శరణు కోరి నీకు మొక్కేమయ్యా!" అంటున్నారు. ప్రభూ! ఒకేసారి నీవు ఇందిరపై అనురాగమును, హిరణ్యకశిపునిపై ఆగ్రహమును కురిపించుచున్నావు. దేవతలయందు ప్రసన్నుడవై నవ్వులొలికిస్తున్నావు. అందుచేత అహోబలమున కొలువుదీరియున్నావు. నీ నేర్పులన్నీ ప్రదర్శించుచున్నావయ్యా నారసింహా! స్వామీ! నీవు ప్రహ్లాదుని కరుణాదృష్టితో చూస్తున్నావు. నీ కన్నులు దిక్కులన్నింటినీ గమనిస్తూనే వున్నాయి. నీ చేతులతో అసురుని ప్రేగులు చీల్చి జంధ్యాలవలె వేసికొనినావు. నీ కదలికలలో నీ ప్రతాపమే ప్రతిఫలిస్తున్నది. భక్తరక్షణనే నీ కోరిక స్థిరమైనదయ్యా దివ్యనారసింహా! దేవా! నీవు లోకములపై శాంతము చూపుతూనే, శత్రువులపై శౌర్యమును ప్రదర్శించుచున్నావు. దివ్యమైన నీ కాయమునుండి కాంతులు వెలువడుచున్నవి. చింతలను దీర్చి వినోదముల నొసగు వేంకటేశ్వరా! నీకు యెల్లప్పుడు జయమగుగాక!

★ **తిరమాయ** – స్థిరమైనవి ★ **నారుకొను** – మొలకెత్తు

సంఖ్య : 427 సంపుటము : I పుట: 286 రాగం : సాళంగనాట

**59 నాతప్పు లోఁగొనవే నన్నుఁ గావవే దేవ**
**చేఁత లిన్నీఁ జేసి నిన్నుఁ జేరి శరణంటిని ॥పల్లవి॥**

**అందరిలో నంతర్యామివై నీ వుండఁగాను**
**యిందరిఁ బనులుగొంటి నిన్నాళ్లును**
**సందడించి యిన్నిటా నీచైతన్యమై యుండఁగాను**
**వందులేక నేఁ గొన్నివాహనా లెక్కితిని ॥నాత॥**

**లోకపరిపూర్ణుఁడవై లోనా వెలి నుండఁగాను**
**చేకొని పూవులుఁ బండ్లుఁ జిదిమితిని**
**కైకొని యీమాయలు నీకల్పితమై వుండఁగాను**
**చౌకలేక నే వేరే సంకల్పించితిని ॥నాత॥**

**యెక్కడచూచిన నీవే యేలికెవై వుండఁగాను**
**యిక్కడాఁ దొత్తుల బంట్ల నేలితి నేను**
**చక్కనిశ్రీవేంకటేశ సర్వాపరాధి నేను**
**మొక్కితి నన్ను రక్షించు ముందెఱఁగ నేను ॥నాత॥ 427**

**భావవివరముః**

పరమాత్మతో అన్నమయ్య మనవి వినండి. ప్రభూ! నాతప్పు లోగొనవే (మన్నించవయ్యా). చేసేవన్నీ చేసి నేడు నిన్ను జేరి శరణంటిని అని భావింపవలదు. నేను చేసిన కొన్ని తప్పులను అంగీకరిస్తున్నాను, ఆలకింపుము. మా అందరిలోనూ అంతర్యామిగా నీవే వున్నావని అందరితోనూ పని చేయించుకొంటే పరమాత్మ నాకు చేసినట్లేనని గ్రహించలేకపోయాను. అతిశయించి అన్నిటిలోనూ చైతన్యమై నీవేవుండగా వందులేక (ఏమాత్రం విచారం లేక) నేను కొన్నిటిని వాహనాలుగా చేసికొని తిరిగాను. లోకమంతా పరిపూర్ణుడవై, లోపలా బయటా నీవేవుండగా, ఎన్ని పూవులను కోసి లతలను బాధించాను!! ఎన్ని పండ్లను చెట్లనుంచి త్రుంచి తిన్నాను!! నీవు నీ చేతలతో మాయాకల్పితములుగా సృజిస్తే సరుకు జేయక నేను వేరుగా సంకల్పించితిని. స్వామీ! యెక్కడ చూచినా నీవే జగదీశ్వరుడవై కనబడతుంటే నేను యెందర్నో యేలికలను కొని వాళ్ళకు తొత్తులుగా, బంట్లగా సేవించాను. చక్కదనాల శ్రీవేంకటేశ్వరా! నేను సర్వాపరాధినైనప్పటికీ శరణని నీకుమొక్కాను. నేను గతంలో అజ్ఞానినే కాని, నీవాడను.

★ **చౌక** – తిరస్కారం ★ **ముందెరగను** – అజ్ఞానిని

సంఖ్య : 47 సంపుటము : 2 పుట: 32 రాగం : సాళంగనాట

**60 నీయంతటివా రెవ్వరు నీకు నెదురేది యెందు**
**చాయల నీసుద్ది విని శరణంటి నేను ॥పల్లవి॥**

**కావలెనంటేఁ దొల్లి కంభము చించుకవెళ్లి**
**కైవశమై ప్రహ్లాదుఁ గావవా నీవు**
**తేవలనంటే బ్రహ్మదేవునికి వేదములు**
**సోవల సముద్రమయిన చొచ్చి తేవా నీవు ॥నీయం॥**

**పట్టియెత్తవలెనంటేఁ బాతాళానఁ బద్దకొండ**
**తట్టియెత్తి పాలవెల్లి దచ్చవా నీవు**
**మట్టుపెట్టవలె నంటే మరి భూమి చాపగాఁగ**
**చుట్టుకపోతేఁ దెచ్చి సొంపుగ నిలుపవా ॥నీయం॥**

**పక్షపాతమయ్యేనంటేఁ బాండవుల గెలుపించి**
**యీక్షితియేలించి చనవియ్యవా నీవు**
**రక్షించేనంటేఁ గాతరాన శ్రీవేంకటాద్రిఁ బ్ర-**
**త్యక్షమై మావంటివారిఁ దగఁ గరుణించవా ॥నీయం॥ 47**

**భావవివరము:**

భాగవతుల ఇండ్లలో పుట్టిన పిల్లలు శ్రీహరి కథలను వింటూనే పెరిగి పెద్దవారవుతారు. అన్నమయ్య ఈ విషయాన్నే ప్రస్తావిస్తూ, స్వామీ! నీఅంతటివారు యెవ్వరున్నారు? నీకెదురెక్కడుంది? చాయల (రాత్రిపూట) నీ కథలనవిని, నీ మహిమతెలిసి, నిన్ను శరణన్నాను అంటున్నారు. తొల్లి కృతయుగంలో ప్రహ్లాదుని తండ్రి ఆగ్రహంతో ఈ స్తంభంలో హరిని చూపించరా అని గద్దిస్తే స్తంభమును చీల్చుకొని వెడలి వచ్చి తండ్రిని చంపి ప్రహ్లాదునికి స్వాధీనుడవు కాలేదా? బ్రహ్మదేవుడు వచ్చి వేదాలను సోమకాసురడెత్తుకుపోయాడు తెమ్మని అంటే జాడ తెలిసి సముద్రములోకి చొచ్చుకొని పోయే మత్స్యమై దనుజుని చంపి నీవు వాటిని తేవా (తీసికొనిరావా?). ఆనాడు పాతాళంలోకి మంధరగిరి పడిపోతే,దేవతల చేత క్షీరసాగరాన్ని చిలికించటం కోసం కూర్మమువలె అవతరించి నీ వీపుపై పర్వతాన్నిమోస్తూ పాలసముద్రాన్ని దచ్చవా (చిలికించవా?) భూమిని చాప చుట్టినట్లు చుట్టి కంపింపజేసిన హిరణ్యాక్షుని చంపి మట్టిపెళ్ళనెత్తినట్లుభూమినెత్తి సొంపుగా రక్షించినది నీవే కదా! పక్షపాతమున ధర్మానికిహాని జరుగుతున్నదంటే పాండవులకు అండగానిలబడి గెలిపించి ఈ భూమిని యేలించలేదా నీవు. నీ భక్తులు భయకంపితులై రక్షించవయ్యా! అంటే శ్రీవేంకటాద్రిమీద మావంటివారికి కూడా ప్రత్యక్షమై కరుణించవా?

★ **సోవల** – జాడ ★ **కాతరాన** – భయకంపితులై

సంఖ్య : 376 సంపుటము : I పుట: 251 రాగం : రామక్రియ

**61 నీయాజ్ఞ దలమోచి నీదేహధారినైతి**
**యీయెడ గోవిందుఁడ నే నీడేరేదెట్లో** ॥పల్లవి॥

**తనువు వేసరినాను తలఁపు వేసరదు**
**ధనముగడించెడి తరితీపున**
**చెనకి మగఁడు విడిచిన మామ విడువని-**
**పనియాయ హరి నాబదుకుజాడ యెట్లో** ॥నీయా॥

**పాయము ముదిసినాను భావము ముదియదు**
**వేయైనా సంసారవిషయాలను**
**వోయయ్య కలివోసినావుట్లదిక్కు చూచేది**
**మాయదాయ నిఁక నామనసుజాడెట్లో** ॥నీయా॥

**కడలేనినావిధులు కన్నులారఁ జూచి నీవు**
**నడుమ శ్రీవేంకటేశ నన్ను నేలితి**
**నొడుగులు దప్పినాను నోముఫలము దప్పని-**
**అడియాల మబ్బె నాకు నానతిచ్చి తెట్లో** ॥నీయా॥ **376**

**భావవివరముః**

అన్నమయ్య ఈ అధ్యాత్మ కీర్తనలో గోవిందా! నేనెట్లా యీడేరుతానయ్యా? నేను జీవుడను. నీ ఆజ్ఞను (శిరసావహించి) నీవిచ్చిన దేహాన్ని ధరించి నేనీ భూమ్మీదకు వచ్చాను. అంతా నీ ఆజ్ఞ ప్రకారమే జరుగుతుంది. వార్ధక్యంతో నాతనువు వేసరించి (విసిగిపోయింది) కానీ నాతలపులకు అయిష్టత రాలేదు. ధనము సంపాదించాలనే తరితీపున (వ్యామోహంతో) యేమి జరిగిందంటే, మొగుడు విడిచిపెట్టినా మామగారు విడిచిపెట్టనట్లు అయింది నా బ్రతుకు. పాయము (ప్రాయము) ముసలిదయినది. కాని నా భావనలు ముసలితనంరాలేదు. సంసార విషయాలు ఏవైనా వినటానికి దీనికి ముసలితనం అడ్డం రాదు. కలిగినంత పెట్టినా తిండిపోతు అతిథివుట్లకేసి ఆశతో చూచినట్లు, నామాయదారి మనస్సు జాడతెలియకుండా ప్రవర్తిస్తున్నది. అంతులేని నా విధానములను చూచి దయదలచి వో శ్రీవేంకటేశా! నన్ను యేలుకొంటివి. మంత్రములు తక్కువయినా నోము ఫలము దక్కినట్లు, నాకునీ అడియాలము (నీముద్రలు) దక్కినవయ్యా! ఏమి ఆనతిచ్చినావు ప్రభూ!

★ **నుడుగులు** – మాటలు, మంత్రములు ★ **మాయదాయన్** – మాననంటుంది

సంఖ్య : 361 సంపుటము : 15 పుట: 243 రాగం : దేసాళం

**62 నీవు లోకోన్నతుఁడవు ని న్నెఱుఁగరా యిందరు**
**వేవేలు నేఁ గెలసిన వెలితా నీకు** ॥పల్లవి॥

**గుట్టునఁ బుట్టుతా బొడ్డు గోయించుకొన్నవాఁడు**
**యిట్టే జారుఁడవంటే యెగ్గా నీకు**
**బట్టబయలు సంసారభ్రమ వట్టి**
**వొట్టి నాటకుఁడ వంటే వొచ్చెమా నీకు** ॥నీవు॥

**అంది యధరపానాన అన్ను వట్టినట్టివాఁడ**
**చెందిన కపటి వంటే సిగ్గా నీకు**
**ముందే మాయాశక్తిశివమునఁ బొరలేవాఁడ**
**నిందఁ బడ్డవాఁడ వంటే నేరమా నీకు** ॥నీవు॥

**పలుకులప్రల్లదపు బహుభాషివాఁడను**
**యిల వెన్నదొంగ వంటే హీనమా నీకు**
**అలరి శ్రీవేంకటేశ అన్నిటా నీ దాసుఁడను**
**బలుదైత్య హంత వంటే భారమా నీకు** ॥నీవు॥ **361**

**భావవివరముః**

'నిందాస్తుతి' చేయడంలో పెదతిరుమలయ్య యెంతటి చతురుడో చిత్తగించండి. స్వామీ! నిన్నెఱగని వారెవరయ్యా? అనేక విధాలుగా నీవు లోకోన్నతుడవు. నాబోటి వాడు కెలసిన (వికటముగా మాట్లాడినంతమాత్రాన) నీకేమి వెలితి వస్తుంది? నావు గుట్టున పుట్టినవాడవు.నీకు బొడ్డు కోసినదెవ్వరో యెవడికి తెలుసు? ఎన్నో జారత్వపు పోకడలు గలవాడవంటే నీకేమన్నా యెగ్గాయేమి? నీకు సంసారతాపత్రయం వున్నదంటే అది వట్టిమాట. ఉత్తనాటకాలరాయుడు అని నిన్నంటే, నీకు అవమానమా యేమన్నానా? నీవన్నిటికీ అతీతుడవు స్వామీ! ఇంకా నీ గురించి యేమి చెప్పేది? అంది పుచ్చుకొని అధరామృతపానమంటే అన్నుపట్టి పోతావు (గుక్కతిప్పుకోవు). ఇట్లాంటి విషయాలలో నీవు కపటివని అంటే నీకు సిగ్గేలనయ్యా? మాయాదేవి శక్తివలన అందరిని మాయలో బోరలించేవాడవు. ఈ నింద నీతలపై యెప్పుడూ వుంటుందని నేనంటే నీకు నేరమా? స్వామీ ఇకనీవు అపరిమితంగా మాట్లాడతావు. పోనీ ప్రియముగా భాషిస్తావా, అంటే అన్నీ అప్రియ వచనాలే. అట్లాంటి నిన్ను వెన్నదొంగ అంటే నీకు హీనముగా తోచిందా?నీవెటువంటి వాడవైనా, ఓ శ్రీవేంకటేశ్వరా! నేను నీదాసుడినయ్యా! నాలోవున్న చెడుని హత్య చేయరాదా తండ్రీ? నీవెలాగో బలవంతులైన దానవ హంతకుడివే కదా!

★ **ఒచ్చెము** – అవమానము ★ **ప్రల్లదపు** – అప్రియమైన

సంఖ్య : 129 సంపుటము : 2 పుట: 87 రాగం : శంకరాభరణం

**63 నీవు సర్వసముఁడవు నీవు దేవదేవుఁడవు**
**యీవల నాగుణదోషా లెంచ నిఁకనేలా ॥పల్లవి॥**

**పూవులపైఁ గాసీఁ బొరి ముండ్లపైఁ గాసీని**
**ఆవల వెన్నెలకేమి హానివచ్చీనా**
**పావనుల నటు గాచి పాపపుంజమైననన్నుఁ**
**గావఁగా నీకృపకునుఁ గడమయ్యీనా ॥నీవు॥**

**గోవుమీఁద విసరీఁ గుక్కమీఁద విసరీని**
**పావనపుగాలికిని పాపమంటీనా**
**దేవతలరక్షించి దీనుఁడనైననాకుఁ**
**దోవచూపి రక్షించితే దోసమయ్యీనా ॥నీవు॥**

**కులజునియింటనుండీ కులహీనునియింటనుండీ**
**యిలలో నెండకు నేమి హీనమయ్యీనా**
**వలసి శ్రీవేంకటాద్రి వరములు యిచ్చి నాలో**
**నిలిచి వరములిచ్చి నేఁడు గావవే ॥నీవు॥ 129**

**భావవివరముః**

అన్నమయ్య "లాజిక్" నేనే ఇతర కవిలోనూ చూడలేదు. ఈ కీర్తనలో ప్రస్ఫుటమవుతున్న ఆయన భక్తి నేనెక్కడా చూడలేదు. ప్రభూ! నీవు దేవదేవుడవు.నీవు సర్వసముడవు (అందరూ నీకు సమానమే)మరి అటువంటప్పుడు ఇప్పుడు, నా గుణములనెంచి నన్ను త్యజించుట న్యాయమా? చల్లటి వెన్నెల సుగంధభరిత పుష్పములపై కాచినా, బాధించే ముండ్లపై కాచినా దానికేమి హాని వస్తుంది? నీవు కృపాసముద్రుడవు. గొప్ప పుణ్యాత్ములను రక్షించినా, నావంటి పాపపుంజము (పాపరాసి) గలవానిని రక్షించినా నీకృపకు కడమయ్యీనా (కొరత వస్తుందా?) పావనమైన గాలి అన్నిటిపైన సమానముగానే వీస్తుంది. పవిత్రమైన గోవుపైనా వీధికుక్కపైనా ఒకే విధముగా వీస్తుంది. అంతమంది దేవతలను రక్షిస్తావే దీనుడనైన నాకు కూడా త్రోవ చూపి రక్షించితే నీకు యేమన్నా దోషం అంటుకొంటుందా? తీక్షణమైన ఎండ, అగ్రకులమువాని యింట్లో పడినా లేక తక్కువ కులము వాని యింట్లో పడినా దానికేమి హీనత్వము కలుగుతుంది? అట్లాగే శ్రీవేంకటాద్రిపై నెలకొనిన నీవు అక్కడవుండి నీదాసులకు వరములిచ్చినా, నాలో నిలిచి నన్ను రక్షించే వరములిచ్చినా వచ్చే ఇబ్బంది యేమిటి తండ్రీ?

★ **కులజుడు** – అగ్రకుల సంజాతుడు ★ **పొరి** – అధికముగా

సంఖ్య : 255 సంపుటము : 1 పుట: 171 రాగం : లలిత

**64 నీవేకా చెప్పఁజూప నీవె నీవెకా**
**శ్రీవిభుప్రతినిదివి సేనమొదలారి** ॥పల్లవి॥

**నీవేకా కట్టెదుర నిలుచుండి హరివద్ద**
**దేవతలఁ గనిపించే దేవుఁడవు**
**యేవంక విచ్చేసినాను యిందిరాపతికి నిజ-**
**సేవకుఁడవు నీవెకా సేనమొదలారి** ॥నీవే॥

**పసిఁడిబద్దలవారు పదిగోట్లు గొలువ**
**దెసలఁ బంపులువంపేధీరుఁడవు**
**వసముగా ముజ్జగాలవారి నిందరిని నీ-**
**సిసువులఁగా నేలిన సేనమొదలారి** ॥నీవే॥

**దొరలై నయసురుల తుత్తుమురుసేసి జగ-**
**మిరవుగా నేలితి వేకరాజ్యమై**
**పరగుసూత్రవతీపతివై వేంకటవిభు-**
**సిరులపెన్నిధి నీవే సేనమొదలారి** ॥నీవే॥ **255**

**భావవివరముః**

అన్నమాచార్యులవారు ఈ కీర్తనను శ్రీమన్నారాయణుని, సర్వసైన్యాధిపతియైన విష్వక్సేనులవారిపై చెబుతున్నారు. ఓ విష్వక్సేనా! నీవేకదా! చెప్పజూపేది (నిర్దేశించేది). నీవే కదా! శ్రీపతి ప్రతినిధివి. నీవె సేనమొదలారివి (సర్వ సైన్యాధిపతివి). ఓ విష్వక్సేనా! ఎట్టెదుట నిలుచుండి నీవే కదా! హరివద్దకు వచ్చే దేవతలకు తొలిదర్శనమిచ్చేది. ఏవైపునుంచి వచ్చినా, ఇందిరాపతికి మొదటి సేవకుడివి నీవే కదా! పదికోట్లమంది పసిడి బద్దలవారు (బంగారు బెత్తములవారు) నీ అధీనంలో యెప్పుడూ వుంటారు. అన్ని దెసలకు (దిక్కులకు) వారిని పంపి నిర్దేశించే ధీరుడవు నీవేనయ్యా! ముజ్జగాలవారినీ నీ అధీనంలోకి తెచ్చుకొని నీ బిడ్డలవలె కంటికి రెప్పలా కాపాడే సర్వసైన్యాధిపతివి నీవే. దొరలవలె ఇష్టారాజ్యంగాపాలించే దానవులను తుత్తురుము సేసి (ఖండఖండాలుగా జేసి) ఏక ఛత్రాధిపత్యముగా, జగమునంతా సుస్థిరముగా నేలుచున్నావు. సూత్రవతీదేవికి అనుంగు భర్తవైన నీవే శ్రీవేంకటేశ్వరునికి సిరుల పెన్నిధివి. అందులకే నీవు స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడవు.

★ **నీవెకా** – నీవేకదా! ★ **సిశువులగా** – బిడ్డలుగా

సంఖ్య : 367 సంపుటము : 15 పుట: 247 రాగం : శ్రీరాగం

**65 నీవే వచ్చి ప్రత్యక్షమై నిలుతువు గాక మాకు**
**భావించి నిన్ను రూపించి పట్ట నెట్టు వచ్చును** ॥పల్లవి॥

**పాలజలనిధిలోన పండేది నీ కొకచోటు**
**వోలి జీవులలో నెల్లా వుండేది నీ కొకచోటు**
**తేలగిల సూర్యునిలో తిమ్మట నీ కొకచోటు**
**తాలిమి నిన్నెందని వెదకఁగల మిఁకను** ॥నీవే॥

**అనలునిలోపలనారగించే దొకచోటు**
**గొనకొని వైకుంఠానఁ గొలువుండేదొక చోటు**
**పొనుఁగక దాసులిండ్ల బూజఁగొనే దొకచోటు**
**ఘనుఁడ నిన్నుసోదించి కన నెట్టు వచ్చును** ॥నీవే॥

**రతిఁ దులసివనాన రచ్చ సేసే దొకచోటు**
**కతలుగా లక్ష్మితోడ కాఁపురములొకచోటు**
**తతి శ్రీవేంకటాద్రిపైఁ దగఁ గాణాచొక చోటు**
**యితవుగా నీ చొప్పు లెత్తఁగ మా తరమా** ॥నీవే॥ **367**

**భావవివరముః**

సర్వాంతర్యామి అయిన శ్రీహరి యెదురుగా ప్రత్యక్షమై నిలుచుంటే భావించి ఆయన రూపాన్ని పట్టుకోవచ్చునుగాని, లేకుంటే అదెట్లు సాద్యము? అని అంటున్నారు పెదతిరుమలయ్య. ఆయన వుండే చోటుయేది? అని వివరంగా అడుగుతున్నారు? పాలజలనిధి అనే వొకానొక చోట పవ్వళించి వుంటావంటున్నారుకొందరు. జీవులందరిలో ఆత్మరూపివై వుండేదే నీచోటు అంటారు ఇంకొకరు. తెల్లవారిన సూర్యబింబంలోని గమనశక్తి నీవునికి అంటారుమరి కొందరు. శ్రమపడినిన్నెక్కడ వెదకమంటావయ్యా. అగ్నిదేవుడు సర్వభక్షకుడు. ఆయనలోని "ఆరగింపు"నీ ప్రాప్యస్థానమంటున్నారు కొందరు. కాదుకాదు నీవు వైకుంఠపతివి, అదే నీ స్థానమంటున్నారుమరికొందరు. అదేమీ కాదు నీదాసుల హృదయవాసివై వారి ఇండ్లలో పూజలందుకొంటూ వుంటావని మరొకరు అన్నారు. ఓ ఘనుడా! నాబోటి అవిటివాడు యెక్కడని వెదకి నిన్ను పట్టుకోగలడయ్యా? తులసి నీకు ప్రాణప్రదం కాబట్టి తులసీ వనాలలో కొలువై వుంటాడని కొందరు నమ్ముతున్నారు. పురాణ పురుషుడవై లక్ష్మీదేవితో కాపురము చేస్తుంటావంటాడు ఇంకొక సనాతనుడు. శ్రీవేంకటాద్రి నీ కాణాచి (ప్రాప్యస్థానము) అదే నీచోటు అన్నారు చాలా మంది. ఇట్టి నీవు ఇక్కడేవుంటావని నిర్దేశించడం మాతరమా తండ్రీ?

★ **తిమ్మట** – గమనశక్తి ★ **చొప్పులెత్తు** – నిర్దేశించు

సంఖ్య : 487 సంపుటము : I పుట: 136 రాగం : భైరవి

**66** **నీవేమి సేతువయ్య నీవు దయానిధి వందువు**
**భావించలేనివారిపాప మింతేకాని** ॥పల్లవి॥

**పరమపద మొసఁగి పాపమడఁచేనని**
**చరమశ్లోకమునందు చాటితివి తొలుతనె**
**నిరతిని భూమిలోన నీవల్లఁ దప్పు లేదు**
**పరగ నమ్మనివారిపాప మింతేకాని** ॥నీవే॥

**నీపాదములకు నాకు నెయ్యమైన లంకెని**
**యేపున ద్వయార్థమున నియ్యకొంటివి తొలుత**
**దాపుగా నీవల్ల నింకఁ దప్పు లేదు యెంచిచూచి**
**పైపై నమ్మనివారిపాప మింతే కాని** ॥నీవే॥

**బంతిఁ బురాణములను భక్తసులభుఁడ నని**
**అంతరాత్మ నీమాట ఆడితివి తొలుతనే**
**ఇంతట శ్రీవేంకటేశ యేమిసేతువయ్య నీవు**
**పంతాన నమ్మనివారిపాప మింతేకాని** ॥నీవే॥ **487**

**భావవివరముః**

అన్నమయ్య దయానిధియైన శ్రీవేంకటేశ్వరునితో యేమంటున్నారో వినండి. ప్రభూ! నీవు దయానిధివి. నీవు వందువు (నిర్విచారము కలవాడవు). నిన్ను భావింపలేనివారికి యెంత పాపం చేస్తే అంత ఫలితం అనుభవించక తప్పదు. దానికి నీవేమి చేస్తావులేవయ్యా. ఆనాడు భగవద్గీత ఆఖరి శ్లోకంలో నీవేమి చాటి చెప్పావు? "నన్ను ఆశ్రయించినవారి పాపములను అడచి (నిర్మూలించి) పరమపదము వొసగెదనన్నావు" గొప్ప ఆసక్తితో నీవు చెప్పిన ఆ మాటలలో తప్పులేదు. ఆమాటలు నమ్మని దౌర్భాగ్యులు చేసికొనిన పాపానికి నీవేమి చేస్తావు? నీపాదములకు నాకు స్నేహముతో కూడిన లంకె యేర్పడినది. అందుకని అతిశయించిన ద్వయార్థము (శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే) అను మొదటిది, శ్రీమతే నారాయణాయ నమః అను రెండవది ఇయ్యకొంటివి (ప్రసాదించితివి) ఇంత దగ్గరైన నీవల్ల ఏదోషమూ లేదు తండ్రీ! ఆలోచించి చూస్తే నిన్ను నమ్మని పాపాత్ములు చేసికొనిన పాపానికి నీవేమిచేస్తావు? తొలుతనే పురాణములన్నిటిలోను భక్తవత్సలుడవని, జీవులందరి అంతరాత్ముడవని నీమాటగా చెప్పితిని. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇంతకంటె నువ్వు మాత్రం యేమి చేస్తావయ్యా? పంతముతో నిన్నునమ్మని పతితుల పాపానికి నీవేమిచేస్తావయ్యా?

★ **బంతి** – వరుస ★ **నిరతి** – గొప్ప ఆసక్తి

సంఖ్య : 282 సంపుటము : 2 పుట: 186 రాగం : రామక్రియ

**67** నెట్టన శ్రీసతిమగనికి శరణు
దిట్టయై సర్వేశుఁడైన దేవునికి శరణు ॥పల్లవి॥

చెలఁగి జగత్తులకు జీవులకుఁ బ్రాణమై
నెలవై వుండేయాతనికి శరణు
తెలివై మరపై దేహాలలోసూత్రమై
వలనై రక్షించేయట్టివానికి శరణు ॥నెట్ట॥

చక్కఁగా వేదములకు సకలశాస్త్రములకు
నెక్కొని గుఱుతైనవానికి శరణు
దిక్కుదెసయి స్వతంత్రుఁడయి తేరినాదిమూలమై
అక్కజపుమహిమలయాతనికి శరణు ॥నెట్ట॥

యిరవుగఁగరుణించి యిహపరాలొసగేటి -
నిరతిశ్రీవేంకటేశునికి శరణు
గురువై తల్లితండ్రియై గుణము సుజ్ఞానము -
లెరవులేక యిచ్చేటియాతనికి శరణు ॥నెట్ట॥ **282**

**భావవివరముః**

చక్కటి శరణాగతిని వినిపిస్తున్నారు అన్నమయ్య. నెట్టన (తప్పనిసరిగా) శ్రీదేవి మగనికి శరణు వేడుచున్నాను. దిటవుగల సర్వేశ్వరుడు అయిన దేవుడు ఇతగాడేనని శరణు నర్థించుచున్నాను, అని అంటున్నారు. ఈ జగత్తులోని జీవులందరికి ప్రాణమై ఒప్పుచు వారిలో సుస్థిరుడై వుండేవానికి శరణువేడుచున్నాను. దేహధారులందరిలోను సూత్రప్రాయముగ తెలివి, మఱపులను కలిగించుచు వలనై (తోడునీడై) రక్షించే యట్టివానికి శరణు. చక్కగా చతుర్వేదములకు షట్శాస్త్రములకు నెలకొన్న గుఱుతైన వానిని శరణు వేడుచున్నాను. ఆదిమూలమై, సర్వస్వతంత్రుడై, దిక్కుదెసయై అత్యద్భుతమైన మహిమలుగల యాతనిని శరణువేడుచున్నాను. సుస్థిరుడై కరుణించి, ఇహపరములను (ఇహలోకంలో సుఖసంతోషములు, పరలోకంలో ముక్తిని) ప్రసాదించునట్టి శ్రీవేంకటేశ్వరుని శరణుచొచ్చుచున్నాను. నాకు తల్లి, తండ్రి, గురువు కూడా తానేయై నాకు సుగుణములనిచ్చి సుజ్ఞానమును అచ్చముగా ఇచ్చే ఆ దేవదేవుని శరణు వేడుచున్నాను.

★ **నెక్కొని** - నెలకొని ★ **ఎరవులేక** - అచ్చముగా

సంఖ్య : 45 సంపుటము : 2 పుట: 31 రాగం : దేసాళం

**68 నేననఁగా నెంతవాఁడ నెయ్యపు జీవులలోన**
**యీనెపాన రక్షించీ నీశ్వరుఁడేకాక** ॥పల్లవి॥

**యెవ్వరు బుద్ధిచెప్పిరి యిలపైఁ జీమలకెల్లా**
**నెవ్వగఁ బుట్టలఁగొల్చు నించుకొమ్మని**
**అవ్వల సంసారభ్రాంతి అనాదినుండియు లోలోఁ**
**దవ్వించితలకెత్తే యంతర్యామేకాక** ॥నేన॥

**చెట్టుల కెవ్వరు బుద్ధిచెప్పేరు తతికాలానఁ**
**బుట్టి కాచి పూచి నిండాఁ బొదలుమని**
**గుట్టుతో జైతన్యమై గుణములన్నిటికిని**
**తిట్టపెట్టి రచించినదేవుఁ డింతేకాక** ॥నేన॥

**బుద్దు లెవ్వరు చెప్పిరి పుట్టినట్టిమెకాలకు**
**తిద్ది చన్నుదాగి పూరి దినుమని**
**పొద్దువొద్దు లోన నుండి భోగములు మఱపిన-**
**నిద్దపు శ్రీవేంకటాద్రినిలయండేకాక** ॥నేన॥ **45**

**భావవివరముః**

అన్నమయ్య యెంత అద్భుతమైన కీర్తన వినిపిస్తున్నారో ఆలకించండి. దేవుడు లేడనే పిచ్చి వాళ్ళకు ఇది కనువిప్పు. ఇన్ని కోట్ల జీవులలో వొకడినైన నేననగా నెంతవాడను ఈశ్వరా? వీటిని ప్రపంచంలోకి తెచ్చింది నీవే కాబట్టి యీనెపాన అన్నిటినీ రక్షిస్తున్నావు. ఈ భూమిమీద చీమలకు యెవరు బుద్ధి చెబుతున్నారు (నేర్పుతున్నారు)? అవి యెంత చక్కటి పుట్టలు మట్టితో 'గట్టిగా' కట్టుకొంటున్నాయి? ఆ అల్పప్రాణులకు కూడా సంసారభ్రాంతి పెడుతున్నదెవరు? అనాదిగా గతించిన అనేక జన్మలననుభవించిన అంతర్యామి ఆ జీవికి తలకెక్కించకపోతే, ఇది సాధ్యమా? అదటుంచండి, నడిచేశక్తి కూడా లేని చెట్లకు వసంతకాలం రాగానే పుట్టి, పుష్పించి, కాయలు కాచి అతిశయించమని యెవరు నేర్పుతున్నారు. వాటిల్లో చైతన్యమూర్తియై రహస్యంగా తిష్ఠవేసికొని గుణములు కూడా కలిగి (సంగీతానికి చెట్లు పరవశిస్తాయని తెలిసినదే కదా!) అనేక జంతువులనుండి వాటిని రక్షిస్తున్నది సర్వేశ్వరుడు కాక మరి ఇంకొకరెవ్వరు? ఇది ప్రకృతిపని అనే ప్రబుద్ధులారా! కీకారణ్యాలలో పుట్టిన, మెకాలకు (జంతువులకు) తల్లిపాలు త్రాగటం యెవరు నేర్పుతున్నారు?గడ్డితినమని కొన్నిటికీ, ఇతర జంతువులని తినమని మరికొన్నిటికి యెవరు బుద్ధి చెబుతున్నారు? యుక్త వయసు రాగానే భోగించటం యెవరు నేర్పుతున్నారు. స్నేహశీలియైన శ్రీవేంకటేశ్వరుడు కాక, మరెవరు?

★ **నిద్దపు** – స్నేహపాత్రుడైన ★ **బుద్ధిచెప్పేరు** – నేర్పుతున్నారు

సంఖ్య : 22 సంపుటము : XV పుట: 15 రాగం : గుజ్జరి

**69 నేనైతే నీడేరుదు నీకు లీలా మాత్ర మింతే**
**మానక నన్నేలు కొమ్మ మాధవ గోవిందా ॥పల్లవి॥**

**నీవు నన్ను మన్నించితే నీ మహిమలోఁ గొంత**
**యీవల వెలితి యౌనా యీ లోభ మేలా**
**కావించి పాలజలధికడ నొక్క తుంపురు**
**వేవేగ విదలించితే వెలితి యెందులకు ॥నేనై॥**

**వెడకర్మినైనా నన్ను వెనక వేసుకొంటేను**
**గొడవ నీకు వచ్చీనా కొంక నేఁటికి**
**గడుసుదొంగైనవాఁడొకఁడు కొండలో దాఁగితే**
**యెడ మిచ్చినకొండకు హీన మయ్యీనా ॥నేనై॥**

**కందువ శ్రీ వేంకటేశ కరుణారసము నాపై**
**చిందరాదా అనుమాన చింత లేఁటికి**
**యిందరిపై సూర్యుడఁడు యెండలు గాసితేను**
**అందుకొన్న కిరణాలు అరగిపోయీనా ॥నేనై॥ 22**

**భావవివరము:**

చక్కటి ఈ కీర్తనలో పెదతిరుమలయ్య తిరుమలాధీశుని యేమని అభ్యర్థిస్తున్నారో వినండి. ఓ మాధవా! గోవిందా! నాకు ముక్తినొసగుట నీకు లీలామాత్రము (ఒక చిన్నలీల). కానీ నేనైతే ఈ జన్మల చక్రబంధంనుంచి ఈడేరుతాను కదా! కాదనక నన్నేలుకో తండ్రీ! ఇంకా నాకెందుకీ పీడ? స్వామీ! నన్ను మన్నించితే నీమహిమలో కొంత వెలితి అవుతుందా? అయితే మాత్రం నీదేమి పోతుంది? నీకెందుకయ్యా ఈ లోభం? నామాట విను. అంతెందుకు నీపాలసముద్రంలో ఒక తుంపర యెగిరి నావంటి దీనుడిపై పడితే నీ క్షీరసాగరానికి యేమి లోటువస్తుందయ్యా. ప్రభూ! నేను కర్మబద్ధుడను. నిజమే కాని, కాస్త నన్ను వెనకేసుకొనివస్తే నీతో యెవరన్నా గొడవ పెట్టుకొంటారా? మరి ఇంకా నీకు జంకు యెందుకయ్యా. నీవే ఆలోచించు ఒక గడుసరి దొంగ రక్షకభటులనుంచి తప్పించుకోవటానికి కొండగుహలో దాక్కుంటే అది కొండ తప్పా? అందుకే నీవు నావంటి దొంగవెధవని కాపాడినా నిన్ను యెవ్వడూ తప్పుబట్టడు. ఓ శ్రీవేంకటేశ్వరా? కాస్త నీ కరుణ నాపై చిందనీయవయ్యా! నీకు అనుమానం, ఆలోచన యెందుకు తండ్రీ? సూర్యుడి యెండ తుచ్ఛుడిపై పడితే ఆయన కిరణాలు అరిగిపోతాయా?

★ **ఎడమిచ్చిన** – విశ్రాంతినిచ్చిన ★ **కందువ** – అతిశయించిన

సంఖ్య : 373 సంపుటము : I పుట: 249 రాగం : సామంతం

**70 పరుస మొక్కటేకాదా పయిఁడిగాఁ జేసేది**
**అరయ లోహమెట్టున్నా నందుకేమీ** ॥పల్లవి॥

**వనజనాభునిభక్తి వదలకుండినఁ జాలు**
**మనసు యెందు దిరిగినా మరియేమి**
**మొనసి ముద్రలు భుజముల నుండితేఁ జాలు**
**తనువెంత హేయమైనా దానికేమి** ॥పరు॥

**శ్రీకాంతునామము జిహ్వఁ దగిలితే జాలు**
**యేకులజుఁడైనానుహీనమేమి**
**సాకారుఁడైనహరి శరణుచొచ్చినఁ జాలు**
**చేకొని పాపము లెన్ని చేసిననేమి** ॥పరు॥

**జీవుఁడెట్టున్నా నేమి జీవునిలో యంతరాత్మ**
**శ్రీవేంకటేశున కాచింతయేమి**
**యేవలనఁ బరమైన యిహమైన మాకుఁ జాలు**
**కైవశమాయ నతఁడు కడమలింకేమీ** ॥పరు॥ **373**

**భావవివరముః**

భక్తిజాలువారే ఈ కీర్తనలో అన్నమయ్య యెన్నడూ వినని ఒకమాట చెబుతున్నారు. పరుసము (ఏలోహమునైనా తాకినంతమాత్రమున మేలిమి బంగారము చేయు మాంత్రిక విద్య) వొక్కటే కాదా, తాకి పసడి (బంగారం) గా చేయగలిగినది? లోహమెట్లుంటే యేమి? చంచల స్వభావం మనస్సుకు సహజగుణము. వనజనాభుని (విష్ణుని) భక్తి వదలకుండా పట్టుకొంటే చాలు, అది యెంత 'తిరుగుబోతు' అయితేనేమి? రెండు భుజములపై శంఖచక్ర ముద్రలు ధరిస్తే చాలును ఈ శరీరం యెంత తుచ్ఛమైనదైతేనేమి? దీనితోనే హరికృపగాంచవచ్చును. పురాకృతకర్మవలన యేదోవొక కులములో జీవుడి పుట్టుక సంభవిస్తుంది. వాడికి శ్రీహరి నామస్మరణ సిద్ధించి హరినామము నాలుకపై వుంటే చాలు, కులము హీనమైతే నష్టమా? కానేకాదు. తెలిసీ తెలియక నరులు యెన్నో పాపాలు చేస్తుంటారు. నిరాకార పరబ్రహ్మ సాధన బహుకష్టము. అందుకనే సాకార రూపాన్ని భావించి హరిశరణాగతిని పొందితే చాలును పంచమహాపాతకాలైనా పటాపంచలైపోతాయి. జీవునికి గుణగణాలు స్థితిగతులు అన్నీ గతజన్మల కర్మఫలితమే. కాని ఈ జన్మలో వాటి ఫలితములతోఅంతర్యామిగానున్న శ్రీవేంకటేశ్వరునకు ఆ చింత యేమి? మాకు ఇహపరములతో నిమిత్తమేమి? మాకు ఆస్వామి స్వాధీనుడైనాడు మరి ఇక కొరతయేమిటి?

★ **మొనసి** – అతిశయించి ★ **కడమ** – కొఱత

సంఖ్య : 142 సంపుటము : 2 పుట: 95 రాగం : శ్రీరాగం

**71 బిరుదులన్నియు నీవే బిరుదులోకములెల్ల**
**అరయ నీపాదమందె అణఁగుండెఁగాన** ||**పల్లవి**||

**బహుదేవతాసార్వభౌమబిరుదు నీకే**
**సహజము నీవు భూసతిపతివిగాన**
**వహి దేవతాచక్రవర్తి బిరుదు నీకే**
**విహితము చక్రముచే వెలసేవుగాన** ||**బిరు**||

**పెనుదేవశిఖామణిబిరుదు నీకే చెల్లు**
**ఘనకౌస్తుభమణిగలవాఁడవుగాన**
**మును దేవదేవోత్తముఁడనుబిరుదు నీకే**
**ననిచెఁ బురషోత్తమనాముఁడవుగాన** ||**బిరు**||

**వొట్టుకొని దేవరాహుత్తరాయబిరుదు నీదే**
**కిట్టి రాతిగుఱ్ఱము నెక్కితివిగాన**
**తిట్టమై శ్రీవేంకటేశదేవ సింహమవు నీవె**
**అట్టె నారసింహుఁడవై అమరితిగాన** ||**బిరు**|| **142**

**భావవివరముః**

అన్నమయ్య ఈ కీర్తన పల్లవిలో యేమంటున్నారో వినండి. ఓ సర్వేశ్వరా! బిరుదులన్నియు నీవే (సామర్థ్యం అంతా నీదే) బిరుదు లోకములు (సుప్రసిద్ధమైన చతుర్దశ భువనాలన్నీ) నీవే (నీకు చెందినవే). నిశితముగా చూస్తే అన్నీ నీ పాదము క్రిందనే అణగివున్న విశ్వరూపుడవు నీవు. దేవతలందరి సార్వబౌముడవనే బిరుదు నీకే తగినది. సహజముగానే నీవు భూసతీపతివి కదా! వహించుకొని దేవతా చక్రవర్తి అనే బిరుదుకు కూడా నీవే అర్హుడవు. వారిని సదా రక్షించే చక్రమును ధరించి వుందువు కదా! గొప్పదైవ శిఖామణి అనే బిరుదునకు కూడా నీవే అర్హుడవు. ఎందుకంటే ఘనమైన కౌస్తుభమణి గల విష్ణుమూర్తివి నీవే కదా! అనాదిగా నీకున్న దేవదేవోత్తముడవనే బిరుదుకు కూడా నీవే తగినవాడవు. ఎందుకంటే వేదములన్నీ ప్రస్తుతించేది పురుషోత్తముడవని నిన్నే కదా! స్వామీ! దైవాశ్వమైన ఉచ్ఛైశ్రవము నెక్కి వేటకు వెళ్ళి పద్మావతీదేవిని వలచావు. కావున నీకు “దేవరాహుత్తరాయుడు” (దైవాశ్వము యొక్క రౌతు) అనే బిరుదు తగినదే. ఎందుకంటే రాతిగుఱ్ఱము (కఠినమైన అశ్వము) నెక్కినవాడవు కదా! ఓ శ్రీవేంకటేశ్వరా! “దేవసింహము” అనే గొప్ప బిరుదూ నీ స్వంతమే. ఎందుకంటే దివ్యనారసింహుడవు నీవే కదా!

★ **కిట్టి** – చేరువయైన ★ **వహి** – తాల్చి

సంఖ్య : 25 సంపుటము : XV పుట: 17 రాగం : భూపాలం

**72 భారము నీపై వేసి బ్రదికియుండుటే మేలు**
**నారాయణుఁడ నీవే నాకుఁ గలవనుచూ ॥పల్లవి॥**

**శరణన వెరపయ్యీ సామజముఁ గాచినట్టు**
**వరుస దావతిపడి వచ్చేవంటా**
**హరి కృష్ణ యన వెరపయ్యీ ద్రౌపదివర**
**మిరవుగ విచ్చినట్టు యిచ్చేవో యనుచు ॥భార॥**

**చేత మొక్క వెరపయ్యీ చీర లిచ్చి యింతులకు**
**బాఁతిపడ్డట్టే నన్నుఁ బైకొనే వంటా**
**ఆతల నమ్మఁగ వెరపయ్యీఁ బాండవులవలెఁ**
**గాతరాన వెంట వెంటఁ గాచియుండే వనుచు ॥భార॥**

**ఆరగించుమన వెరపయ్యీ శబరివలె**
**ఆరయ నెంగిలి యన కంటే వంటా**
**యేరీతి నన వెఱతు యిచ్చైనట్లుఁ గావు**
**కూరిమి శ్రీ వేంకటేశ గోవులఁగాచినట్లు ॥భార॥ 25**

**భావవివరముః**

పెదతిరుమలయ్య ఒక గొప్ప సత్యాన్ని ఆవిష్కరిస్తున్నారు ప్రభూ! మావంటి శరణార్థులకు భారమంతా నీపైనేవేసి నిశ్చింతగా బ్రతుకుటయే మేలు నారాయణుడా నీవొక్కడవే నాకు గలదిక్కు అంటే చాలు గజేంద్రుని, ద్రౌపదిని, గోపికలని, పాండవులని, శబరిని పరుగున వచ్చి రక్షిస్తాడు. కాని గోవిందా వారందరిలా ఆపదలో వచ్చి కాచినచో నాకు తృప్తి లేదు. నిరంతరమూ గోవులను గాచినట్లు నీకంటి రెప్పలా కాపాడవయ్యా! అంటున్నారు. కాకపోతే నావెరపు (భయము) వొక్కటే ఇప్పుడు తిరుమలయ్యగా నీశరణాగతులు ఇబ్బడి ముబ్బడయ్యారు. ఇంతమందిని యెలా రక్షిస్తావో అని వెరపయ్యీని. ఆనాడు దావతిపడి (దుఃఖార్తి) వచ్చి గజేంద్రుని కాచినావు, కృష్ణా నీవే దిక్కు అన్న ద్రౌపది మానసంరక్షణ చేశావు. చేతులెత్తి మొక్కుదామా అంటేగోపికల సిగ్గు చిదిమినట్లు నాసిగ్గూ దోచుకుంటావేమోనని భయం వేస్తోంది. నమ్మిన వారిని వెం వెంట తిరిగి కాచెదవనుమాట నిజమే కాని పాండవులవలె అన్ని తిప్పలు పడాలా అని భయం వేస్తోందయ్యా! పోనీ నీకేదన్నా నివేదన చేసి తిను ప్రభూ! అనాలంటే భయం వేస్తోంది. శబరిలా చూస్తూ చూస్తూ నీకు యెంగిలి పెట్టలేనుకదా! చివరికి నీవే శ్రీవేంకటేశ్వరుడవై నాకనులముందు నిలిచావు. పైవారిలో యెవ్వరిలా కాపాడమని అడుగాలన్నా భయం వేస్తోంది. అందుకని నన్నునీ గోశాలలో గోవును గాచినట్లు కాస్తే చాలు తండ్రీ!

★ **కాతరాన** – అధీనుడవై ★ **సామజము** – ఏనుగు

సంఖ్య : 200 సంపుటము : 2 పుట: 134 రాగం : దేసాళం

**73 భావించలే రెవ్వరును బయలువాఁకేరుగాని**
**నీవే గుఱుతు మాకునీరజనాభా** ॥పల్లవి॥

**కైవల్య మెట్టుండునో నిక్కపుజ్ఞాన మెట్టుండునో**
**దైవిక మెట్టుండునో తలఁచరాదు**
**జీవన మెట్లనుండునో చిత్త మేరీతినుండునో**
**ఆవిధ మెవ్వరి కిట్టట్టనఁగరాదు** ॥భావి॥

**వేదము లెట్టుండునో విరతి యెట్టుండునో**
**ఆది నంత మెట్టుండునో అరయరాదు**
**భేద మనే దెట్టుండునో అభేద మది యెట్టుండునో**
**సోదించి యెవ్వరికిని చూడఁగరాదు** ॥భావి॥

**ఫల మెట్లానుండనో భక్తి యెట్లానుండునో**
**తెలివి యెట్టుండునో సాధించఁగరాదు**
**యిలపైశ్రీవేంకటేశ యిటు నీశరణుచొచ్చి**
**నిలుకడై వున్నారము నీకృప యిఁకను** ॥భావి॥ **200**

**భావవివరముః**

ఈ కీర్తనలో అన్నమయ్య యెంత తెగవేసి చెబుతున్నారో చిత్తగించండి. ఓ నీరజనాభా! కవులు, గాయకులు, పండితులు యేవేవో బయలువాఁకేరు(పైకి చెబుతుంటారు). కానివారెవ్వరూ ఆమాటల నిజమైన అర్థాన్ని భావించలేరు. మేము కూడా అంతేనయ్యా! కాని మాకునీవే గుర్తు. నీభావనే గుర్తు. నీ శరణాగతియే గుర్తు. మోక్షమనేది యెట్లావుంటుందో, నిజమైన జ్ఞానముఅంటే యేమిటో, దైవికము (విధి) యెట్లుండునో భావించుట యెవరి తరము? ముందు జరుగబోయే జీవనమెట్లా వుంటుందో, మనస్సుయెప్పుడెట్లా వుంటుందో ఆ విధము ఇట్లా వుంటుంది – అట్లా వుంటుందని యెవ్వరూ చెప్పలేరు. ఇక పండితులను చూడండి. వేదములేమి చెబుతున్నాయో, అసలైన విరతి (విరక్తి) అంటే యేమిటో నిజంగా తెలియరాదు. ఆత్మ పరమాత్మల మధ్య భేదమేమిటో – అవి రెండూ అభేదమని యెందుకంటారో యెవ్వరికీ తెలియదు. ఎంత శోధించినా ఇవి యేనాటికీ పూర్తిగా అవగతం కాదు. దేవా! ఫలము (కర్మఫలం) యెట్లావుంటుందో, దైవ భక్తి యెట్లా వుంటుందో యుక్తాయుక్త విచక్షణ నెరిగే తెలివి యెట్లా వుంటుందో సోధించి సాధించలేము. ఇక మాకు ఒక్కటేగతి ఓ శ్రీవేంకటేశ్వరా! అదేనీ శరణాగతి. చేతులు మోడ్చి నీయెదుట నిలబడివున్నారము. ఇక నీదయ, మా ప్రాప్తము తండ్రీ!

★ **భేదము** – ఒక్కటికాకుండుట ★ **తెలివి** – వివేకము

సంఖ్య : 415 సంపుటము : 1 పుట: 278 రాగం : లలిత

**74 మా కెల్ల 'రాజానుమతో ధర్మ' యిది నీ -**
**యీకడఁ గలుగుట కేమరుదు** ॥పల్లవి॥

**అలగరుడగమన మహిశయనంబును**
**కలిసి నీయందె కలిగెనటా**
**పొలసినపాపముఁ బుణ్యము నరులకు**
**యెలమిఁ గలుగుటకు నేమరుదు** ॥మాకె॥

**యిదె నీడకన్ను యెండకన్ను మరి**
**కదిసి నీయందె కలిగెనట**
**సదరపునరులకు జననమరణములు**
**యెదురనె కలుగుట కేమరుదు** ॥మాకె॥

**శ్రీకాంతఒకదెస భూకాంత ఒకదెసకదెన**
**కైకొని నీకిటు గలిగెనట**
**యీకడ శ్రీవేంకటేశ యిహపరము**
**యేకమై మా కగు టేమరుదు** ॥మాకె॥ **415**

**భావవివరముః**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో "యేమరుదు" అనే పదము పలుమార్లు ఉపయోగించబడింది. నేటి భాషలో చెప్పాలంటే "యేమి వింత" అని అర్థం. మాకందరికీ "రాజానుమతేధర్మము". నీవు సర్వేశ్వరుడవు. ఈ ధర్మం నీకు వర్తించటంలో వింతేమి వున్నది? అలగరుడగమనుడవు. బొల్లి గద్ద నెక్కి తిరుగుతావు. ఇక నీ శయనము చూద్దామా అంటే పాముమీద. ఈ రెండు దోషాలూ నీయందే వున్నవి. ఇంతా చేసి పాపపుణ్యాలు, మా నరులకు మాత్రమేనా స్వామీ? అవి మాకే కలుగుటలో ఆశ్చర్యమే లేదు. ప్రభూ! నీవు విశ్వరూపుడవు. నీకు ఒక కన్ను అమృతంకురిపించే (వెన్నెల, ఓషధుల రూపంలో) చంద్రుడు. నీకు మరొక కన్ను పంటలకాధారమైన సూర్యుడు. నీవు కళ్ళు మూసికొన్నావంటే జీవకోటి యేమవుతుంది? కొఱతలేక జనించే నరుల జననమరణములు నీకళ్ళెదురుగానే జరుగుటలో ఆశ్చర్యమేమున్నదయ్యా? నీకు ఒకవైపు శ్రీకాంత, మరొకవైపు భూకాంత ఒత్తుకొన్నట్లు నీచేతులలో అమరియున్నారు. ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ విధముగా ఇహపరములు రెండూ నీ చేతులలోనే వున్నవి. మేము నీదాసులము. మరి మాకు ఆ రెండూ (ఇహపరములు) కలుగుటలో ఆశ్చర్యమేమున్నది తండ్రీ?

★ **సదరము** – కొఱతలేక ★ **కైకొని** – స్వీకరించి

సంఖ్య : 242 సంపుటము : XV పుట: 163 రాగం : రామక్రియ

**75 మానరాని చుట్టమవు మధుసూదనా నీ**
**మానినిఁ జుమ్మీ నేను మధుసూదనా** ॥పల్లవి॥

**మఱువకుమీ మా పొందు మధుసూదనా యింకా**
**మఱుఁగులేని మనకు మధుసూదనా**
**మఱి యేమి చెప్పేవు మధుసూదనా యే-**
**మఱక మ మ్మేలుమీ మధుసూదనా** ॥మాన॥

**మడచి యా కిచ్చె నింద మధుసూదనా మేన**
**మడుగులాయె చెమట మధుసూదనా**
**మడిదొసకులు గావు మధుసూదనా నాకు**
**మడుక పన్నాయె మేలు మధుసూదనా** ॥మాన॥

**మందెమేళ మాయె రతి మధుసూదనా గొల్ల-**
**మంద లెల్ల నీసుద్దులే మధుసూదనా**
**మందు చల్లి కూడితివి మధుసూదనా మా**
**మందిరము శ్రీవేంకటమధుసూదనా** ॥మాన॥ **242**

**భావవివరముః**

పెదతిరుమలయ్య శ్రీకృష్ణుని మధుసూదనునిగా కీర్తిస్తూ ఈ పాట చెబుతున్న గోపికయైనారు. అధ్యాత్మ కీర్తనల సంపుటిలో ప్రచురించబడిన శృంగారకీర్తన ఇది. ఏమంటున్నారో చిత్తగించండి. ఓ మధుసూదనా! నీవు మానరాని చుట్టమవు (వదల లేని మనోవల్లభుడవు). నేను నీమానినినే సుమా! నన్ను మరువ భావ్యం కాదయ్యా మధుసూదనా! ప్రభూ! మా పొందును యెన్నటికీ మఱువకుము. ఇకపైను మఱుగులేని (దాచవలసినదేమీలేని) మన గురించి ఇంకా యేమి చెప్పెదవు? ఓ మధుసూదనా! యేమఱక (మరవక) మమ్మేలుకోవయ్యా! ఇంద నీకు మడిచి యాకిచ్చేను (ఆహ్వాన తాంబూలం ఇస్తున్నాను) తీసికోవయ్యా! మధుసూదనా! దీనికే నా మేను మొత్తం చెమటలతో మడుగులు కట్టింది. నా కష్టాలు పరిమితి వున్నవి కావయ్యా మధుసూదనా! నేను నీకు చేసిన మేలు, మడకపన్నాయెనయ్యా! (జేనెడుమాత్రంగా మిగిలిపోయిందయ్యా!) ఓ మధుసూదనా! నీరతి మందమేళమైనదయ్యా! (నాకు గర్వము కలిగించుచున్నది). గొల్లమందలలో యెక్కడ వినినా నీ గురించే చెప్పుకొంటున్నారు. నాపై మందు చల్లి కూడితివా యేమి? మామందిరము వేంకటమధుసూదనుని ఆలయమే సుమా!

★ **దొసకులు** – కష్టాలు ★ **సుద్దులు** – సంగతులు

సంఖ్య : 466 సంపుటము : I పుట: 317 రాగం : భైరవి

**76 మొదలుండఁ గొనలకు మోచి నీళ్ళువోయనేల**
**యెదలో నీవుండఁగా నితరములేలా** ॥పల్లవి॥

**నిగమమార్గముననే నడచేనంటే**
**నిగమములెల్లను నీమహిమే**
**జగములోకులఁ జూచి జరగెదనంటే**
**జగములు నీమాయజనకములు** ॥మొద॥

**మనసెల్ల నడ్డపెట్టి మట్టున నుండేనంటే**
**మనసుకోరికలు నీమతకాలు**
**తనువు నింద్రియములు తగ గెలిచేనంటే**
**తనువు నింద్రియములు దైవమ నీమహిమ** ॥మొద॥

**యింతలోనిపనికిఁగా యిందు నందుఁ జొరనేల**
**చెంత నిండుచెరువుండ చెలమలేలా**
**పంతాన శ్రీవేంకటేశ పట్టి నీకే శరణంటి**
**సంతకూటాలధర్మపుసంగతి నాకేలా** ॥మొద॥ **466**

**భావవివరముః**

అద్భుతమైన ఈ కీర్తనలో అన్నమయ్య యేమని అంటున్నారో ఆలకించండి. ఓదేవదేవా! యెవడైనా నీళ్ళుమోసికొని వచ్చి చెట్టు మొదలులో వేళ్ళు తడిసేటట్టు పోస్తాడు గాని కొమ్మల చివరలకు నీల్ళుపోస్తాడా? యెదలో నీవుండగా మోక్షసాధనకు ఇతరమార్గములెందుకయ్యా? వేదమార్గములో నడచి నిన్ను చేరుదామా అంటే వేదములుద్భవించినదే నీ మహిమ వలన. జగములోనున్న లోకులను చూచి నేర్చుకొని నేనూ అట్లాగే జరిపెదనులేనని అనుకొంటే ఈ జగత్తే నీమాయా జనితము నా మనస్సును అడ్డుపెట్టుకొని అణగిమణగి వుందామంటే మనస్సేమో కోరికలతో విజృంభిస్తూ వుంటుంది. మరి వీటినేమనుకోవాలి? ఇవన్నీ నీమతకాలే (నీ మాయలే సుమా!) పోనీ నాతనువును నా చెప్పు చేతల్లో వుంచుకొని ఆవిధంగా ఇంద్రియాల మీద గెలుపు సాధిద్దామా అంటే ఈ తనువూ ఇంద్రియాలు నీమహిమవలననే సృజించబడి నీ అధీనములోనే వుంటాయి. నీ శరణాగతితో యేదియైనా సానుకూలమవుతుంది. అటువంటప్పుడు వీరిని వారిని ఆశ్రయించుట ఎందులకు? నిండుగా వున్న చెఱువు చెంతనుండగా ఎవరన్నా చిన్న చిన్న నీటి చెలమల కోసం ఆశిస్తారా? ఓ శ్రీవేంకటేశ్వరా! పంతముతో నేను నీ శరణార్థినైతిని, సంతకూటములలోని పలకరింపు సంబంధాల వంటివి నాకేల నాకు నువుంటే చాలును.

★ **నిగమమార్గము** – వేదమార్గము ★ **చెలమలు** – నీటిగుంటలు

సంఖ్య : 254 సంపుటము : 1 పుట: 170 రాగం : దేవగాంధారి

**77 లేదు బ్రహ్మవిద్యామహాసుఖము తమ-**
**కీడు తమకర్మ మేమిసేయఁగవచ్చు** ॥పల్లవి॥

**నానావిధులఁ బొరలి నరుఁడు దానై వివిధ-**
**మైనకర్మములే అనుభవించి**
**లేనిలంపటములకు లోనై దురితా-**
**ధీనులై క్రమ్మరఁ దిరిగిపోవుటేకాని** ॥లేదు॥

**పరగ నిన్నిటఁబొడమి బ్రాహ్మణుఁడై**
**సరిలేనివేదశాస్త్రములు చదివి**
**అరుదయినకాంక్షచే నతిపాపపరులై**
**వెరవునఁ బొడవెక్కి విరుగఁబడుటేకాని** ॥లేదు॥

**చేరనిపదార్థములే చేరఁగోరుటగాని**
**చేరువనే యామేలు సిద్ధింపదు**
**ధీరులై తమలోనఁ దిరువేంకటేశ్వరునిఁ**
**గోరి యిటు భజియింపఁగూడు టెన్నఁడుగాన** ॥లేదు॥ **254**

**భావవివరము:**

అన్నమయ్య ఈ కీర్తనలో "బ్రహ్మవిద్యను" (పరబ్రహ్మ తత్త్వము నెఱుగుట) నేర్చినందువలన మహాసుఖము యేమి దక్కుతుంది? ఎవ్వరికైనా తమ పురాకృత కర్మవలన కలిగే కీడును అనుభవించక తప్పదు. దాన్ని యేమి చేయగలము అంటున్నారు. దుర్లభమైన నరజన్మ పొంది కూడా వీడు నానా విధములుగా బ్రతికి, అనేక పురాకృత కర్మలననుభవించి, లేని లంపటాలను తగిలించుకొని ఎన్నో దురితములకు (పాపములకు) అధీనుడై మళ్ళీ ఇంకొక జన్మ యెత్తటానికి సిద్ధమౌతాడు కాని వీడికి బుద్ధి వచ్చే దారియేది? సరే! వీడు యెన్నో జన్మలు పొంది పరమాత్మ కృపవలన వేదాధ్యయనం చేయుటకు సానుకూలమైన బ్రాహ్మణ జన్మ పొందుతాడు. ఎన్నడో విద్యాదానం చేసివుంటే వేదము కూడా వస్తుంది. కాని కాంక్ష (కోరిక) వీడిని వదలదే. దాని వలన మళ్ళీ పాపాలు చేస్తుంటారు. దానితో వెరవున (జీవనగమ్యంలో) అతిశయముతో విఱ్ఱవీగి పాపాత్ములైపోతారు. వీళ్ళు అవధానులైనా, సోమయాజులైనా, దీక్షితులుయైనా వొరిగేదేమీ వుండదు. తాకకూడని పదార్థాలను తాకే వారికి, వాటిని పొందినా ఫలితం సిద్ధించదు. మరి యెందుకా తిప్పలు? హాయిగా శ్రీవేంకటేశ్వరుడు తమలోనే తిరుగుటను గ్రహించి, కోరి ఇటు భజించుటకు యెన్నడు సిద్ధపడతాడో కాని అందాకా... ఇదింతే.

★ **పొడవెక్కి** – అతిశయించి ★ **లంపటము** – శ్రమపెట్టే అనుబంధం

సంఖ్య : 244 సంపుటము : XV పుట: 165 రాగం : పాడి

**78** **వద్దు వద్దు సట లింక వామనా నీ**
**వద్దనే వున్నార మిదె వామనా** ॥పల్లవి॥

**వరుసలు వెదకేవు వామనా నీవు**
**వరుఁడ విందరికిని వామనా**
**వరవాత వలపించి వామనా దే-**
**వరవలె నున్నాఁడవు వామనా** ॥వద్దు॥

**వనము కోగిల వైతి వామనా నీకు**
**వనితలు బాఁతి వామనా**
**వనరేరు గొల్లెతలు వామనా కా**
**వను వేళ చూచుకోమీ వామనా** ॥వద్దు॥

**వాడవారు మొక్కేరు వామనా నీకు**
**వాడుదేరె కెమ్మోవి వామనా**
**వాడికె శ్రీవేంకటాద్రివామనా**
**వాడేచెలమవు నీవు వామనా** ॥వద్దు॥ **244**

**భావవివరముః**

గొల్లెతలు"వామన" అని నందగోపనందునిని సంబోధిస్తున్నట్లు కీర్తన చెబుతున్నారు పెదతిరుమలయ్య పైగా స్వామిని సటకాడు (కపటుడని) గొల్లెతల చేత అనిపిస్తున్నారు. ఓ వామనా! నీ కపటములు ఇకపై వద్దే వద్దు. మేము నీవద్దనే వున్నారముకదా! అంటున్నారు. ఓ వామనా! కొత్తపడుచు కంటపడితే చాలు, దానితో వరుసలు కలుపుతావు. ఇంతమందికీ నీవే వరుడవా? వరవాత (తెల్లవారిందంటే) నీ వలపించుట మొదలవుతుంది. మా అందరికీ దేవరవలె (మరిదిగారి) వలె వున్నావే? నల్లని నీవు మధురంగా మురళీనాదం చేస్తుంటే వనములో కోయిల కూజితము చేస్తున్నట్లున్నదయ్యా! వామనా! నీకు మావంటి గొల్లవనితలపై ఇంత బాఁతి (భ్రాంతి) యెందుకు? చెప్పు వామనా! నీవిలా యాగీ చేస్తుంటే గొల్లెతలు వనరేరయ్యా (విలపించెదరయ్యా!) నీవు వారికేమి కావు అనేవేళ వోవామనా! వారి ఆవేదన చూచి తీరవలసిందే. నీకు వాడలోని వారంతా మ్రొక్కెదరయ్యా! ఓ వామనా! నీ అరుణాధరాన్ని వొక్కసారి చూచుకొనవయ్యా. అది వాడిపోయి వున్నది. నీవు అలవాటైన మా శ్రీవేంకటేశ్వరుడవు, వామనా! నీవువాడే (సర్వులూ వుపయోగించే)చెలమవు (సరోవరానివి) మా అందరి పాలిటి వరానివి.

★ **వాడవాడ** – గొల్లవాడలోనివారు ★ **వనముకోగిల** – తోటలోని కోయిల

సంఖ్య : 368 సంపుటము : XV పుట: 247 రాగం : శ్రీరాగం

**79 వామన నృసింహ వాసుదేవ హరి**
**నీ మహిమఁ గదా నిర్మలు లైరి ॥పల్లవి॥**

**సనకసనందన సనత్కుమారులు**
**సనత్సుజాతాదిసంయములు**
**వినయముతో ధ్రువవిభీషణాదులు**
**నినుఁ గొలిచి కదా నిర్మలు లైరి ॥వామన॥**

**నారదశుక శౌనకహనుమంతులు**
**పారాశర్య ప్రముఖులును**
**ధారుణి రుక్మాంగద ప్రహ్లాదులు**
**నీ రచనఁ గదా నిర్మలు లైరి ॥వామన॥**

**కరిపుండరీక గాంగేయవసిష్ఠు**
**లరిది నంబరీషార్జునులు**
**యిరవుగ శ్రీవేంకటేశ నీ పాదములు**
**నిరతిఁ గని కదా నిర్మలు లైరి ॥వామన॥ 368**

**భావవివరము:**

నిర్మలులు అంటే అరిషడ్వార్గాలవంటి, మలినములు లేని మహాత్ములు అని అర్థం. పెదతిరుమలయ్య మహాత్ములందరికీ ఆ నిర్మలత్వం నీ మహిమవల్లనే వచ్చిందని కీరిస్తున్నారు. ఓ వామనా! నృసింహా! వాసుదేవా! శ్రీహరీ! ఇదంతా నీ అనుగ్రహమే అంటున్నారు. సనకుడు, సనందుడు, సనత్కుమారుడు, సనత్సుజాతుడు (ఈ నలుగురినే సనక సనందనాది ఋషులు అంటున్నారందరూ) మొదలైన మహామునులు; ధ్రువుడు, విభీషణుడు వంటి నీ ప్రియ భక్తులు వినయముతో నిన్ను అలరించే కదా! నిన్ను కొలిచి నిర్మలులైరి. నారదుడు, శౌనకుడు, హనుమంతుడు, పరాశరుడు (వ్యాసుడు), మొదలైన ప్రముఖులు; రుక్మాంగదుడు, ప్రహ్లాదుడు వంటి నీ శరణాగతులు ఈ ధాత్రిపై నీ లీలలవల్లనే కదా! నిర్మలులైరి. ఓ ప్రభూ! కరి (గజేంద్రుడు), పుండరీకుడు, గాంగేయుడు (గంగా సుతుడైన భీష్ముడు), రామచంద్రుని గురువైన వశిష్ఠుడు, దూర్వాసుని నిగ్రహించిన అంబరీషుడు, నిన్నే తన సారథిగా బొందిన అర్జునుడు నీ పాదములనే నిరతితో దర్శించే నిర్మలులైరి. ఓ శ్రీవేంకటేశ్వరా! ఆనాడు వారివంటి నిర్మలులనే కాదు, ఈ నావంటి ఆర్తులనూ ఆదుకొంటున్నావు. ధన్యుడను తండ్రీ!

★ **సంయములు** – హింసావిదూరులైన మునులు ★ **అరిది** – దుర్లభమైన

సంఖ్య : 378 సంపుటము : XV పుట: 255 రాగం : లలిత

**80 విచారపరులాల వివేకులాల**
**పచరించి తెలిసి యాపగిది నడవుఁడీ ॥పల్లవి॥**

**చేసినపుణ్యమువల్ల చెలఁగి దేవత లైరి**
**ఆసరిఁ బాపమువల్ల నసుర లైరి**
**దాసరితనమువల్లఁ దగ నారదాదులైరి**
**వాసి నిందెవ్వ రెక్కుడొ వడి నెంచు కొనుఁడీ ॥విచార॥**

**ఘనరాజసగుణాన కలుగు నిహలోకము**
**అనిశముఁ దామసాన నధోగతి**
**మొనసి సాత్త్వికమున మోక్షము సిద్ధించు**
**ననుపమ పదమేదొ అది యెంచుకొనుఁడీ ॥విచార॥**

**పరగ దేహమూలము ప్రాకృతమయిన మాయ**
**అరసి యాత్మ నీడేర్చు నలమేల్మంగ**
**సిరుల నంతర్యామి శ్రీవేంకటేశ్వరుఁడు**
**సరి నిందు మీ బ్రదుకుజాడ యెంచుకొనుఁడీ ॥విచార॥ 379**

**భావవివరము:**

పెదతిరుమలయ్య ఈ కీర్తనలో తత్త్వవేత్తలను జ్ఞానులను ఆలోచించి ఆ విధముగా నడవండయ్యా! అని, ఆనాటి తెలుగులో ఉద్బోధిస్తున్నారు ఆలకించండి. విచారపరులుకానివారికి వినినా లాభమేమీలేదనే కవి వుద్దేశ్యం. భగవంతుడే మూలాధారము. జీవులని సృష్టించి గుణములను, అంతరంగమును ఇచ్చాడు. వాటితో పుణ్యము చేసినవారు దేవతలైనారు. పాపము చేసినవారు రాక్షసులైనారు. ఆయనదాస్యము చేసిన వారు నారదాది మునులైనారు. ఎవరెక్కువ, యెవరు తక్కువ? మీరే యెంచుకొనండి. అయ్యా! గుణాలు త్రిగుణాత్మకము. రాజసుగుణమున్నవారు కర్మిష్ఠులై ఇహలోకములోనేతగిన జన్మలను పొందారు. ఇక తామస గుణమున్నవారు అధోగతినొంది పాతాళాది లోకములను పొందారు. సాత్త్విక గుణమున్నవారికి ఊర్ధ్వలోకాలు లభించి అంచెలంచెలుగా మోక్షం పొందుతారు. మరి ఇందులో సరియైన పదమేదో మీరే యెంచుకోండి. కాబట్టి జీవుడికి దేహమురాంగానే మాయాదేవి (స్వామి చెల్లెలు) పట్టుకొని కర్మలు చేయిస్తుంది. ఆయన భార్య అలమేల్మంగమ్మ సిరులనిచ్చి పరీక్షిస్తుంది. అంతర్యామిగా శ్రీవేంకటేశ్వరుడు చూస్తుంటాడు. ఇకపై మీ బ్రతుకు జాడ మీరే యెంచుకోండి.

★ **దాసరితనము** – దాస్యము ★ **పచరించి** – ప్రసారించి

సంఖ్య : 1 సంపుటము : 2 పుట: 1 రాగం : కాంబోది

**81 విచారించు హరి నావిన్నప మవధరించు**
**పచారమే నాదిగాని పనులెల్లా నీవే** ॥పల్లవి॥

**తనువు నాదెందుఁగాని తనువులోనింద్రియములు**
**అనిశము నాచెప్పినట్టు సేయవు**
**మనసు నాదెందుఁగాని మర్మము నాయిచ్చ రాదు**
**పనివడి దూరు నాది పరులదే భోగము** ॥విచా॥

**అలరి నానిద్దుర నాదెందుఁగాని, సుఖమెల్ల**
**కలలోని కాఁపిరాలకతలపాలె**
**తెలివి నాదెందుఁగాని దినాలు కాలముసొమ్ము**
**యెలమిఁ బేరు నాది యెవ్వరిదో బలువు** ॥విచా॥

**కర్మము నాదెందుఁ గాని కర్మములోఫలమెల్ల**
**అర్మిలి నాజన్మముల ఆధీనమె**
**ధర్మపు శ్రీవేంకటేశ దయానిధివి నీవు**
**నిర్మితము నీ దింతే నేరుపు నీమాయది** ॥విచా॥ **1**

**భావవివరముః**

అన్నమయ్య శ్రీహరికి యెంత నిర్ద్వందంగా విన్నవించుకొంటున్నారో చిత్తగించండి. ఓ శ్రీహరీ! నా మనవి స్వీకరించి ఒక్కసారి ఆలోచించవయ్యా! నిజానికి పనులన్నీ నీవే. ఈ కీర్తనలు నేను చెబుతున్నానా? ఎంతమాత్రమూ కాదు. కేవలం పచారమే (నటనే) నాది. నీమాయ మాబోటి తెలివి తక్కువవాళ్ళకెలా తెలుస్తుంది? ఈ తనువు (శరీరం) నాదే. కాని దీనిలో ఒక్క ఇంద్రియమూ,యెన్నడూ, నామాట వినదు. ఈ మనస్సు నాదే కాని దీని మర్మమేమిటో నేనెఱుగను. నా కోరికను దేనినీ అది అంగీకరించదు. దీని ప్రవర్తనవలన తిట్లు నేను తింటున్నాను, పరులు సుఖిస్తున్నారు. పోనీ మనస్సు ఇంద్రియాలే చెడ్డవి అనుకోవటానికి లేదు. తిప్పలు పడి నిద్ర పోతున్నది నేను. కాని ఆ నిద్ర సుఖం అనుభవిస్తున్నవాడు నా జీవుడు. నిద్రలో కలవస్తే, ఆ కలలో కాపురం చేసేవాడు జీవుడే కాని నేననిద్రపోతూనేవున్న శవాన్నే కదా! నా జీవితంలో గడుస్తున్న కాలమూ నాచేతిలో లేదు. ఎన్నిరోజులు గడుస్తున్నాయో తెలుస్తున్నది కాని యెన్ని గడుస్తాయో కాలము మాత్రమే చెప్పగలదు. పేరు మాత్రమే నాది. బలువు (శక్తి) నీదే. కర్మములు చేస్తున్న వాడను నేనే, కాని దీని ఫలము అపేక్షతో అనుభవించేది మాత్రం నా రాబోయే జన్మలు. ధర్మమూర్తివైన వో శ్రీవేంకటేశ్వరా! నీవూ నాలాగుననే అన్నీ నీ నిర్మితము అనిపించినా, నీవు కేవలం సాక్షివి. నేర్పంతా నీమాయదే.

★ **కాపిరాల** – సంసారము ★ **అర్మిలి** – ఆపేక్ష

సంఖ్య : 57 సంపుటము : I పుట: 38 రాగం : శ్రీరాగం

**82 విడుమనవో రోలు విడుమనవో వేగ**
**విడుమనవో తల్లి వెఱచీ నీబాలుడు ॥పల్లవి॥**

**యెన్నఁడు గొల్లెతలయిండ్లు వేమారుఁ జొచ్చి**
**వెన్నలుఁ బాలును వెఱఁజఁడు**
**వన్నెలనీకోప మింత వద్దు నీకు నీయాన**
**కన్నులనవ్వుల ముద్దుగారీ నీబాలుడు ॥విడు॥**

**సారెకు పెరుగులచాడెలూ నేఁడుమొదలూ**
**గోరయై కోలలఁ బగులమొత్తఁడు**
**కూరిమిలేక నీవు కోపగించcగాఁ గన్నీరు**
**జోరునా రాలఁగా నిన్నే చూచీ నీబాలుఁడు ॥విడు॥**

**చాలు నీకోప మిది సరిలేనిమద్దు లివి**
**రోలనేయిట్లను విరుగఁద్రోయఁడు**
**మేలిమివేంకటపతి మేఁటినీకొమారుఁ డిదె**
**కేలెత్తి నీకు మ్రొక్కెడి నిదె బాలుఁడు ॥విడు॥ 57**

**భావవివరము:**

ఎంత అద్భుతదృశ్యం వర్ణిస్తున్నారో చూడండి అన్నమయ్య. బాలకృష్ణుడి అల్లరి భరించలేక ఒక రోటికి కట్టేసింది తల్లి యశోద. రోటిని దొర్లించుకొంటూ రెండు మద్ది చెట్ల మధ్యనుంచి లాగి చెట్లను కూలవేశాడు బాలుడు. శాపవిమోచన బొందిన గంధర్వులు బాలునికి మొక్కి అంతర్ధానమయ్యారు. పెద్ద ధ్వని విని పెరట్లోకి వచ్చిన యశోద మరికొందరు గోపికలు అక్కడి దృశ్యం చూచి మ్రాన్పడిపోయారు. తానూ ఒక గోపికయై అన్నమయ్య ఇలా అంటున్నారు. రోటినుండి విడిచిపెట్టమనవే!! వేగమే విడిచిపెట్టమనవే! తల్లీ విడిచిపెట్టమనవే! ఈ చిన్నారి బాలుడు వెఱచీ (భయపడిపోతున్నాడే). ఎన్నడో మా గొల్లెతల ఇండ్లలో చాలాసార్లు వెన్నా పాలూ విరజిమ్మాడు, నిజమే. నీకోపం వన్నెగా వుండాలి గాని, ఇంతవద్దు తల్లీ! నీకు మేము నీ ఆన పెడుతున్నాము. కన్నులతోనే నవ్వుతూ ముద్దులు కురిపిస్తున్న ఈ బాలుని వోదార్చవమ్మా! నీకెందుకు, మేము వాడి తరపున మాట ఇస్తున్నాము కదా! నేడు మొదలు వొక్కసారైనా కోలలతో (కఱ్ఱలతో) పెరుగు చాడెలు (పెరుగుకుండలు) పగులకొట్టడు. ఇంకా ప్రేమకాక ఆగ్రహం చూపించటం నీకు తగునా? పాపం పిల్లవాడు, నిన్ను చూచి జొటజొటా యెలా కన్నీరు కారుస్తున్నాడో చూడు. నీకోపం ఇక చాలు. మద్ది చెట్లు విరిగాయని బాధపడుతున్నావా? అవి యేనాడో మా తాత ముత్తాతల కాలం నాటివి.రోటితో వూరకనే తాకించివుంటాడు అవి కూలిపోయాయి. లేకపోతే శ్రీవేంకటేశ్వరుడైన నీ కొడుకు బంగారం కదుటమ్మా! బాలుడై నీకు చేతులెత్తి మొక్కుతున్నాడు. ఏపూజ చేశావే తల్లీ?

★ **గోర** – బాధించేవాడు ★ **కేలెత్తి** – చేతులెత్తి

సంఖ్య : 156 సంపుటము : 15 పుట: 106 రాగం : బౌళి

**83 విదురుని విందా విజయీభవ**
**హృదయేశ్వర విజయీభవ** ॥**పల్లవి**॥

**దైవశిఖామణి దానవమర్ధన**
**వేవేలకునీకు విజయీభవ**
**శ్రీ వల్లభగుణచింతాసాగర**
**యీవల నిదె విజయీ భవ** ॥**విదురుని**॥

**జగదేకవిభుఁడ శతమఖవందిత**
**వెగటు విజయముల విజయీ భవ**
**నిగమవినుత సర్వనిలయ నారాయణ**
**యిగిరించెఁ గృప విజయీ భవ** ॥**విదురుని**॥

**జలధిమథన సర్వజంతువిహారక**
**వెలసె నీ మహిమలు విజయీ భవ**
**కలిత శ్రీ వేంకట కామితవరద నిత్య**
**యిలధర నీకు విజయీ భవ** ॥**విదురుని**॥ **159**

**భావవివరముః**

శ్రీవల్లభునికి 'విజయీభవ' దిగ్విజయీభవ అని పలుకుతూ, పెదతిరుమలయ్య చక్కటి కీర్తన వినిపిస్తున్నారు. దీనిని భజన రూపంలో పాడి ముక్తివైపు ఇంకొక అడుగువేద్దాము. విదురుని విందు స్వీకరించి అతని మనస్సుకు విందుచేసిన హృదయేశ్వరా! నీకు విజయీభవ! దిగ్విజయీభవా! ఓ దైవశిఖామణీ! (దేవతలలో అగ్రగణ్యుడా!) దాన మర్ధనా! నీకు వేవేలకు (పలుమార్లు) విజయీభవ! శ్రీవల్లభునికి తగిన గుణములు కలవాడా! నీ శరణాగతుల గురించిన చింతాసాగరమున మునిగినవాడా!వీటన్నిటి కారణంగా నీకు దిగ్విజయమగుగాక! ఓ జగదేకపతీ! శతముఖవందితా (ఇంద్రునిచే ఆరాధింపబడెడి వాడా!) నీ వెగటు విజయములకు (నీ శత్రువులెన్ని వెగటు వరములు పొందినా వెగటు విధానములతోనే వారిని మట్టుబెట్టిన శౌరీ!) నీ విధానములకు విజయీభవా! ఓ వేదవినుతా! సమస్తమునకు నిలయమైన నారాయణా! నీకృప నాపై చిగురింప జేసితివి. నీకు విజయమగుగాక. ఓ క్షీరసాగరమథనా! సర్వజంతువుల మనోవిహారా! వెల్లి విరియైన నీ మహిమలకు విజయీభవ! కామిత వరదాయకుడవైనశ్రీవేంకటేశ్వరా! ఓ భూవల్లభా! నీకు విజయీభవ!

★ **ఇలధరుడు** – భూవల్లభుడు ★ **కలిత** – విఖ్యాతుడైన

సంఖ్య : 459 సంపుటము : XV పుట: 303 రాగం : గుజ్జరి

**84 విన్నప మిదియే వేవేలకు గోవిందా గోవిందా**
**సన్నుతించెదను నావలనఁ గలుగు సర్వాపరాధము లెంచకుమీ ॥పల్లవి॥**

**యెఱఁగమినాది యెఱుక నీపని యేమరి సంసారినైన యిన్నాళ్లును**
**మఱతును నేను మఱవవు నీవు మదమున సిరు లుప్పతిల్లఁగా**
**కొఱగాను నేను కొఱగలవు నీవు కొమ్మలవలపులఁ దగిలితిఁ గనక**
**మఱి నీవే గతి రక్షింపుము నా మర్మము నీచేత నున్నది సుమ్మీ ॥విన్న॥**

**నేరమి నాది నేరుపు నీది నేఁబుట్టుగులకు లోనైనయపుడే**
**కోరుదు నేను కోరవు నీవు గొనకొని యాపదలు పైకొనఁగా**
**దూరుదు నేను దూరవు నీవు తొరలి పురాకృతకర్మములప్పుడు**
**యేరీతినైనా నీవే దిక్కింక యిదె నీకు శరణు చొచ్చితిఁ జుమ్మీ ॥విన్న॥**

**తలఁచమి నాది తలఁపు నీది యిటు తగ నంతర్యామివి గలకాలము**
**కొలుచుట నాది కొలువుగొనుట నీది కూరిమితో నే నీకు మొక్కఁగా**
**ఫలము నాది నా ఫలదుఁడవు నీవు పరికింపఁగా శ్రీవేంకటేశ్వర**
**బలువుఁడవు నీవు నన్ను నేలునాపాలిదైవమవు నీవే సుమ్మీ ॥విన్న॥ 459**

**భావవివరముః**

భక్తిరసప్రధానమైన కీర్తన చెబుతున్నారు పెదతిరుమలయ్య. ఓ గోవిందా! నావలన కలిగిన సర్వాపరాధములను యెంచకు (పరిగణించకు) నన్ను మన్నించు. ఓ గోవిందా! ఇది నా విన్నపము. అనేకమైన నా పాపములను క్షమించు. ఎందుకంటే నాది యెఱుగమి (అజ్ఞానము). నీపని నావంటి వానిని జ్ఞానిని చేయుట. ఇన్నాళ్ళూ సంసారినై యేమఱి వున్నాను. నాకు మతిమఱుపు వుంది. నీవు మఱువవు. కొద్దిపాటి సిరులు రాగానే మదమెక్కి కన్నుమిన్ను గానను నేను. అందుకే నేను కొఱగాను (పనికిరాను). మరి నీవో కొఱగలవు (ప్రయోజనం వున్నవాడవు). ఆడదాన్ని చూస్తే వలపు పిచ్చినాకు వుంటుంది. ఇదిగో నా రహస్యాలన్నింటిని నీకు విప్పి చెప్పాను. మఱి నీవే గతి. నన్ను క్షమించి, రక్షించు. ప్రభూ! నేరములన్నీ నావే. నీవి నేర్పులు. అందువల్లనే యెన్ని నీచ జన్మలనో పొందాను. నీకే కోరికా లేదు. ఏమాత్రం ఆపద వచ్చినా, దానినుంచి బయటపడవేయమని కోరుకొంటాను నేను. నీవెవ్వరినీ నిందించవు. నా పురాకృత కర్మఫలమునకు నిన్ను నిందిస్తాను నేను. ఇదిగో, ఇదే నీకు శరణుచొచ్చితిని. ఏదోవిధంగా నాకు దిక్కువై నన్ను ఆదుకో. దేవా! నాది తలచమి. మరి నీదో, తలపు (జ్ఞప్తి). ఎందుకంటే నా అంతరాత్మగా 'జ్ఞప్తి' నిచ్చేవాడవు నీవే. అంతటి నిన్ను కొలుచుట నా కర్తవ్యము. నా కొలువు మన్నించుట నీ దయ. నీదినాపై కూరిమి (ప్రేమ). అందుకే నీకు మొక్కుతున్నాను. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు ఫలదాతవు. కర్మఫలము పొందేవాడను నేను. నీవు బలవంతుడవు నా నమ్మిన దేవుడవు నీవే సుమా!

★ **తలఁచమి** – మతిమఱపు ★ **దూరుదు** – నిందింతును

సంఖ్య : 91 సంపుటము : 2 పుట: 62 రాగం : సాళంగనాట

**85 విఱిగిరి దానవవీరు లదె**
**అఱిముఱి దేవత లాడే రదె** ॥పల్లవి॥

**పరగుకంభ మదె పగిలె పగిలె నదె**
**హరినరసింహంబాయ నదె**
**గరుడధ్వజ మదె ఘనచక్రం బదె**
**మొరసేటిశంకపుమ్రోత లవె** ॥విఱి॥

**వెడలె వెడలె నదె వెనుకొని హిరణ్యుఁ**
**దొడికిపట్టె నదె తొడమీఁద**
**విడువక చించిన వేయిచేతులవె**
**కడపమీఁదనే కదలఁడదె** ॥విఱి॥

**అదె వామాంకంబందు లక్ష్మియదె**
**కదిసి శాంతమదే కరుణ యదె**
**వుదుటున ప్రహ్లాదునూరడించె నదె**
**యిదె శ్రీవేంకట మెక్కె నదె** ॥విఱి॥ **91**

**భావవివరముః**

లక్ష్మీనారసింహుని వైభవాన్ని తన జ్ఞానచక్షువులతో దర్శిస్తున్నారు అన్నమయ్య. మన కంత 'శక్తి' లేకపోయినా కీర్తననాస్వాదిద్దాము. దానవ వీరులంతా అదిగో విరిగిరి (తుత్తునియలయ్యారు). అఱిముఱి (అతిశయించిన) దేవతలంతా అదిగో నర్తిస్తున్నారు. అదిగో బలమైన స్తంభము పగిలిపగిలి ముక్కలై పోయింది. అదిగో శ్రీహరి నరసింహునిగా అవతరించాడు. అదిగో ఆయన గరుడధ్వజము, అదిగో మిలమిలలాడే సుదర్శన చక్రము. అవిగో పూరించబడుతున్న పాంచజన్య శంఖారావములు. ఎంత గొప్పధ్వని!!! అదిగో హిరణ్యకశిపునిపైకి వెడలె వెడలె (దుందుడుకుగా దాడిచేసినాడు). అదిగో తొడికిపట్టి (కదలకుండా పట్టుకొని) తన తొడపై విడవకుండా తన వేయి చేతులతో పట్టి చీల్చుచున్నా కడప (గడప) పైనుండి అణుమాత్రమైనా కదలడు. అదిగో యెంత భీకర దృశ్యమో!!! అమ్మయ్య! తన పత్ని శ్రీలక్ష్మిని చూడగానే శాంతించిన ఆ నృసింహుడు తన యెడమ తొడపై నిడుకొని అదిగో తన ప్రియభక్తుడు ప్రహ్లాదుడు తనని స్తుతిస్తుంటే కరుణతో కరిగిపోయి వూరడిస్తున్నాడు. ఆ రూపాన్ని నేటి అర్భకులు తాళలేరని శ్రీవేంకటేశ్వరుడై ఇదిగో శ్రీవేంకటగిరియెక్కి కూర్చున్నాడు.

★ **వామాంకము** – ఎడమతొడ ★ **మొరసేటి** – ధ్వనిస్తున్న

సంఖ్య : 195 సంపుటము : 2 పుట: 131 రాగం : పాడి

**86** **విష్ణుఁడే యింతానని భావించుటే బుద్ధి**
**వైష్ణవుఁడై యాచార్యసేవసేయుటే బుద్ధి** ॥పల్లవి॥

**కొండవంటితనలోనికోపము రేఁగ వచ్చితే**
**దండనే యెచ్చరి వూరకుండుటే బుద్ధి**
**మెండుగా బరకాంతల మీఁదితమి వుట్టితేను**
**అందుకాచందుకు భ్రమయకుండుటే బుద్ధి** ॥విష్ణు॥

**అట్టె యెవ్వరయినా గృహారామాదులపై నాస**
**వుట్టించితేఁ వానివెంటఁ బోనిదే బుద్ధి**
**చుట్టపుసమ్మంధాన సోఁకితే పరబాధలు**
**చుట్టుకోక లోనుగాక జునుఁగుటే బుద్ధి** ॥విష్ణు॥

**తప్పదింతా దైవికమే తనవద్దనున్న వారిఁ**
**దప్పులువట్టనిదే తగినబుద్ధి**
**యెప్పుడూ శ్రీవేంకటేశుఁ డెదలోన నున్నవాఁడు**
**చొప్పెత్తి యాతనిమూర్తి చూచుటే బుద్ధి** ॥విష్ణు॥ **195**

**భావవివరముః**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో బుద్ధి అంటే సద్బుద్ధి అని అర్థం చేసుకోవాలి. సద్బుద్ధి అని దేనినంటారో వివరిస్తున్నారు. అంతా విష్ణుమాయయేనని భావించుటే బుద్ధి. వైష్ణవమును స్వీకరించి నీ ఆచార్యుని సేవచేయుటయే బుద్ధి, అని అంటున్నారు. తనలో కొండంత కోపమున్నా దానినణచివైచి హెచ్చరికతో మౌనంగా వూరకుండుటే బుద్ధి అనబడును. పరకాంతలమీద వ్యామోహ పడకుండా వారిపై కలిగిన భ్రమలకు లోనుగాక నిగూఢముగా వుండుటే బుద్ధి. ఎవ్వరైనా గృహములు ఆరామములు ఇస్తామని ఆశపుట్టిస్తే వారివెంట పడిపోకుండుటే బుద్ధి అనబడును. చుట్టరికములు సంబంధములు కలిసినప్పుడు పరుల వలన అనేక బాధలు కలుగుతాయి. మనము వాటికి లోనుయై పోతుంటాము. వాటిని తప్పించుకొని సుఖముగా వుండుటయే బుద్ధి అనబడును. మనకు చెడుజరిగినా అది దైవికము తప్పించుకొనుట అసాధ్యమని నమ్మి తనవద్దనున్న వారిని దోషులని తప్పు పట్టకవుంటేనే బుద్ధి. శ్రీవేంకటేశ్వరుడు తిరుమల శిఖరాలమీద మాత్రమే కాదు, మన హృదయంలోనే వుంటాడని గ్రహించి ఆయన దారిని పట్టుకొని ఆయన మూర్తిని దర్శించుటే బుద్ధి అనబడుతుంది.

★ **జునుగుట** – తప్పించుకొనుట ★ **చొప్పెత్తి** – దారిని పట్టుకొని

సంఖ్య : 343 సంపుటము : XV పుట: 231 రాగం : మాళవిగౌళ

**87** వెదకెద నిను నే వేదము చెప్పఁగ
హృదయములోననే యిరవు నీ కటా ॥పల్లవి॥

శ్రీనాథా పిలిచితిఁ బలుకఁగదే
పూని యన్నిటా నుందువట
మానితముగ నామాట వినఁగదే
వీనుల సర్వము విందువటా ॥వెద॥

పరమాత్మా తప్పక పొడచూపవే
తరుణవయసు మరుతండ్రివటా
పరగ మొక్కెదను పాదము చాఁచవే
సిరుల బ్రహ్మ పూజించినదే యటా ॥వెద॥

గోవిందా నీ గుఱు తెలిఁగించవే
వేవేలు మహిమల విభుఁడవటా
శ్రీవేంకటేశా జిగి నలమేల్మంగ
కైవసమై మముఁ గాతువటా ॥వెద॥ **343**

**భావవివరముః**

పెదతిరుమలయ్య ఈ అధ్యాత్మ కీర్తనలో యేమంటున్నారో వినండి. ప్రభూ! నీకు ఇరవు (స్థానము) మా హృదయంలోనేనట. ఇది చెప్పింది మరెవరో కాదు, వేదమే చెప్పింది. మరి నేను యెక్కడెక్కడో వెదుకుతున్నాను. ఓ శ్రీనాథా! నేను పిలిస్తే బదులియ్యవేమయ్యా? నీవు పూనికతో అన్నింటిలోనూ వుంటావట కదా! మన్నింపు తొణికిసలాడే నామాటలను వినవేమయ్యా? అనేకమైన ముఖములున్న నీకు అంతకు రెట్టింపు చెవులున్నవి కదా! పరమాత్మా! యెక్కడవున్నా తలచుకొన్నంతనే పొడచూపలేవా? మనస్సే నివాసస్థానమైన మన్మథుని తండ్రివి కదా! పోనీ మొక్కెదనంటేనీ పాదాలనైనా చూపవేమయ్యా? మంగళకరమైన ఆ పాదాలను బ్రహ్మ పూజిస్తాడు కదా! నాకూ ఈ దేహమిచ్చింది ఆయనే కదా! గోవిందా! నిన్ను గుర్తుపట్టేదెలాగో నీవే చెప్పు. అనేక మహిమలు కలవాడవట కదా! ఓ శ్రీవేంకటేశ్వరా! కాంతులీను అలమేలుమంగను కైవసము చేసికొని మమ్ము రక్షించెదవట కదా! మరి ఇంకా జాగేల తండ్రీ?

★ **మానితము** – మన్నింపడినది ★ **పరగ** – అతిశయించి

సంఖ్య : 369 సంపుటము : 15 పుట: రాగం : రామక్రియ

**88 వెఱవకుఁడీ యిందుకుఁగా విశ్వహితుఁడ నేను**
**అటిముటి నన్నునమ్ముట మేలు హరిదాసుఁడ నేఁగాన** ॥పల్లవి॥

**పరమపదనాథునే భావించితపము సేసే**
**వొరులలోకము నే నడుగ వో సురలాల**
**ధరలో లక్ష్మీపతిదాసుఁడ నే నైతిఁ గాని**
**సిరులకై మిము వేసరించ చింతించకుఁడీ మీరు** ॥వెఱవ॥

**పరగ చక్రాయుధుని బంట నేనైతపము సేసే**
**వొరులఁ బీడించఁ గాదు వో సురలాల**
**గరుడవాహనుని కడు నుతియించేఁగాని**
**తరలి భీతిల్లి యమృతము దాఁచుకోకుఁడీ మీరు** ॥వెఱవ॥

**ఆముకొని యజ్ఞేశ్వరుఁడనినేఁ బూజించేఁ గాని**
**మీమీ భాగము లడుగుట లేదు సుమీ సురలార**
**యేమఱక శ్రీవేంకటేశుని శరణము జొచ్చితి**
**కామించినట్లనే నన్ను కరుణించుఁడీ మీరు** ॥వెఱవ॥ **369**

**భావవివరముః**

'అటిముటి' అంటే నిశ్చయముగ అని అర్థం. ఈ అధ్యాత్మకీర్తనలో పెదతిరుమలయ్య యేమి చెబుతున్నారో ఆలకించండి. నేను విశ్వమునకు హితవు జరుగవలెనని కోరుకొనేవాడను. నేను నిశ్చయంగా అందరిమేలు కాంక్షించే హరిదాసును. కావున నన్నునమ్మండి. ఇందుకు (ఇది చెప్పుటకు) వెరవకుడీ (భయపడవద్దు). ఓ దేవతలారా! మీరే పరమపదము కావాలంటే వైకుంఠనాథుని తపస్సుతో మెప్పిస్తారు. అటువంటప్పుడు నాకు మీ స్వర్గం యెందుకు? నేనెవరనుకొంటున్నారు? లక్ష్మీపతి దాసుడను. నాకు సిరులిమ్మని మిమ్మల్ని విసిగించను భయపడకండి, చింతించకండి. నిజమే, నేను చక్రపాణి బంటునే. కాని ఓ దేవతలారా! నా తపస్సు పరులను పీడించుటకు కాదు. గరుత్మంతుడు వాహనముగానున్న శ్రీహరినే నుతించెదను. కానీ భీతిల్లకండి మీ అమృతమును యెత్తుకొచ్చి నాకిప్పించమని నేను ఆయనను అడగను లెండి. నేను యజ్ఞేశ్వరుడని విష్ణువును అధికముగా పూజించేమాట నిజమే. కానీ వో దేవతలారా! యజ్ఞఫలములను కొంత నాకిప్పించమని నేను ఆయనను అడగనులెండి. నాకెందుకయ్యా అవన్నీ? శ్రీవేంకటేశ్వరుని శరణాగతుడను. నా కోరికేమంటే, మీరునాపై కరుణతో వుండండి. అదినాకు చాలును.

★ **ఆముకొని** – అధికముగా ★ **వేసరించు** – విసిగించు

సంఖ్య : 243 సంపుటము : XV పుట: 165 రాగం : ముఖారి

**89** **వేగిరించ కంతేసి త్రివిక్రమా**
**వేగుఁజుక్క రానీ త్రివిక్రమ** ॥పల్లవి॥

**వేసరించఁ జుమ్మీ త్రివిక్రమ నిన్ను**
**వీసమంతపనికే త్రివిక్రమ**
**వేసేవు పూవులను త్రివిక్రమా మేని**
**వేసురుఁ జెమటల త్రివిక్రమ** ॥వేగి॥

**వెన్నెలలో నవ్వకు త్రివిక్రమా కన్న**
**విన్నవారేమందురో త్రివిక్రమా**
**విన్నాణపుచేఁతల త్రివిక్రమా**
**వెన్నగారీ నీ మోవి త్రివిక్రమా** ॥వేగి॥

**వెడజారెఁ దురుము త్రివిక్రమా నన్ను**
**విడిదిలోఁ గూడితి త్రివిక్రమా**
**విడువ శ్రీవేంకటత్రివిక్రమా నీ**
**విడిముడి మెచ్చితి త్రివిక్రమా** ॥వేగి॥ **243**

**భావవివరముః**

శ్రీకృష్ణుని “త్రివిక్రమా” అని సంబోధిస్తూ ఈ కీర్తన చెబుతున్నారు పెదతిరుమలయ్య. తానూ త్రివిక్రముని వలపుకత్తెయై యేమంటున్నారో వినండి. ఓ త్రివిక్రమా! మమ్మల్ని అంతగా వేగిరించకు (తొందరపెట్టకు). తెల్లవారుజామున కనిపించే వేగుజుక్క ఇంకా రానేలేదు. దానిని రానీ త్రివిక్రమా! ఓ త్రివిక్రమా! నిన్ను నేను వేసరించ (నొప్పించ) జాలను సుమా! నేనుచేసిన వీసమంత (పదునారవవంతు) వుపకారానికే, నాపై పువ్వులను వేశావయ్యా! ఇదిగాక ఇంకా యెందరి ముచ్చట దీర్చినావో కానీ, నీమేనంతా వేసురు జెమటలతో (విసిగించే చెమటలతో నిండివున్నదయ్యా త్రివిక్రమా! నీవు ననుజూచి వెన్నెలలో వెన్నెలవలె నవ్వకయ్యా! ఈవరకే నీ చిలిపి చేష్టల గురించి విన్నవారేమనుకొంటారు? ఓ త్రివిక్రమా? నీవన్నీ విన్నాణపు (నేర్పుగల) చేతలయ్యా! వెన్నకారుతున్న నీ పెదవులను చూస్తూనే, నీవు చేసిన పని అర్థమవుతున్నదయ్యా! నీ కొప్పునొకసారి చూచుకోవయ్యా! అది వెడజారి (సడలి) వున్నది. త్రివిక్రమా! యేమి నీదురుసుతనము!! నన్ను విడిదిలోనే కూడితివి. ఇక నిన్ను నేను క్షణమైన విడువలేనయ్యా వేంకటాద్రి త్రివిక్రమా! ఎందుకంటే నీవు నాకిచ్చిన అనురాగమనే “విడిముడి”ని యేనాటికి మరువలేనయ్యా! త్రివిక్రమా!

★ **విడుముడి** – ధనము, కట్నము ★ **వేగుచుక్క**–తెల్లవారుజామున కనుపించే చుక్క

సంఖ్య : 333 సంపుటము : 15 పుట: 224 రాగం : ముఖారి

**90 వేదాంతవిదులాల వివేకులాల**
**పోదితోడ నే మింక బుద్ధు లడిగేమయ్యా** ॥పల్లవి॥

**తిత్తిలోని కాఁపురపు దేహి నేను నా**
**చిత్తములోపలివాఁడు శ్రీవిభుఁడు**
**పొత్తులనా దాఁపరము పూర్వకర్మము**
**విత్తి విత్తి మొలపించీ వినరయ్యా** ॥వేదాంత॥

**పొదిఁ బంచభూతముల పుర మేలెను నేను**
**కదిసి న న్నేలేవాఁడు గదాధరుఁడు**
**యెదిటి నా మై సొమ్ము లింద్రియములు**
**గుదిగొని మించీ నిదిగో చూడరయ్యా** ॥వేదాంత॥

**కొలఁది జన్మమునకు గుఱి నేను**
**వెలయ నాకు గుఱి శ్రీవేంకటేశుఁడు**
**సులభపునాగుణము సుజ్ఞానము**
**చెలరేఁగి చెలరేఁగి చిత్తగించవయ్యా** ॥వేదాంత॥ **333**

**భావవివరముః**

పెదతిరుమలయ్య ఈ కీర్తనలో వేదాంత కోవిదులను వివేకవంతులైన జ్ఞానులను యేమి కావాలని అడుగుతున్నారో చిత్తగించండి. పోదితో (వైభవంగా) నేము (మేము) ఇంక, బుద్దులు (మంచి బుద్ధిని) అడిగేము. ఆలోచిస్తే, 'నేను' అనిపిలిపించుకొనేవాడు యెవరు? తొమ్మిది రంధ్రములున్న తోలుతిత్తిలో కాపురముంటున్న "దేహి". వీడి చిత్తములో వెలుగుతున్నదెవరు? శ్రీకాంతుడు. వీడు దాచుకొన్న 'ఉమ్మడినిధి' యేమిటి? వీడి పూర్వకర్మ. అవి మంచివో చెడ్డవో చూడకుండా విత్తనములవలె విత్తి విత్తీ కర్మఫలాన్ని మొలిపించుకొంటున్నాడు. ఇదండీ వీడి కథ. వినండయ్యా! సరే, ఈ 'నేను' అనేవాడు పంచభూతములతో (మట్టి, నీరు, గాలి, వేడి, శూన్యము) అనేవాటితో చేయబడ్డ పట్టణాన్ని యేలుతున్నాడు. ఈ పట్టణానికి ఏలిక గదాధరుడు (విష్ణువు). వీడిమైసొమ్ములు (వంటిమీది అలంకరణలు) వీడి ఇంద్రియములు. వీటితో అతిశయించి ఎలా విఱ్ఱవీగుతున్నాడో చూడండయ్యా! న్యూనత బొందుతున్న నా జన్మలకు గుఱి (కారణం) 'నేనే'. మరి ఈ నేను అనుకొనే ఆత్మకు కారణం శ్రీ వేంకటేశ్వరుడువైన నీవే. కాబట్టి సుజ్ఞానముతో వుండవలసిన నా గుణములు కర్మకు అనుగుణంగా చెలరేగి చెలరేగి పోతున్నాయి. చిత్తగించి ఆదుకో తండ్రీ

★ **కొలది జన్మ** – తక్కువజేసే జన్మ ★ **గుదిగొని** – అతిశయించి

సంఖ్య : 107 సంపుటము : 2 పుట: 72 రాగం : బౌళి

**91 శ్రీవేంకటేశ్వరుఁడు చేరి విజయముఁ బొంది**
**దేవతలు చూడ దశదిక్కులకు నేసెను** ||పల్లవి||

**ఆరికమ్ము వేసెనట్టు అల్లనరకాసురుపై**
**మేరమీరిరావణునిమీఁద నేనెను**
**సారపుజలధిమీఁద జలములింకఁగ నేసె**
**దారి దప్పకుండ నేడుదాళ్లు దెగనేసె** ||శ్రీవేం||

**పగదీర మింటిమీఁదిబాణునిమీఁద నేసె**
**మిగుల మెరసి మాయామృగము నేసె**
**జగడములో రాక్షసుల సంహారముగ నేసె**
**నిగిడి రక్తగుండాలు నిండ నేసెను** ||శ్రీవేం||

**ఖరదూషణాదుల కడిఖండలుగ నేసె**
**సరుసఁ గుంభకర్ణునిఁ జావనేసెను**
**అరిది శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ గూడి**
**గరుడనిమీఁద నెక్కి కంటువాయ నేసెను** ||శ్రీవేం|| **107**

**భావవివరముః**

శ్రీహరి అవతారముల ఆవశ్యకతే దుష్టశిక్షణ, శిష్టరక్షణ. రామావతారంలో మానవునిగా బ్రతుకుట నేర్పాడు. కృష్ణావతారంలో లీలామానుష విగ్రహుడయ్యాడు. అన్నమయ్య, శ్రీహరి నేటి రూపం శ్రీవేంకటేశ్వరునిగా దేవతలకు వేడుకగా దశదిశలలో విజయపరంపర కొనసాగిస్తున్నాడు అని కీర్తిస్తున్నారు. అల్లదిగో నరకాసురుని మీద తన అరికము (డాలు) విసిరివేశాడు. అతిశయించి రావణాసురుని తన అస్త్రప్రయోగంతో విహ్వలుడిని జేశాడు. జలధి నింకించు కోపావేశముతో సముద్రునిపై బాణం ప్రయోగించాడు. నేటి కలియుగంలోనూ ఆ దారి వదలకుండా తాళ్ళు తెగనేసె (భవబంధాలను తెగవేస్తున్నాడు.) కృష్ణయ్యగా బాణాసురునిపై దండెత్తి ఆకాశంలోనికి బాణాలు వేసి వాడిని చిత్తుచేశాడు. మాయామృగము రూపంలో వచ్చిన రాక్షసుని సంహరించాడు. త్రేతాయుగంలో తప్పించుకొనిన, జగతిలోని రాక్షసులను వెదకి వెదకి చంపాడు. వారు రాజులుగా జన్మించినా భారతయుద్ధంలో చంపించాడు. రక్తం గుండాలలో నిండునట్లు తుదముట్టించాడు. శ్రీరాముడై ఖరదూషణాది రాక్షసులను ముక్కలు ముక్కలు చేశాడు.కుంభకర్ణునివంటి పర్వతాకారుని జావకార్చాడు. నేడు శ్రీవేంకటేశ్వరుడై దేవి అలమేల్మంగను గూడి గరుత్మంతుని మీద నెక్కి పగ అనేదే లేకుండా చేశాడు.

★ **కంటువాయనేసెను** – పగనిర్మూలించాడు ★ **నిగిడి** – విజృంభించి

సంఖ్య : 109 సంపుటము : 2 పుట: 73 రాగం : లలిత

**92 సకలబలంబులు నీవే సర్వేశ్వర నాకు**
**అకలంకంబగుసుఖమే అన్నిట నిదే నాకు ॥పల్లవి॥**

**పొందుగఁ జక్రాంకితమేబుజబల మిదె నాకు**
**అందినహరి నీచింతే ఆత్మబలము నాకు**
**సందడిఁ జేరుబలము కేశవనామము నాకు**
**యిందును నందును భవభయ మిఁక లేదిదే నాకు ॥సకల॥**

**అంగపుఁదిరుమణు లివి పంచాంగబలము నాకు**
**సంగతి నీపై పాటలె స్వరబలి మిదే నాకు**
**రంగుగ నీగుణరాసులేరాసిబలము నాకు**
**యింగితముగ నిహపరముల కెదురే దిదే నాకు ॥సకల॥**

**కనుఁగొనునీవిగ్రహమే గ్రహబలి మిదె నాకు**
**విను నీదాసులసేవే వెనుబలి మిదె నాకు**
**తనరిన శ్రీవేంకటపతి దైవబలము నాకు**
**ఘనమే చెప్పఁగ నింతటఁ గలిగెబో యిదే నాకు ॥సక॥ 109**

**భావవివరముః**

అన్నమయ్య యేమంటున్నారో వినండి. ఓ సర్వేశ్వరా! నాకున్న బలములన్నీ నీవే. నీవలన కలిగే సుఖమే అకలంక సుఖము (కళంకములేని సుఖము). అదే నిర్మలానందము కూడా అని అంటున్నారు. దేవా! నీ చక్రపు ముద్రలు ధరించిన భుజములదే, నిజమైన భుజబలము.నీవు లభించిన ఆత్మ బలము హరిచింతనమే. కేశవా! నీపేరు బలమే నన్ను కాపాడుచున్నది. నాకు ఇహపరముల రెండిటిలోను భవము యొక్క భయము లేదు. దేవా! నాకు పంచాంగబలముతో నిమిత్తమే లేదు. ఎందుకంటే నా ఐదు అంగముల బలము వాటిపై నేను ధరించిన తిరుమణియే (తిరునామము). నా స్వరమునకు బలము నీపై నేను పాడే పాటలే. నేను వర్ణించే నీ గుణరాసుల బలమే నాకు రాసిబలము వలె నొప్పుచున్నది. ఇహపరములు రెంటిలోను నాకు యెదురేలేదు. నాకున్న గ్రహబలిమి నీ విగ్రహమును కనుగొనుటే. నీదాసులసేవయే నాకు వెనుబలిమి (వెన్నుపూసవంటి గొప్ప బలము). అతిశయించిన వో శ్రీవేంకటపతి! నాకు నీ దైవబలమే, ఘనమైనదని చెప్పగా అదే కలిగినదిపో!!

★ **తనరిన** – అతిశయించిన ★ **అంగపు** – శరీరముపై

సంఖ్య : 223 సంపుటము : I పుట: 149 రాగం : సామంతం

**93 సకలభూతదయ చాలఁగఁ గలుగుట**
**ప్రకటించి దేహసంభవమైనఫలము** ॥పల్లవి॥

**తలకొన్నఫలవాంఛఁ దగులకుండఁగఁ జిత్త-**
**మలవరించుట కర్మియైనఫలము**
**పలుకర్మములలోన బ్రహ్మార్పణపుబుద్ధి**
**గలుగుట హరికృపగలిగినఫలము** ॥సక॥

**యెప్పుడుఁ దిరువేంకటేశుసేవకుఁడౌట**
**తప్పక జీవుఁడు దానైనఫలము**
**కప్పినసౌఖ్యదుఃకర్మము (ఖమ్మ?)లు సమముగా**
**నొప్పుట విజ్ఞానమొదవినఫలము** ॥సక॥ **223**

**భావవివరముః**

అన్నమాచార్యులవారు చెప్పిన గొప్ప అధ్యాత్మ కీర్తనాస్వాదించండి. భగవంతుడు మనకు ఆరోగ్యవంతము పుష్టిపరిపూరితము అయిన శరీరాన్నిచ్చి భూమిమీద బంపించాడు. దాని ఫలితంగా ఆయన నీనుంచి కోరుకునేది మణులు మాన్యాలు కాదు. మనలాగే ఆయన చేతనే సృష్టించబడిన సకల భూతముల (జీవుల) పై దయగలిగివుండి వాటిని కూడా సవ్యంగా బ్రతుకనిచ్చుటయే, అంటున్నారు. మరి జీవిగా పుట్టినప్పుడు కర్మి (కర్మలనాచరించెడి జీవునికి కర్మ చేయక తప్పదు. అయితే ఆ కర్మ ఫలవాంఛ లేకుండా చేయాలి. మరి హరికృప కలిగిన పలమేమిటంటే అట్టివాడు యేకర్మ చేసినా ఫలితం "బ్రహ్మార్పణం" అంటూ చేస్తాడు. వానికి ఆ కర్మయొక్క పాపపుణ్యాలు "జమ" కావు. భగవంతుడు మనని జీవుడిగా పుట్టించిన దానిఫలమేమంటే శ్రీవేంకటేశ్వరుని దాసుడవుటయే. మరి ఆస్వామి దయవలన జీవుడికి జ్ఞానము కలిగి, విజ్ఞానియైన ఫలమేమంటే అట్టివాడు సుఖదుఃఖాలను సమబుద్ధితో చూస్తాడు. అదిగో అదే మోక్షానికి తొలిమెట్టు.

★ **కప్పిన** – ఆక్రమించిన ★ **ప్రకటించి** – బహిర్గతముగా

సంఖ్య : 332 సంపుటము : I పుట: 221 రాగం : శ్రీరాగం

**94 సకలసందేహమై జరగుచున్నది యొకటి**
**ప్రకటింప జీవమో బ్రహ్మమో కాని ॥పల్లవి॥**

**వసుదేవుజఠరమనువననిధికిఁ జంద్రుఁడై**
**అసమానగతిఁ బొడమినాఁ డీతఁడు**
**వసుధఁ జంద్రుఁడు నీలవర్ణుఁ డేఁటికినాయ**
**కసరెత్తి నునుఁగందు గలయఁగొనుఁబోలు ॥సక॥**

**ఇనవంశమున లోకహితకల్పభూజమై**
**అనఘుఁడై జనియించినాఁ డీతఁడు**
**ననుపైనసురతరువు నల్లనేఁటికినాయ**
**పెనుఁగొమ్మలో చేఁగ పెరిగిరాఁబోలు ॥సక॥**

**తిరువేంకటాద్రిపైఁ దెలియఁ జింతామణై**
**అరిదివలెఁబొడచూపినాఁ డీతఁడు**
**గరిమె నది యిపుడు చీఁకటివర్ణమేలాయ**
**హరినీలమణులప్రభ లలమికొనఁబోలు ॥సక॥ 332**

**భావవివరముః**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తన భావము నాకిలా స్ఫురించింది. ఈ జగతిలో ప్రాణులన్నిటిలోనూ జీవశక్తి ఒకటి చరించుచున్నది. అన్నీ సందేహములై తోచుచున్నవి. ప్రకటింపబడిన అయ్యది జీవమో బ్రహ్మమో తెలియరాకున్నది. వసుదేవుని గర్భమను మహాసముద్రమున చంద్రుడై అసామాన్యమైన విధమున ఇతడు పొడచూపినాడు. మరి భూమిపై అవతరించిన ఈ చంద్రుడు నీలవర్ణుడెందుకైనాడు? విజృంభించి అనురాగముగల రమణులతో పెనగినాడు కాబోలు. లోకములకు హితము కలిగించు కల్పవృక్షమై సూర్యవంశమున పాపరహితుడై జన్మించినాడు యీతడు. మరి, కాంతులీను నునుపైన ఆ దేవవృక్షము నల్లగా యెందుకైనది? బహుశా దాని కొమ్మల్లో చేగ పెరిగి అట్లా అయినదేమో? (రాముడు గొప్ప బలశాలియగుటచే గొప్పగా చేవపెరిగి నల్లబడ్డాడని భావము.) ఆయా అవతారములెత్తినవాడే కలియుగమున తిరువేంకటాద్రిపై చింతామణ వలె పొడచూపినాడీతడు. మరి, చీకటి వర్ణముతో ఇప్పుడెందుకు మహిమ చూపుతున్నాడు? తన మెడలోని ఇంద్రనీలమణుల కాంతి ఈ స్వామికి అంటినది కాబోలు.

★ **కసరెత్తి** – విజృంభించి ★ **హరినీలమణి** – ఇంద్రనీలమణి

సంఖ్య : 349 సంపుటము : I పుట: 233 రాగం : లలిత

**95 సకలసంగ్రహము సకలసంచయము**
**అకృతసుకృత మిది హరినామం ॥పల్లవి॥**

**సకలవేదశాస్త్రములసార మిది**
**సకలమంత్రరాజంబునిది**
**సకలపురాణరసములమధుర మిది**
**అకుటిలపావనం హరినామం ॥సక॥**

**సకలతత్త్వసంశయఖండన మిది**
**సకలకర్మనిశ్చయము నిది**
**సకలవిధిరహస్యప్రధాన మిది**
**అకారణహితం హరినామం ॥సక॥**

**సకలదేవతాస్వామిప్రియం బిది**
**సకలలోకరక్షణము నిది**
**ప్రకటం వేంకటపతినామాంకిత-**
**మకించనధనం హరినామం ॥సక॥ 349**

**భావవివరము:**

హరినామ వైశిష్ట్యాన్ని చెబుతున్నారన్నమయ్య. ఈ శ్రీహరినామ సంకీర్తనవున్నదే, ఇది సకల వేదముల నుండి సంగ్రహించబడినది (గుప్తముగా వివరించబడినది). ఇది సకల సంచయము (అని శాస్త్రజ్ఞానములను ప్రోగుచేసినది). చేయరాని అకృతములను కూడా సుకృతములుగా చేయగలిగినదీ హరి నామమే. కావున ఇది అన్ని వేదశాస్త్రముల సారము అని పిలువదగినది. అన్ని మంత్రములలో ఇది మంత్రరాజము. సకల పురాణముల రసములను మాధుర్యముగా కలబోసినది ఈ హరినామము. కుటిలత్వము లేనివారందరిని పావనులను చేయగలిగినదీ హరినామమే. తత్త్వములలోని సకల సంశయములను ఖండించివైచి నిశ్చయముగా తెలుపగలిగినది హరినామమే. ఏది సకర్మయో, యేది అకర్మయో, యేది వికర్మయో నిశ్చయించగలిగినదిదే. సకల విధులలోని ప్రధాన రహస్యముకూడా హరినామము. శ్రీహరి శరణాగతులైన హరినామ పారీణులకు అనుకోకుండానే యెన్నో మేళ్ళు జరుగుతుంటాయి. దీనివలన యేమి తెలుస్తున్నదంటే హరినామావధారులకు తత్త్వము, జ్ఞానము, వైరాగ్యమూ వాటంతట అవే సిద్ధిస్తాయి. అంతెందుకు, యెందరెందరో కొలిచే అనేక దేవతలకూ ప్రియమైన స్వామి వీడే. సమస్తలోకరక్షకుడు వీడే. శ్రీ వేంకటపతి నామాంకితము (ఎంచబడిన వేంకటేశ్వరుని నామము) దారిద్ర్య నిర్మూలకరమైన సంపద.

★ **అకించనధనము** – దరిద్ర నిర్మూలకధనము

★ **అకృతసుకృతము** – చేయరానిపనులను సుకర్మలుగా మారుస్తుంది

సంఖ్య : 341 సంపుటము : I పుట: 228 రాగం : ఆహిరి

**96 సతతము నేఁజేయు ననాచారములకుఁ గడ యెక్కడ**
**మతి ననుఁగని కావుము రామా రామా రామా** ॥పల్లవి॥

**సేసిననాబ్రహ్మహత్యలు శిశుహత్యలు గోహత్యలు**
**ఆసలనెన్నో యెన్నో ఆయాజాడలను**
**యీసున నే నిపు డెరిఁగియునెరఁగక నేనేదురితపు-**
**రాసులకును గడలే దిదె రామా రామా రామా** ॥సత॥

**నమలెడినావాచవులకు నానావిధభక్షణములు**
**కమిలినదుర్గంధపుశాకమ్ములు దొమ్ములును**
**జముబాధల నరకంబుల సారెకు నన్నె (కునెటు)టువలె శ్రీ-**
**రమణుఁడ ననుఁ గాచే విటు రామా రామా రామా** ॥సత॥

**కపటపునాధనవాంఛలు కలకాలముఁ బరకాంతలఁ**
**జపలపుఁదలఁపుల సేఁతలసంఖ్యము లరయఁగను**
**యెపుడును నిటువలెనుండెడుహీనుని నన్నెటు గాచెదో**
**రపమున శ్రీవేంకటగిరి రామా రామా రామా** ॥సత॥ **341**

**భావవివరము:**

నిత్యమూ తాను చేసే అనారాచరపు పనులకు అంతే లేదని ఆవేదనతో శ్రీరామచంద్రునికి విన్నవించుకొంటున్నారు అన్నమయ్య. కరుణ నిండిన మతి గలవాడవై నన్ను కనిపెట్టి రక్షించవయ్యా రామా! అని వేడుకొంటున్నారు. ఆవేదన పొంగిపొరలే కీర్తన ఇది. శ్రీరామచంద్రా! గత జన్మలలో నేను యెన్ని బ్రహ్మహత్యలు, యెన్ని శిశుహత్యలు, యెన్ని గోహత్యలు, నాపై ఆశలు పెట్టుకొన్నవారి నమ్మకములను యెన్నింటినో హత్యచేసి వుంటాను. ఆయా వివరములను నేనెరుగను. కాని నా యీ ఆవేదనకు మాత్రం కారణం ఆ పాతకములే. ఈ జన్మలో చేసిన దురితములరాసికి (పాపములకుప్ప) తక్కువవున్నదా? ఓరామా! నేను నమలెడి నానారకములైన రుచులకోసం తినకూడనివి కూడా యెన్నో తిన్నాను. మాడి, దుర్గంధభూయిష్టములైన కూరలనువండించుకుతిన్నాను. వీటన్నిటి పట్టిక యమధర్మరాజు దగ్గర భద్రంగావుంది. అక్కడికి వొకనాడు పోక తప్పదు. ఓ శ్రీరమణుడా! నన్నెట్లు రక్షిస్తావో? ఈ జన్మలో మాత్రం నాపాపాలకు అంతువున్నదా? కపటముతోనైనా ధనం సంపాదించాలని యెంతతపించానో!! ఎప్పుడూ పరకాంతలపై వ్యామోహమే. చపలత్వముతో కూడిన తలపులే. చపలపు చేతలు కూడా తక్కువ సంఖ్యలో లేవు. ఎప్పుడూ ఇలాగే వుండే ఈ హీనుణ్ణి నన్నెట్లా రక్షించెదవో? ఓ శ్రీవేంకటగిరి రామా! నా దురితములను చెల్లుబడి అయేటట్లు చేయి ప్రభూ!

★ **రపమున** – చెల్లుబడిగా ★ **జముబాధలు** – యముని శిక్షలు

సంఖ్య : 144 సంపుటము : 15 పుట: 96 రాగం : భూపాళం

**97 సర్వశక్తివి నీవే సకలలోకేశ్వరా**
**నిర్వహించి నన్ను రక్షించఁగ నీవే** ॥పల్లవి॥

**తండ్రిపైఁ జేసినభక్తి, దైవమా నీకే శెలవు**
**తండ్రికి తండ్రివి నీ వంతర్యామివి**
**మండ్రాడి తల్లిపైఁ జేసే మచ్చి కెల్లా నీది**
**నిండ్రు (?) ఁదల్లిలోవాఁడవు నీవె కనక** ॥సర్వ॥

**పెండ్లాముపైఁ జేసినప్రేమ లెల్లా నీ సొమ్మే**
**పెండ్లాములో భావన నీ పెంపే కనక**
**వెండ్లకై బంగారులకై వెలసే తపసు నీదె**
**యిండ్లిండ సంపదలు నీ వింతాఁ గనక** ॥సర్వ॥

**కిమ్ములదేహానకు భోగించిన భోగమునీదె**
**నేమ్మది నంతర్యామివి నీవు గనక**
**యిమ్ముల శ్రీ వేంకటేశ యిన్నియు విన్నవించితి**
**కమ్మినా కన్నిటికీ కర్తవు నీవే కాన** ॥సర్వ॥ **144**

**భావవివరముః**

పెదతిరుమలయ్య ఈ కీర్తనలో వొక చక్కని సత్యాన్ని వివరిస్తున్నారు. ఓ సర్వలోకేశ్వరా! నీవు సాకారరూపుడవై మాకు కనుపించకున్నా, సర్వశక్తులకుమూలము నీవే. నన్ను నిర్వహించేవాడవు నీవే. నన్ను రక్షించే నా సంరక్షకుడవూ నీవేనయ్యా! ఓ దైవమా! మేము మా తండ్రిగారిపై చూపే భక్తి నీకే చెల్లుతుంది. ఎందుకంటే అందర్నీ పుట్టించిన మా తండ్రిగారు బ్రహ్మయ్యకు నీవే కదా! తండ్రివి. పైగా మా అందరికీ అంతర్యామివి. మండ్రాడి (అన్ని బాధలను ఓర్చుకొనే) మాతల్లిపై మాకున్న మచ్చిక కూడా నీదే. ఎందుకంటే, నిండ్రా (నిండార) మా తల్లిలో వున్నవాడవూ నీవే. అంతెందుకు, మేము భార్యపై చూపుతున్న ప్రేమకూడా నీకే చెందుతుంది. అది నీసొమ్మే. ఎందుకంటే, నీవు కల్పించకపోతే యెవ్వరికీ మదనాతురత కలుగనే కలుగదు. మాకు వెండి బంగారములపై అంత తపసు (తపన)నీ మూలంగానే వచ్చింది. ఎందుకంటే ఇండ్లిండ్లా (ప్రతివాడి ఇంటిలోను) సంపదలనిచ్చింది నీవే కదా! ప్రీతిగలదేహముతో భోగించినవారు పొందే భోగంనీవుగాక మరెవరిచ్చారు? ఎందుకంటే భావావేశం పొందే అంతర్యామివి నీవే కదా! ఓ శ్రీవేంకటేశ్వరా! నీకు అన్నీ విన్నవించాను. కమ్మి (పూని) నాకన్నిటికీ కర్తవు నీవే.

★ **కిమ్ముల** – ప్రీతితో ★ **వెండ్లకు** – వెండివస్తువులకు

సంఖ్య : 431 సంపుటము : 1 పుట: 289 రాగం : మలహరి

**98 సహజాచారములెల్లా సర్వేశ్వరునియాజ్ఞే**
**అహమించి నమ్మకుండు టదియే పాషండము** ॥పల్లవి॥

**నిద్దిరించువానిచేతినిమ్మపంటివలెనే**
**చద్దికర్మములు తానే జారితే జారె**
**పొద్దువొద్దు తనలోన భోగకాంక్ష లుండఁగాను**
**అద్దలించి కర్మమొల్లననుటే పాషండము** ॥సహ॥

**కలగన్నవాఁడు మేలుకనినటువలెనే**
**తలఁగి ప్రపంచ మెందో దాఁగితే దాఁగె**
**యిల నీదేహము మోఁచి యింతాఁ గల్లలనుచు**
**పలికి తప్పనడచేభావమే పాషండము** ॥సహ॥

**ధర నద్దముచూచేటితనరూపమువలె**
**గరిమతోఁ దనయాత్మ కంటేఁ గనె**
**సరుస శ్రీవేంకటేశుసాకార మటు గని**
**కరఁగి భజించలేనికష్టమే పాషండము** ॥సహ॥ **431**

**భావవివరముః**

అన్నమయ్య వినిపిస్తున్న ఈ కీర్తనలో పాషండులను గురించి చెబుతున్నారు. వేదమును ప్రమాణముగా అంగీకరించనివారే పాషండులు. సహజత్వమునకు అనుగుణముగనున్న సదాచారములన్నీ సర్వేశ్వరుని ఆజ్ఞను పాటించేవే. అహమించి (అహంకారముతో) దానిని నమ్మకుండుటయే పాషండము అనబడును. నిద్రించేవాని చేతిలో నిమ్మపండు యెంతసేపుంటుంది?ఎప్పుడైనా పడిపోవచ్చును. తన వెంట తెచ్చుకొన్న కర్మఫలములు వాటంతట అవే జరగాలిగాని యెవ్వరూ నిర్దేశించలేరు. ప్రతిపూటా కొత్తకొత్త భోగకాంక్షలు తలెత్తుతూనే వుంటాయి. అదలించి యీ కర్మసిద్ధాంతము నంగీకరించని వారందరూ పాషండులే. కలలో ఏవేవో కనిపించినా మేలుకొంటే వుండవు. ఈ ప్రపంచం యెందు దాగినా నాకేమి దాగితే దాగనీ. ఇలలో ఈ మానవదేహాన్ని మోస్తూ అంతా భ్రాంతి అని, కలలంటూ తప్పటడుగులు వేయించే వారినే పాషండులంటారు. అద్దములో తన రూప ప్రతిబింబమును చూచినట్లు తన ఆత్మ దర్శనము చేయగలను అనేవారిని అననీయండి. ఈ తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాకార రూపమును కనులారా గాంచి కరగిపోయి మనసారా భజించవలెను. అట్లా చేయలేనివారి కష్టమే పాషండము.

★ **గరిమతో** – గొప్పదనంతో ★ **చద్దికర్మము** – పురాకృత కర్మము

సంఖ్య : 145 సంపుటము : XV పుట: 96 రాగం : మలహరి

**99 హరిదాసుఁ డగుటే యది తపము**
**పరమార్గములను ఫలమే లేదు** ॥పల్లవి॥

**తిట్టినయప్పుడు దీవించినప్పుడు**
**అట్టె సమ మగునది తపము**
**వెట్టి నేమములు వేవేలు సేసిన**
**బట్ట బయలే కాని ఫలమే లేదు** ॥హరి॥

**యిచ్చినయప్పుడు యియ్యనియప్పుడు**
**అచ్చుగ నవ్విన దది తపము**
**యిచ్చులఁ బుణ్యము లెన్ని సేసినా**
**బచ్చనలింతే ఫలమే లేదు** ॥హరి॥

**కూడినయప్పుడు గొణిగినయప్పుడు**
**ఆడిక విడిచిన యది తపము**
**యీడనె శ్రీ వేంకటేశుఁడే శరణము**
**పాడి పంతముల ఫలమే లేదు** ॥హరి॥ **145**

**భావవివరముః**

పెదతిరుమలయ్య ఈ కీర్తనలో "తపము" అంటే నిజంగా యేమిటో వివరిస్తున్నారు. ముక్కు మూసుకొని చేసేదే తపస్సు అని అనేకులు అనుకుంటారు. నిజమైన తపమునకు చాలా అర్థాలున్నాయి. ఆ వివరం వినండి. హరిదాసునిగా జీవించుట, గొప్ప తపస్సు, అట్లా జీవించనివాడు ఇంకే మార్గం అవలంభించినా లాభం లేదు. మనని కొందరు నిందిస్తారు, మరికొందరు దీవిస్తారు. వారందరినీ సమానముగా చూడగలగటం ఒక తపస్సు. వెట్టి నేమములు (తపింపజేసే నియమములు) వేలకొద్ది చేసినా, బట్టబయలే (బయటికి ఆర్భాటమే) కాని దాని వలన యేమీ ఫలము వుండదు. మనము దేని కొరకైనా వొకరిని అడిగినప్పుడు కొందరు వుదారముగా ఇచ్చేస్తారు. కొందరు లేదు పొమ్మంటారు. పైరెండు సందర్భములయందును నవ్వుతూ వుండగలుగుటయే తపము. గొప్ప ఇష్టమున్నవాడిలా యెన్ని పుణ్యకార్యాలు చేసినా అదంతా కపటమే కాని ఫలమేమీ వుండదు. మన పని కోసం యెవ్వరినైనా అడిగితే వారిలో కొందరివల్ల లాభం పొందుతాము. మరి కొందరు గొణక్కొని నిరాకరిస్తారు. అప్పుడు గొణిగిన వానిని నిందించని సమబుద్ధే గొప్ప తపస్సు ఇక్కడనే శ్రీవేంకటేశ్వరుని శరణనుట పాడి (న్యాయసమ్మతము). పంతములతో తిరిగి నిందించిన యేఫలమూ వుండదు.

★ **బచ్చెన** – కపటము ★ **ఆడిక** – నింద

సంఖ్య : 433 సంపుటము : I పుట: 290 రాగం : లలిత

**100 హరి నీయనుమతో అది నాకర్మమో**
**పరమే యహమై భ్రమయించీని ॥పల్లవి॥**

**కలుగదు శాంతము కటకట బుద్ధికి**
**చలమున నింతాఁ జదివినను**
**నిలువదు చిత్తము నీపై చింతకు**
**పలుసంపదలనుఁ బరగినను ॥హరి॥**

**తగులదు వైరాగ్యధన మాత్మకును**
**వొగి నుపవాసము లుండినను**
**అగపడదు ముక్తి ఆసలనాసల**
**జగమింతా సంచరించినను ॥హరి॥**

**విడువదు జన్మము వివేకముననే**
**జడిసి స్వతంత్రము జరపినను**
**యెడయక శ్రీవేంకటేశ్వర నీవే**
**బడిఁగాచితి విదె బ్రదికితి నేను ॥హరి॥ 433**

**భావవివరముః**

అన్నమయ్య యేమని వాపోతున్నారో ఆలకించండి. ఓ శ్రీహరీ! శాంతి లభించుటలేదు. మొండిపట్టుదల పోవటం లేదు. వైరాగ్యం వెలయుట లేదు. ముక్తి మార్గం అడియాసే అయింది. మరి ఇదంతా నీ అనుమతితోనే జరుగుతున్నదా? లేక నా కర్మమా? పరము అనేది లేనే లేదేమో!! ఇహమే పరమనే భ్రమ కలుగుతోంది అంటున్నారు. కటకటా! (అయ్యయ్యో) ఈ నాబుద్ధికి యెన్నటికి శాంతి కలుగదు. ఇంత చదివినా పంతము వదలుట లేదు. చిత్తమునీపై నిలుచుట లేదు. అనేక సంపదలు అంది వచ్చినను. అది నీ ప్రసాదముగా గ్రహించలేకపోతున్నాను. ఇదిట్లా వుండగా ఆత్మలో వైరాగ్య ధనం తగులుట లేదు. పేరుకి వుపవాసదీక్షలు చేస్తున్నాను. కాని వాటి వలన ఫలితం శూన్యం. ఎన్ని తీర్థయాత్రలు చేసినా ముక్తి మార్గం కనుపించుట లేదు. అది “ఆశ”గానే మిగిలిపోయింది. పోనీ ఆత్మవిచారము అలవరచుకొని స్వతంత్రముగా జీవన్ముక్తి పొందాలని ప్రయత్నిస్తే ఈ జన్మము నన్ను విడువదు. అన్నీ ఆలోచనలేగాని ఆచరణ ఆమడదూరం అన్నట్లు వున్నది నా పరిస్థితి. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవే నన్నువిడువక నాపై దయగొని కాచితివి. ఇందువలన నేను బ్రతికిపోయాను.

★ **జడిసి** – ప్రకటించి ★ **తగులదు** – పట్టుకొనదు

సంఖ్య : 161 సంపుటము : XV పుట: 107 రాగం : భూపాళం

**101 హరి విశ్వాత్మకుఁడు అందరిలో నున్న వాఁడు**
**దరిసించి బ్రదుకరో తప్పు లేదు యింకను ॥పల్లవి॥**

**దారుపాషాణములందు దైవముగా భావించి**
**కూరిమితో మీకు మీకె కొలిచేవారా**
**చేరి ప్రాణప్రతిష్టలు సేసేనాఁడు దేవుఁడే**
**కోరిక వైష్ణవులందు కొలువరో మీరు ॥హరి॥**

**వేదపురానార్థమందు విశ్వాసము వెట్టుకొని**
**సోదించి తెలుసుకొనే సుగుడులాల**
**వేదమె మాటలుగాను వివరించే వైష్ణవులు**
**ఆదిగురువులు వీరి నడుగరో మీరు ॥హరి॥**

**దేవుఁడె పెక్కురూపులై తేరి యెదుట నుండఁగా**
**ఆవల వెదకఁబొయ్యే ఆసక్తులాల**
**శ్రీ వేంకటేశుఁడె మతిఁ జిక్కినాఁడు దాసులకు**
**తావుకొని హరినాత్మఁ దలఁచరో మీరు ॥హరి॥ 161**

**భావవివరముః**

పెదతిరుమలయ్య ఈ కీర్తనలో విశ్వాత్మకుడై అందరిలోనూ వున్నవాడైన హరిని దర్శించి బ్రతకండయ్యా! అందులో యేతప్పు లేదు అని అంటున్నారు. పాషాణాలలో భగవంతుని దర్శించగల జనులు విష్ణుదాసులైన వైష్ణవులలో హరిని దర్శించవద్దా? అంటున్నారు. దారిలో పడివుండే పాషాణాలలో (రాళ్ళలో) దైవమును భావించి ప్రేమతో మీ అంతట మీరే కొలుస్తున్నారు కదా! దానికే ప్రాణప్రతిష్ట చేసి దైవం అంటున్నారు కదా! మరి హరిదాసులైన వైష్ణవులలోని దైవాన్ని కొలువలేరా? వేదములలోను పురాణములలోను విశ్వాసముంచి వాటిని పరిశోధించి తెలుసుకొనే సుగుడులాల (సుగుణులారా!) ఆ వేదములనే తేలికైన మాటలలో వివరించగల వైష్ణవులె ఆదిగురువులు. మీ సందేహాలను తీర్చగలవారలను వినయంగా కొలవండయ్యా! దేవుడే వేర్వేరు రూపాలల్లో మన యెదుటనే వున్నాడు. అదలా వుంటే ఆస్వామిని యెక్కడెక్కడో వెదకే ఆసక్తి తాండవించే ఘనులారా! స్వయంగా శ్రీవేంకటేశ్వరుడే ఈ హరిదాసులకు మదిలో చిక్కినాడు. ఇది గ్రహించి మీరూ హరిని ఆత్మలో నిలుపండి.

★ **ఆది** – మొట్టమొదటి ★ **తావుకొని** – నెలకొని

రచయిత:

# అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు




| | | |
|---|---|---|
| పిలవండి | : | **అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు** |
| పుట్టింది | : | **9-6-1945** |
| చదివింది | : | ఎం.టెక్. |
| ఉండేది | : | ఫ్లాట్ నెం. 5., ప్లాటు నెం. 61,<br>సిద్దార్థ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్. |
| రంధి | : | భగవన్నామ సంకీర్తన |
| నచ్చింది | : | శాస్త్రీయ సంగీతం |
| నచ్చంది | : | నక్కజిత్తులు |
| మెచ్చింది | : | సజ్జన సాంగత్యం |
| రింగండి | : | 00919393021360 |
| చదవండి | : | www.geetadeksha.com |
| ఇవ్వండి | : | e-mail : geetadeksha@gmail.com |



